


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17
సంచిక: 174

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సమతుల్యత సాధించాలి

'మహిళలు ఆరోగ్య సంరక్షణలో పాల్గొనేవారు మాత్రమే కాదు.. భవిష్యత్‌కు రూపశిల్పులు' అంటున్న 'అపోలో' సంగీతారెడ్డితో ఇంటర్వ్యూ.

వివరాలు 11లో ▸



శ్రమతోనే సక్సెస్

భారత మాత మెడలో పతకాల హారం వేసిన పీవీ సింధుతో మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ.

వివరాలు 11లో ▸



కోటి మంది డ్వాక్రా మహిళలకు ధోకా

స్త్రీనిధి బ్యాంకుపై కూటమి కన్ను

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం.. యావత్ ప్రపంచం మహిళల హక్కులు, ఆర్థిక స్వావలంబన, ఉన్నతి కోసం మాట్లాడుకుంటున్న తరుణంలో చంద్రబాబు సర్కారు ఏకంగా మహిళా దినోత్సవం రోజే వారి సాధికారతకు తూట్లు పొడిచింది! అక్కచెల్లెమ్మల అభ్యున్నతి కోసం ఏర్పాటైన స్త్రీ నిధి బ్యాంకును పూర్తిగా నిర్వీర్యం చేస్తూ అడుగులు వేస్తోంది. కూటమి సర్కారు కొత్త పథకాలు విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి కోసం ఇచ్చే రుణాలను స్త్రీ నిధి బ్యాంకు నుంచి ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో బ్యాంకు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. అదే అంతకుముందు గత ఐదేళ్లూ మహిళా సాధికారతే ధ్యేయంగా వైఎస్ జగన్ ప్రతి అడుగూ వేశారు. అన్ని పథకాలను మహిళల పేరిటే అమలు చేసి ఆర్థిక ఆసరా కల్పించారు. ప్రతి పథకానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి చిత్తశుద్ధిని చాటుకున్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమాల ద్వారా ఏకంగా రూ.427.27 కోట్ల మొత్తాన్ని అర్హులకు పారదర్శకంగా అందించారు.

విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి రుణాలకు 'స్త్రీ నిధి' సొమ్ములు

ఏటా రూ.1,000 కోట్లు ఆ రెండు పథకాలకే..

అక్క చెల్లెమ్మల సాధికారతకు రుణాలు సమకూరుస్తున్న స్త్రీ నిధి బ్యాంక్.. మహిళల ఆర్థిక అవసరాలు తీర్చేలా 12 ఏళ్ల క్రితం ఏర్పాటు

కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మికి బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించని ప్రభుత్వం.. హామీని నిలబెట్టుకోకుండా, బడ్జెట్‌లో పథకాలకు నిధులు కేటాయించకుండా దొంగాట

2లో

చెప్పండి.. చేసేస్తాం

- రెడ్‌బుక్ కుట్రలకు డీజీపీ జీ హుజూర్
- అత్యంత వివాదాస్పదంగా హరీశ్ గుప్తా వ్యవహార శైలి
- ప్రభుత్వ పెద్దల కుట్రకు వత్తాసు
- వాచ్‌మెన్ రంగన్న సహజ మరణంపై దర్యాప్తు
- అది అనుమానాస్పద మృతి అంటూ అప్పుడే నిర్ధారణ!
- ఎస్పీలు, కమిషనర్లకు టార్గెట్ పెట్టి మరీ ఒత్తిడి

2లో

'కుట్టు' స్కీమ్.. గుట్టుగా స్కామ్!

మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వలేదుగానీ నిధులిచ్చేశారు



- లబ్ధిదారుల ఎంపిక పేరుతో రూ.60 లక్షలు విడుదల.. మిషన్ల కొనుగోలులో రూ.వంద కోట్ల గోల్‌మాల్
- రూ.60 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సు విడుదలకు రంగం సిద్ధం
- అత్యధిక మొత్తానికి కోట్ చేసిన సంస్థలకు కట్టబెట్టేసిన వైనం.. నేడు సీఎం చేతుల మీదుగా పంపిణీ అంటూ ఆర్భాటం

10లో

నేడు డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు

- మహిళల కోసం వర్క్ ఫ్రం హోం విధానం
- అనకాపల్లి ఎలీప్ ప్రాజెక్టుతో 10,000 మందికి ఉపాధి లభిస్తుంది: సీఎం చంద్రబాబు

3లో

అప్పులపై కట్టుకథలు.. అసెంబ్లీలో బట్టబయలు

జగన్‌పై పచ్చ మీడియా చల్లిందంతా బురదే



- అసెంబ్లీ వేదికగా అంగీకరించిన కూటమి సర్కారు
- రూ.14 లక్షల కోట్లు.. రూ.10 లక్షల కోట్ల అప్పులంటూ తప్పుడు ప్రచారం
- గత సర్కారులో బడ్జెట్ అప్పులు, గ్యారెంటీ అప్పులు కలిపి రూ.6.46 లక్షల కోట్లే
- 2023-24 మార్చి నాటికి బడ్జెట్ అప్పులు రూ.4.91 లక్షల కోట్లు
- 2023-24 మార్చి నాటికి గ్యారెంటీ అప్పులు రూ.1.54 లక్షల కోట్లు
- కాగ్, ఆర్‌బీఐతో పాటు మాజీ సీఎం జగన్ చెపుతున్నవి ఈ లెక్కలే
- వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నకు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి కేశవ్ ఇదే సమాధానం

10లో

విక్రాంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

కాకినాడ సీ పోర్ట్ వాటాల బదిలీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు

5లో

పేర్ని నానికి ముందస్తు బెయిల్

మంజూరు చేసిన హైకోర్టు

5లో

పోసానికి ఉపశమనం

కడప కోర్టు బెయిల్ మంజూరు

5లో

మార్గదర్శి, రామోజీది 45 ఏళ్ల నయవంచన

వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందే



తెలంగాణ హైకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి వాదనలు

ఫైనాన్షియర్స్‌కు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల వత్తాసు

సుప్రీంకోర్టు సూచన మేరకే ప్రతివాదిగా రిజర్వ్ బ్యాంక్

మార్గదర్శి అక్రమాలకు పాల్పడిందని ఆర్‌బీఐ తేల్చింది

క్రిమినల్ చర్యలకు హెచ్‌యూఎఫ్ సభ్యులూ బాధ్యులే

కఠిన శిక్ష విధించకుంటే దేశమే ప్రమాదంలో పడిపోతుంది

'మార్గదర్శి' కేసులో వాదనలు వినిపించిన అరుణ్‌కుమార్

అనుబంధ పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం

12లో

కోటి మంది డ్వాక్రా మహిళలకు ధోకా

స్త్రీనిధి బ్యాంకుపై కూటమి సర్కార్ కన్ను

- విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి రుణాలకు "స్త్రీ నిధి" సొమ్ములు..
- ఏటా రూ.1,000 కోట్లు ఆ రెండు పథకాలకే..
- అక్క చెల్లెమ్మల సాధికారతకు రుణాలు సమకూరుస్తున్న స్త్రీ నిధి బ్యాంక్
- మహిళల ఆర్థిక అవసరాలు తీర్చేలా 12 ఏళ్ల క్రితం ఏర్పాటు
- కళ్యాణలక్ష్మి, విద్యాలక్ష్మికి బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించని ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పొదుపు సంఘాల మహిళలకు స్త్రీ నిధి బ్యాంకు ఇచ్చే రూ.4 వేల కోట్ల రుణాల్లో రూ.1,000 కోట్ల చొప్పున కల్యాణలక్ష్మీ, విద్యాలక్ష్మీ పథకాలకు నాలుగు శాతం వడ్డీకి రుణాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మొత్తం రుణాల్లో నాలుగో వంతు రుణాలను తక్కువ వడ్డీకి ఇవ్వడం వల్ల స్త్రీ నిధి సంస్థ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోనుంది. గత ఐదేళ్లలో స్త్రీ నిధికి సంబంధించి దాదాపు రూ.4 వేల కోట్లు నిరంతరం పొదుపు సంఘాల మహిళల వద్ద రుణాల రూపంలో ఉన్నాయి. పథకాల అమలుకు చిత్తశుద్ధితో బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఇలా అడ్డదారిలో మళ్లించడం వల్ల పొదుపు సంఘాల వ్యవస్థ దెబ్బతింటుందనే ఆందోళన మహిళల్లో వ్యక్తమవుతోంది. కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మహిళలను మోసం చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం 'స్త్రీ నిధి' నిధులను వాడుకోవాలని నిర్ణయించింది. కోటి మందికి పైగా ఉన్న పొదుపు మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే సంస్థ నిధులను వాడుకోవడం అంటే.. ఆ మేరకు డ్వాక్రా మహిళల రుణాల లభ్యత తగ్గించడమేననే ఆందోళన వ్యక్తమవుతోంది. అత్యవసర సమయాల్లో ఆర్థిక తోడ్పాటు అందించే స్త్రీ నిధి బ్యాంకును నష్టాల ఊబిలోకి గెంటేస్తోందని, సర్కారు నిర్వాకాలతో సంస్థ మూతపడితే పేద మహిళల ఆర్థిక అవసరాలకు తోడ్పాటు కరువై దిక్కుతోచని పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేకుండా.. స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇప్పించాలన్న కూటమి సర్కారు యోచనపై అధికారులు విస్తుపోతున్నారు.

స్త్రీ నిధి బ్యాంకు నిబంధనలివీ..

స్త్రీ నిధి బ్యాంకు అందించే రుణాలను పేద మహిళల కుటుంబాల జీవనోపాధుల పెంపు లేదా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసమే వెచ్చించాలి.

రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళల ఆదాయం పెరిగేలా తోడ్పాటునివ్వాలి.

2019-24 మధ్య స్త్రీనిధి సంస్థ ద్వారా పేద మహిళలకు అందించిన రుణ తోడ్పాటు

అందజేసిన రుణాలు (రూ. కోట్లలో)

సంవత్సరం	రుణాలు
2019-20	1,804
2020-21	2,075
2021-22	2,771
2022-23	3,122
2023-24	3,400

నోట్: 2018-19లో కేవలం రూ. 895 కోట్లు మాత్రమే అప్పటి ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా పొదుపు సంఘాల మహిళలకు రుణ సాయం చేయగా, జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రెట్టింపు కంటే ఎక్కువకు పెంచడంతో పాటు అంతకు ముందు పొదుపు సంఘాల మహిళలకు 13 శాతం చొప్పున వడ్డీకి ఇచ్చే రుణాలను అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జోక్యం చేసుకొని ఆ రుణాలపై వడ్డీని రెండు శాతం తగ్గించి 11 శాతానికే అందించే ఏర్పాటు చేశారు.

7 శాతం వడ్డీకి అప్పులు తెచ్చి... 4 శాతం వడ్డీకి రుణాలివ్వాలట!

సొంత నిధులు తక్కువగా ఉండే స్త్రీ నిధి బ్యాంకు ఇతర బ్యాంకుల నుంచి ఏడు శాతం వడ్డీకి తీసుకొచ్చిన డబ్బులనే 11 శాతం వడ్డీకి పొదుపు మహిళలకు రుణంగా ఇస్తూ ఉంటుంది. ఏడు శాతానికి పైన తీసుకొనే నాలుగు శాతం వడ్డీలో రెండు శాతం వడ్డీ డబ్బులను తిరిగి గ్రామ, మండల సమాఖ్యలకు, మిగిలిన 2 శాతం వడ్డీ డబ్బులను స్త్రీ నిధి సిబ్బంది జీతాలు, సంస్థ నిర్వహణకు వినియోగిస్తుంటారు. స్త్రీ నిధి సంస్థ ఏడు శాతం వడ్డీకి తెచ్చుకుంటున్న నిధులను ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా ఆలోచన చేస్తున్న కళ్యాణలక్ష్మీ, విద్యాలక్ష్మీ పథకాల లబ్ధిదారులకు నాలుగు శాతం వడ్డీకే రుణాలు ఇప్పించేలా కసరత్తు చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రణాళిక ఇప్పటికే దాదాపు కొలిక్కి వచ్చింది. అంటే మూడు శాతం చొప్పున వడ్డీ డబ్బులను స్త్రీ నిధి బ్యాంకు నష్టపోవాల్సి ఉంటుంది. ఈ పథకాలు అమలు చేయడం వల్ల స్త్రీ నిధి సంస్థకు ఆర్థికంగా వాటిల్లే నష్టానికి సంబంధించి తిరిగి చెల్లింపులు, అదనపు సాయం అందించడం గురించి ఇప్పటిదాకా ప్రభుత్వ స్థాయిలో జరిగిన కసరత్తులో ఎక్కడా కనీసం చర్చ జరగలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. పూర్తిగా స్త్రీ నిధి సంస్థ నిధులతోనే ఈ పథకాలను అమలు చేసేలా అడుగులు పడుతున్నాయి. ఒకవైపు వడ్డీకి తెచ్చుకునే డబ్బులను మరోవైపు అంతకంటే తక్కువ వడ్డీకి రుణాలుగా ఇవ్వడం ద్వారా స్త్రీ నిధి సంస్థ నష్టాల ఊబిలోకి వెళ్లి మూతపడే అవకాశం ఉంటుందని మహిళా సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

నిధులు మళ్లిస్తే ఊరుకోం



స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన స్త్రీ నిధి నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే ఊరుకునేది లేదు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ప్రకటించిన కళ్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి. ఆ పథకాల అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం అన్యాయం. పొదుపు మహిళల అభ్యున్నతికి ఉద్దేశించిన స్త్రీ నిధిని మళ్లించేందుకు యత్నిస్తుండటం దారుణం. దీనివల్ల పొదుపు మహిళల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలి.

– పి.నిర్మలమ్మ, ఐద్వా సీనియర్ నాయకురాలు, కర్నూలు

స్త్రీ నిధిని మళ్లించడం దారుణం



టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమ పథకాలకు గండికొడుతోంది. మహిళా సాధికారిత గురించి గొప్పలు చెబుతూ కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటాన్ని బట్టి పాలకులకు చిత్తశుద్ధి లేదని రుజువవుతోంది. స్త్రీ నిధి బ్యాంకు రుణాలను ఇతర పథకాలకు మళ్లించే యత్నాలు సిగ్గుచేటు. ప్రభుత్వ మోసపూరిత విధానాలను మహిళలు గమనిస్తున్నారు.

– ఎం.విజయ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు

ఊరుకునేది లేదు..



కూటమి ప్రభుత్వం స్త్రీ నిధిని ఇతర పథకాలకు మళ్లిస్తే ఊరుకునేది లేదు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో డ్వాక్రా మహిళలకు రుణాలు తగ్గే ప్రమాదం ఉంది. బ్యాంకు నిబంధనలను తుంగలో తొక్కి అసంబద్ధ నిర్ణయాలు తీసుకోవడం సరికాదు.

– చిట్టెమ్మ, డ్వాక్రా సంఘం సభ్యురాలు, చిత్తూరు జిల్లా.

నిధులు కేటాయించకపోవడం దారుణం



కల్యాణలక్ష్మీ, విద్యాలక్ష్మి పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణం. డ్వాక్రా మహిళల సాధికారతకు రుణాలు సమకూరుస్తున్న స్త్రీ నిధి బ్యాంకు నిధులను ఈ పథకాలకు మళ్లిస్తే డ్వాక్రా మహిళలకు సమస్యలు తప్పవు. డ్వాక్రా నిధులతో కుటుంబాలను నెట్టుకొస్తున్న పేద వర్గాల మహిళలు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితిని ఈ ప్రభుత్వం కల్పిస్తోంది. డ్వాక్రా మహిళలకు స్త్రీ నిధి రుణాలు అందని పరిస్థితి ఉత్పన్నం కానుంది. డ్వాక్రా మహిళలకు ద్రోహం తలపెట్టే యత్నాలను విరమించుకోవాలి. కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలి. డ్వాక్రా మహిళలకు ఇబ్బంది లేకుండా బ్యాంకు రుణాలను సక్రమంగా అందించి ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– ఇ.చంద్రావతి, శ్రామిక మహిళా సంఘాల ప్రతినిధి, కాకినాడ జిల్లా

స్త్రీ నిధి నిబంధనలు గాలికి..

సాధారణంగా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండే మహిళలు బ్యాంకు లింకేజీ కార్యక్రమంలో కమర్షియల్ బ్యాంకు ద్వారా రుణాలు పొందుతుంటారు. బ్యాంకు లింకేజీ ద్వారా మహిళలు పొందే రుణాలను మూడు నాలుగేళ్ల కాల పరిమితితో నెలవారీ కిస్తీ రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం క్యాష్ అండ్ క్రెడిట్ విధానం అమలులో ఉన్నా.. ఒక్కో సంఘం మూడు నాలుగేళ్లకు ఒకసారే బ్యాంకు లింకేజీ లోన్లు తీసుకుంటాయి. పొదుపు సంఘం ద్వారా మహిళలు ఒకసారి బ్యాంకు లింకేజీ రుణం పొందిన తర్వాత అత్యవసర సమయాల్లో స్త్రీ నిధి ద్వారా అదనపు ఆర్థిక రుణాన్ని పొందుతుంటారు. పొదుపు మహిళలకు బ్యాంకు లింకేజీ కార్యక్రమంలో రుణాలిచ్చినా, స్త్రీ నిధి ద్వారా రుణాలిచ్చినా నిబంధనల ప్రకారం ఆయా కుటుంబాల జీవనోపాధుల పెంపు లేదా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసమే వెచ్చించాలి. ఆ రుణాలను ఉపయోగించుకొని తమ ఆదాయం పెంచుకోవాలి. అయితే కూటమి సర్కారు ఆలోచన దీనికి భిన్నంగా ఉంది. స్త్రీ నిధి బ్యాంకు నిబంధనలను తుంగలో తొక్కి కొత్త పథకాలకు మళ్లిస్తోంది.

జగన్ హయాంలో ప్రభుత్వమే నేరుగా సాయం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల పాటు పేద కుటుంబాల పిల్లల చదువులకు అండగా నిలుస్తూ అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా తిరిగి చెల్లించే అవసరం లేకుండా నేరుగా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసింది. కల్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమాల ద్వారా రూ.427.27 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని విధానంలో అర్హులకు అందించింది. ఎన్నికల ముందు ఎడాపెడా హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు లబ్ధిదారులంతా తప్పనిసరిగా తిరిగి చెల్లించాల్సిన రుణాల రూపంలో విద్యాలక్ష్మీ, కల్యాణలక్ష్మీ పథకాల అమలుకు సిద్ధమైంది. ఇందుకోసం 12 ఏళ్లుగా కోటి మందికి పైగా పొదుపు మహిళల ఆర్థిక అవసరాలు తీర్చిన స్త్రీ నిధి సంస్థను బలి పెడుతోంది. స్త్రీ నిధిని నష్టాల్లోకి నెట్టి నిర్వీర్యం చేసేలా అడుగులు వేయటాన్ని మహిళా సంఘాలు, రాజకీయ వర్గాలు తప్పుబడుతున్నాయి.

జగన్ రాసింది చరిత్ర.. బాబు చేస్తోంది దగా

మహిళలే కేంద్రంగా 'సంక్షేమం' అందించిన జగన్ (డీబీటీ స్కీమ్స్ రూపంలో)..

పథకం	లబ్ధిదారులు	మొత్తం(రూ.కోట్లు)
జగనన్న అమ్మ ఒడి	44,48,865	26,067.30
జగనన్న వసతి దీవెన	25,17,245	4,275.76
జగనన్న విద్యా దీవెన	29,65,930	12,609.68
వైఎస్సార్ సున్నావడ్డీ(పొదుపు సంఘాలు)	1,05,13,365	4,969.04
వైఎస్సార్ చేయూత	33,14,901	19,189.59
వైఎస్సార్ ఆసరా	78,94,169	25,570.79
వైఎస్సార్ కాపునేస్తం	4,62,878	2,029.92
వైఎస్సార్ నేతన్ననేస్తం	35,983	280
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	4,95,269	1876.97
వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా	56,194	427.27
హౌసింగ్	21,31,564	12,295.97
వైఎస్సార్‌రైతు భరోసా	22,20,146	14,439
వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు(రైతులు)	8,46,622	205.05
పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ)	8,60,375	815.4
వైఎస్సార్ పెన్షన్‌కానుక	44,80,257	58,509.40
జగనన్న చేదోడు	1,84,665	404.58
వైఎస్సార్ వాహనమిత్ర	32,216	97
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	9,31,533	720.18
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	14,96,814	4,736.18
మొత్తం	4,58,88,991	1,89,519.07



చదువుకునే బిడ్డలకు గట్టి చేయూతనిచ్చారు.. ఆడబిడ్డలకు గూడు కట్టించారు.. రాజకీయాల్లో నాయకురాళ్లుగా నలుగురినీ నడిపించేందుకు పదవులిచ్చి పెద్దపీట వేశారు.. సమాజంలో మహిళల భద్రతకు రక్షణ కవచంగా నిలిచారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా అమ్మ కడుపులోని బిడ్డ నుంచి ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వ వరకు మహిళలే కేంద్రంగా సంక్షేమ పథకాలు అందించారు. నవరత్న కాంతుల్లో మహిళా లోకం నవశకం నాంది పలికింది. ఆయన పాలనలో చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాలతో మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ముందుకుసాగారు. మహిళాభివృద్ధి ద్వారానే కుటుంబ అభివృద్ధి జరుగుతుందనే గట్టి విశ్వాసంతో వైఎస్ జగన్ కొత్త చరిత్ర సృష్టించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేదలైన అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారు. - సాక్షి, అమరావతి

నాన్‌డీబీటీ ద్వారా..

పథకం	లబ్ధిదారులు	మొత్తం(రూ.కోట్లు)
ఇళ్ల స్థలాలు	31,19,000	77,975
జగనన్న తోడు	12,50,830	2,025
జగనన్న గోరుముద్ద	21,63,391	2,669
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	35,70,675	9,894
జగనన్న విద్యాకానుక	25,12,423	1,784.26
మొత్తం	1,26,16,319	94,347.26

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో సూపర్‌సిక్స్ హామీలను కురిపించి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మహిళలను దగా చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ అమలుచేసిన మహిళా సంక్షేమ పథకాలన్నింటినీ అటకెక్కించిన చంద్రబాబు కనీసం తాను ఇచ్చిన హామీలనూ పట్టించుకోవడం లేదు. సూపర్ సిక్స్ అమలుకే ఏడాదికి రూ.79,867 కోట్లు అవసరమైతే గత నవంబరులో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో రూ.7,282 కోట్లే ఇచ్చి రూ.865 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ ఏడాది (2025–26) బడ్జెట్లో సూపర్ సిక్స్ హామీలకు రూ.17,179 కోట్లు మాత్రమే కేటాయించగా ఎంత ఖర్చు చేస్తారనేది అనుమానమే. ప్రధానంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, ఆడబిడ్డ సంక్షేమ నిధి వంటి అనేక పథకాల అమలులో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

ప్రధాన హామీల అమలులో వైఫల్యం ఇలా..

ఆడబిడ్డ నిధి దగా: 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున (ఏడాదికి రూ.18వేలు) ఇస్తామన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలోని 1.80 కోట్ల మందికి రూ.32,400 కోట్లు కేటాయించాలి. రెండేళ్లకు రూ.64,800 కోట్లు కావాలి. కానీ, గత ఏడాది, ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు చేయకుండా ఆడబిడ్డలను దగా చేశారు.

ఉచిత బస్సు.. తుస్సు: మహిళలందరికీ ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం నెలకు రూ.275 కోట్ల చొప్పున ఏడాదికి రూ.3,500 కోట్లవుతుంది. నిరుడు, ఈ ఏడాది కలిపి బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు ఎగరగొట్టడంతో ఉచిత బస్సు తుస్సు అనిపించారు.

తల్లికి వందనంలోనూ వంచనే: పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. గత బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి రూ.5,386 కోట్లు కేటాయింపులు చేసినా రూపాయి కూడా ఎవరికీ ఇవ్వలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో ఆ పథకానికి రూ.9,407 కోట్లు కేటాయించినట్లు చూపారు. బడ్జెట్ డాక్యుమెంట్‌లో డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌లో మాత్రం రూ.8278 కోట్లు కేటాయించినట్లు మాత్రమే ఉంది. 1 నుంచి 12వ తరగతి రాష్ట్రంలో 87,41,885 మంది పిల్లలు చదువుతున్నారు. వారికి రూ.15 వేల చొప్పున ఆ పథకానికి రూ.13,112 కోట్లు కేటాయించాలి.

విద్యా దీవెనను భ్రష్టు పట్టించేలా: విద్యా దీవెన పథకానికి రూ.3,900 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, చంద్రబాబు గత ఏడాది రూ.700 కోట్లే కేటాయించారు. విద్యా దీవెన, వసతి దీవెనకు ఈ ఏడాది మరో రూ.3,900 కోట్లు కావాలి. ఇచ్చింది రూ.2,600 కోట్లు మాత్రమే.

దీపం సాయం..అంతా గ్యాస్: రాష్ట్రంలోని 1.59 కోట్ల గ్యాస్ కనెక్షన్లకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు కోసం రూ.4 వేల కోట్లు అవుతుంది. నిరుడు కేవలం రూ.865 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది రూ.2,439 కోట్లే కేటాయించింది.

సున్నా వడ్డీ రుణాలు సున్నానేనా: డ్వాక్రా సంఘాలకు రూ.పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అన్నారు. దీనికోసం గత బడ్జెట్‌లో రూ.950 కోట్లు కేటాయించినా రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ ఏడాది రూ.వంద కోట్లే కేటాయించారు.

50ఏళ్లకే పెన్షన్.. ఒట్టిదే: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని హామీ ఇచ్చారు. మరో 20 లక్షల మందికి నెలకు రూ.4 వేల చొప్పున అందించాలంటే ఏడాదికి రూ.9,600 కోట్లు అవుతుంది. రెండు బడ్జెట్లలోనూ కేటాయింపులు చేయకపోవడంతో 50 ఏళ్లకే పెన్షన్ ఒట్టిదేనా? అని మహిళలు మండిపడుతున్నారు. ఇవే కాకుండా నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ పథకాలకు మొండిచేయే. ఇక పింఛన్ల కోత సరేసరి.

చెప్పండి.. చేసేస్తాం

రెడ్‌బుక్ కుట్రలకు డీజీపీ హరీశ్ గుప్తా జీ హుజూర్..



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పెద్దల రెడ్‌బుక్ కుట్రలకు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సెల్యూట్ చేస్తుండటం యావత్ పోలీసు శాఖను విభ్రాంతికి గురిచేస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులతో మరింతగా విరుచుకు పడాలని ఆయన జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు టార్గెట్ పెట్టి మరీ ఒత్తిడి చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. మరోవైపు సీబీఐ దర్యాప్తు చేస్తున్న మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రాష్ట్ర పోలీసు శాఖ అత్యుత్సాహం ప్రదర్శిస్తుండటం విస్మయ పరుస్తోంది. వివేకా హత్య కేసులో సాక్షిగా ఉన్న రంగన్న సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయన ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు తొలుత పులివెందుల, ఆ తర్వాత కడప రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో గురువారం మృతి చెందాడు. కాగా, ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని కూటమి ప్రభుత్వ పెద్దలు పన్నాగం పన్నారు. రంగన్న మృతితోపాటు మరికొన్ని సహజ మరణాలపై దర్యాప్తు కోసం సిట్‌ను నియమించారు. వివేకా హత్య కేసును ఐదేళ్లుగా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. మరి రంగన్న తదితరుల సహజ మరణాలపై ఏపీ పోలీసులు సిట్ పేరుతో దర్యాప్తు చేయడం ఏమిటని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కానీ, డీజీపీ గుప్తా మాత్రం ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తుండటం విస్మయ పరుస్తోంది. వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత డీజీపీ గుప్తా.. తాజా సిట్ గురించి మంత్రులకు వివరించారు. పైగా 'రంగయ్య మృతి అనుమానాస్పదమే' అని చెప్పారు. ఇంకా సిట్ దర్యాప్తే మొదలు పెట్టకుండా రంగన్న మృతి అనుమానాస్పదమని డీజీపీ ఏకపక్షంగా మంత్రులకు వివరించడం పోలీసు శాఖ ప్రతిష్టను రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టినట్టేనని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. తద్వారా సిట్ నివేదిక ఎలా ఉండబోతోందన్నది స్పష్టమవుతోందని చెబుతున్నారు.

వేధించకపోతే వేటేస్తాం..

'వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా అక్రమ కేసుల జోరు పెంచండి' అని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు తేల్చిచెప్పారు. ఇదే ప్రధానాంశంగా ఆయన ఇటీవల టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలకు వ్యతిరేకంగా కూటమి నేతలు చేస్తున్న ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని.. ప్రాథమిక ఆధారాలు లేకుండానే అక్రమ కేసులు నమోదు చేసేయాలని ఆయన విస్పష్టంగా ఆదేశించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఏయే నేతలపై ఫిర్యాదు చేయాలన్నది టీడీపీ ప్రధాన కార్యాలయం నిర్ణయిస్తుందని, ఆ ఫిర్యాదులు అందిన వెంటనే అరెస్టులకు తెగబడాలని డీజీపీ నిర్దేశించారని సమాచారం. ఈ సందర్భంగా న్యాయ, సాంకేతిక అంశాలను కొందరు ఎస్పీలు ప్రస్తావించగా, డీజీపీ గుప్తా వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. చెప్పినట్టు వేధించాల్సిందేనని, లేకుంటే బదిలీ వేటేస్తామని ఆయన తేల్చి చెప్పినట్లు సమాచారం. మరోవైపు సీఐడీ, ఏసీబీ, విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ద్వారా కూడా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసుల జోరు పెంచామని కూడా ఆయన వారితో చెప్పడం గమనార్హం. ఎవరు ఎంతగా అక్రమ కేసులతో వేధిస్తున్నారన్నదాన్ని బట్టి ఎస్పీలు, కమిషనర్ల పనితీరు నివేదికలు ఆధారపడి ఉంటాయని కూడా వ్యాఖ్యానించినట్లు సమాచారం.

తీసుకోండి ఫిర్యాదులు.. పెట్టండి కేసులు

- పోసాని కృష్ణ మురళిపై ఒక్కసారిగా అబద్ధపు ఫిర్యాదులు జోరందుకున్నాయి. ఆయనపై రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో పోలీసులు చకచకా అక్రమ కేసులు నమోదు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన్ను అరెస్ట్ చేసి.. అన్నమయ్య, పల్నాడు, కర్నూలు జిల్లాలు తిప్పుతూ వేధింపులకు తెగబడ్డారు.
- మాజీ మంత్రి విడదల రజినీని తాజాగా లక్ష్యంగా చేసుకున్నారు. ఆమెపై ఓ క్వారీ యజమాని ద్వారా అవాస్తవ ఆరోపణలతో ఏసీబీకి ఫిర్యాదు ఇప్పించారు. ఆ ఫిర్యాదు ప్రతి దుమ్ము దులిపిన ఏసీబీ అధికారులు ఆమెను అక్రమ కేసుతో వేధించేందుకు సన్నద్ధమవుతున్నారు.
- పర్చూరు నియోజకవర్గంలో గతంలో ఓట్లను తొలగించారనే ఆరోపణలతో ప్రభుత్వం మరో కుట్రకు తెరతీసింది. అందుకోసం కుట్ర పూరితంగా టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావుతో ఫిర్యాదు చేయించింది. ఆ వెంటనే ఓట్ల తొలగింపుపై దర్యాప్తునకు సిట్‌ను నియమించింది. టీడీపీ అస్మదీయ అధికారి, ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ను సిట్ ఇన్‌చార్జ్‌గా డీజీపీ సూచించడం గమనార్హం. ఆయన ఇప్పటికే రఘురామకృష్ణ రాజు ఫిర్యాదుతో ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్, విజయ్‌పాల్ తదితరులపై చెలరేగిపోతున్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు కొట్టివేసిన అభియోగాలపై తాజాగా కేసు నమోదు చేసి మరీ వేధింపులకు పాల్పడుతూ దామోదర్ హల్‌చల్ సృష్టిస్తున్నారు. ఈ కేసులో అబద్ధపు వాంగ్మూలాలు ఇవ్వాలంటూ గుంటూరు జీజీహెచ్ అధికారులను వేధిస్తున్నారు. అటువంటి ట్రాక్ రికార్డు ఉన్న ఈయనకు సిట్ బాధ్యతలు అప్పగించడం పక్కా ప్రభుత్వ పన్నాగమే.
- ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై సీఐడీ నమోదు చేసిన అక్రమ కేసులోనూ డీజీపీ గుప్తా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఉద్యోగి సత్య ప్రసాద్‌ను వేధించి అబద్ధపు వాంగ్మూలం ఇప్పించారు. తాజాగా ప్రభుత్వ మాజీ సలహాదారుడు రాజ్ కసిరెడ్డితో అబద్ధపు వాంగ్మూలం ఇప్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకోసం ఆయన సమీప బంధువులను వేధిస్తూ ఒత్తిడి పెంచుతున్నారు. తాము చెప్పినట్టు అబద్ధపు వాంగ్మూలం ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేస్తామని రాజ్ కసిరెడ్డి సమీప బంధువుల ఇళ్లకు పోలీసులు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారు.

104, 108 టెండర్లకు మూడు బిడ్లు

అస్మదీయ సంస్థకు కట్టబెట్టేలా నిబంధనలు!

సాక్షి, అమరావతి: 108, 104, ఎమర్జెన్సీ కాల్‌ సెంటర్‌ నిర్వహణ కోసం టెండర్లు పిలవగా గడువు ముగిసే సమయానికి మూడు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. శుక్రవారంతో బిడ్లు దాఖలు చేయడానికి గడువు ముగిసింది. ఆంధ్ర హాస్పిటల్స్, జన్‌ ప్లస్, భవ్య అనే మూడు సంస్థలు బిడ్లు దాఖలు చేసినట్లు తెలిసింది. బిడ్ల ఎవాల్యుయేషన్‌ కోసం ఆంధ్రప్రదేశ్‌ మెడికల్‌ సర్వీసెస్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఏపీఎంఎస్‌ఐడీసీ) కమిటీని నియమించనుంది. వారం, పది రోజుల్లో ఎవాల్యుయేషన్‌ పూర్తి చేసి నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియ ముగించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుత నిర్వహణ సంస్థకు 2027 వరకు కాంట్రాక్ట్‌ సమయం ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కాంట్రాక్టులన్నింటిని అస్మదీయులకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకుంది. ఈ క్రమంలో ప్రస్తుత నిర్వహణ సంస్థపై ఒత్తిడి తెచ్చి ఎంవోయూ రద్దు చేసుకునేలా ప్రభుత్వం చేసింది. అనంతరం ప్రభుత్వ పెద్దలు ఓ అస్మదీయ సంస్థకు ఐదేళ్ల కాంట్రాక్ట్‌కు కట్టబెట్టడం కోసం కొత్త టెండర్లను పిలిచారు. ఆ సంస్థకు మేలు చేసేలా టెండర్‌ నిబంధనలను రూపొందించారని పెద్ద ఎత్తున విమర్శలున్నాయి.

హైకోర్టులో పలువురు స్టాండింగ్‌ కౌన్సిళ్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, కర్నూలు జిల్లాల దేవదాయ శాఖ స్టాండింగ్‌ కౌన్సిల్‌గా అన్నె దేవి సుభాషిణి నియమితులయ్యారు. అలాగే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాల దేవదాయ శాఖ స్టాండింగ్‌ కౌన్సిల్‌గా తూము వేణుగోపాల్‌ను నియమించారు. ఏపీ ఖాదీ, విలేజ్‌ ఇండస్ట్రీస్‌ బోర్డు స్టాండింగ్‌ కౌన్సిల్‌గా తెన్నేటి కుమార రత్నం, జేఎన్‌టీయూ అనంతపురం స్టాండింగ్‌ కౌన్సిల్‌గా దారపు క్రిష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నాగబాబు నామినేషన్‌ దాఖలు

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి తరపున జనసేన అభ్యర్థిగా నాగబాబు శుక్రవారం నామినేషన్‌ దాఖలు చేశారు. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, బీజేపీ శాసనసభా పక్ష నేత పి.విష్ణుకుమార్‌ రాజు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి రిటర్నింగ్‌ అధికారి వనితా రాణికి నామినేషన్‌ పత్రాలు సమర్పించారు.

ఆర్టీసీలో మహిళా ఉద్యోగుల పాత్ర నిరూపమానం

ఎండీ సీహెచ్‌. ద్వారకా తిరుమల రావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల పాత్ర నిరూపమానమైందని ఆ సంస్థ ఎండీ సీహెచ్‌. ద్వారకా తిరుమల రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 5,300మంది మహిళా ఉద్యోగులు ఆర్టీసీలో సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఆర్టీసీ ఈడీ (అడ్మిన్‌) జీవీ రవివర్మ, ఆర్టీసీ విజిలెన్స్‌ అధికారి శోభా మంజరితోపాటు పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

సాక్షి, అమరావతి: ఆందోళన చేస్తున్న వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేశారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం (తిరుపతి) పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 4 జిల్లాల్లో వెటర్నరీ వైద్య విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. తమ స్టైఫండ్‌ను నెలకు రూ.7వేల నుంచి రూ.25 వేలకు పెంచాలని గత నెల 3వ తేదీ నుంచి 33 రోజులుగా కళాశాలల వద్ద నిరాహార దీక్షలు చేపట్టారని పేర్కొన్నారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు అనేకమార్లు విన్నవించినా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ఇప్పటికైనా స్టైఫండ్‌తోపాటు వారి సమస్యలు పరిష్కరించాలని శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు.

మెప్మా మహిళలకు ఆర్థిక చేయూత

సాక్షి, అమరావతి: విజయవంతంగా వ్యాపారాలు చేస్తూ సత్ఫలితాలు సాధించిన పట్టణ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ – మెప్మా (మిషన్‌ ఫర్‌ ఎలిమినేషన్‌ ఆఫ్‌ పోవర్టీ ఇన్‌ మునిసిపల్‌ ఏరియాస్‌) ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. ఆన్‌లైన్‌ వ్యాపారంలోకి అడుగుపెట్టి తక్కువ కాలంలోనే స్వయం సహాయక సంఘాల మహిళలు రూ.1.5 కోట్ల అమ్మకాలు చేసి ప్రపంచ రికార్డు నమోదు చేసిన నేపథ్యంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మార్కాపురంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్టు మెప్మా ఎండీ తేజ్‌ భరత్‌ తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తిగా నిలిచిన మహిళా సభ్యులను సత్కరించనున్నట్టు వివరించారు.

అయ్యో.. ‘పాప’ం..

- ఆస్పత్రి బాత్‌రూం కమోడ్‌లో మృత ఆడ శిశువు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందు రోజే ఘోరం
- శిశువు మృతి చెందిందా? తల్లి చేతిలో హతమయ్యిందా?
- ఘటనపై భిన్న వాదనలు
- రక్తస్రావమవుతున్నా ఆస్పత్రి నుంచి పరారైన తల్లి
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రి సిబ్బంది
- కైకలూరు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో సంచలనం



కైకలూరు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన ఆడ శిశువు

కైకలూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముందు రోజే ఘోరం చోటుచేసుకుంది. ఓ జాలిలేని తల్లి పుట్టిన ఆడబిడ్డను ఆస్పత్రి బాత్‌రూం కమోడ్‌లో విసిరేసి పరారైంది. పుట్టిన బిడ్డ లోకాన్ని చూడకుండానే.. ఒక తల్లి తన పొత్తిళ్ల బంధం తెంచేసుకున్న అత్యంత విచారకరమైన సంఘటన ఏలూరు జిల్లా కై కలూరు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కైకలూరు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (సీహెచ్‌సీ) శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు 18 సంవత్సరాల యువతి, మరో మహిళతో ఆస్పత్రికి వచ్చింది. కడుపు నొప్పితో బాధపడుతున్నానని చెప్పడంతో డ్యూటీలో ఉన్న సిబ్బంది ప్రథమ చికిత్స చేసి యువతిని ఆస్పత్రి గదిలో ఉంచారు. సీన్‌ కట్‌ చేస్తే ఉదయం ఆరు గంటలకు బాత్‌రూం ఉపయోగించడానికి వెళ్లిన ఒక మహిళకు బాత్‌రూం మొత్తం రక్తంతో తడిసిపోయి.. కమోడ్‌లో మృతి చెందిన ఆడ శిశువు కనిపించింది. ఆమె వెంటనే సిబ్బందికి తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటన తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని భయపడిన ఆస్పత్రి సిబ్బంది.. శిశువు మృతదేహం ఆరుబయట జనరేటర్‌ రూం వద్ద స్వీపర్‌కు కనిపించిందంటూ బుకాయించారు. రాత్రి డ్యూటీ చేసిన సిబ్బంది మాత్రం రికార్డులో బాత్‌రూంలో శిశువు మృతదేహం ఉందని రాశారు. చివరకు టౌన్‌ సీఐ పి.కృష్ణ ఆడ శిశువు మృతదేహం బాత్‌రూంలోనే లభించిందని చెప్పారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని తెలిపారు. ఆస్పత్రి వైద్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం..

మృతి చెందిన ఆడ శిశువు పూర్తిగా 9 నెలలు నిండి బరువు 2.7 కేజీలతో ఎంతో ఆరోగ్యంగా ఉన్నట్టు తెలుస్తోంది. సాధారణంగా గర్భిణి బాధపడుతూ ఆస్పత్రికి వస్తే వివరాలు నమోదు చేసుకుంటారు. అటువంటిది వివరాలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉంది. డ్యూటీ డాక్టర్‌కు తెలియకుండా ఇంత జరుగుతున్నా ఆమె ఏం చేస్తున్నట్లు అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అసలు ఆడ శిశువు మృతి చెందిందా? పరువు పోతుందని కన్న తల్లే కర్కశంగా చంపేసిందా అనేది పోస్టుమార్టం రిపోర్టులో తేలాల్సి ఉంది. జపమాల వేసుకుని వచ్చిన యువతి బాత్‌రూంలో చాలా సమయం ఉందని, తర్వాత ఓ మగ వ్యక్తి బయట వాహనంతో ఉండి ఆమెను తీసుకెళ్లాడని ఆస్పత్రిలోని రోగులు చెబుతున్నారు. మొత్తం మీద ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

యువకుడి ఉసురు తీసిన స్థల వివాదం

- సెంటున్నర స్థలం కోసం దాయాదుల మధ్య గొడవ
- చలి కాచుకుంటున్న వ్యక్తులపై పెట్రోల్‌తో దాడి



నాగూర్‌వలి (ఫైల్‌)

పెద్దదోర్నాల: ఓ కుగ్రామంలోని సెంటున్నర స్థల వివాదం చిలికి చిలికి గాలి వానగా మారి దాయాదుల మధ్య చిచ్చు రేపింది. దీంతో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గానికి చెందిన వారిపై పెట్రోలుతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఓ యువకుడు మృత్యువాత పడగా, మరో మహిళ మృత్యువుతో పోరాడుతోంది. ఈ దారుణ ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం తూర్పుపల్లెలో శుక్రవారం వేకువ జామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేష్‌ కథనం మేరకు బొమ్మలాపురంలోని తూర్పు పల్లెలో దాయాదుల పిల్లలైన దూదేకుల నాగూర్‌వలి (21), దూదేకుల ఖాశింవలి పక్క పక్కనే నివాసం ఉండేవారు. ఈ క్రమంలో వివాదానికి కారణమైన సెంటున్నర నివాస స్థలంపై కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య వివాదం చెలరేగుతోంది. స్థల వివాదాన్ని పరిష్కరించేందుకు గుంటూరులో ఉన్న నాగూర్‌వలి పెద్దమ్మ దూదేకుల నూర్జహాన్‌బీ గ్రామానికి చేరుకుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి సైతం రెండు కుటుంబాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున చలిమంట వేసుకుని ఇరువైపులా మంచాలు వేసుకుని చలి కాసుకుంటున్న సమయంలో దూదేకుల ఖాశింవలి, అతని కుటుంబ సభ్యులు పెట్రోల్‌ క్యాన్లతో నాగూర్‌వలి, నూర్జహాన్‌బీపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఒంటికి మంటలు అంటుకుని తీవ్ర గాయాలపాలైన నాగూర్‌వలి, నూర్జహాన్‌బీను 108 వాహనంలో తొలుత మార్కాపురం ఏరియా వైద్యశాలకు, అక్కడి నుంచి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగూర్‌వలి మృత్యువాత పడ్డాడు. నూర్జహాన్‌బీ పరిస్థితి విషమంగా ఉంది.

గుడారాల పండుగలో స్తుతి గీతాలు



ప్రార్థనలో పాల్గొన్న ఆరాధికులు

అమరావతి: ప్రభువైన ఏసుక్రీస్తు కురిపించే నీతి వర్షంలో ఎడారిలో ధూళి లాంటి మానవుని జీవితాన్ని నీతివంతం చేసుకోవటానికి ప్రతి ఒక్కరూ నిరంతరం దైవ ప్రార్థన చేయాలని కర్నూలుకు చెందిన దైవజనులు పాస్టర్‌ ఫ్రెడ్డిపాల్‌ అన్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లెలో హోసన్నా దయాక్షేత్రంలో హోసన్నా మినిస్ట్రీస్‌ నిర్వహించే 48వ గుడారాల పండుగ రెండో రోజు శుక్రవారం పాస్టర్‌ ఫ్రెడ్డిపాల్‌ ప్రసంగించారు. తొలుత ఉదయం యర్రగొండపాలెం పాస్టర్‌ మోషే ప్రార్థనలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మచిలీపట్నంకు చెందిన పాస్టర్‌ రాజేష్‌ ఆరాధికులను ఉద్దేశించి ప్రసంగించారు. హోసన్నా మినిస్ట్రీస్‌ చీఫ్‌ పాస్టర్‌ జాన్‌వెస్లీ మాట్లాడుతూ గుడారాల పండుగ నిర్వహణకు పోలీసుశాఖకు హామీ ఇచ్చిన విధంగా అందరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఒంగోలుకు చెందిన దైవజనులు పాస్టర్‌ రాజు మాట్లాడుతూ దేవుని కృప పొందాలంటే నిరంతర ఆరాధన పరిశుద్ధమైన ప్రదేశంలో జరగాలన్నారు. భారీ సంఖ్యలో ఆరాధికులు హాజరయ్యారు.

బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

అనంతపురం: బాలికపై లైంగిక దాడి కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి శుక్రవారం సంచలన తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండాకు చెందిన రమావత్‌ ఢాక్యానాయక్‌ 2019 మే 17వ తేదీన ఓ బాలికను.. పొలాల్లోని చింత చెట్టు వద్దకు బలవంతంగా ఎత్తుకెళ్లి అతని పంచెతో కాళ్లు, చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి లైంగిక దాడి చేశాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి వజ్రకరూరు ఎస్‌ఐ ఇబ్రహీం కేసు నమోదు చేశారు. అప్పటి గుంతకల్లు డీఎస్పీ ఖాసీం సాబ్‌ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి.. స్పెషల్‌ సెషన్స్‌ జడ్జి పోక్సో ట్రయల్‌ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి పై విధంగా తీర్పు చెప్పారు.

సేద్య ‘సాధికారత’

- పెదకూరపాడు ప్రాంతంలో 500 మంది మహిళా రైతుల సాగు
- సేంద్రియ ఉత్పత్తులతో లాభాల బాట



ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న మిరప పంట

ప్రకృతి సాగులో మెరిసిన నారిలా

పెదకూరపాడు: వారందరూ మహిళా రైతులు.. రైతు సాధికారత సంస్థ సహాయంతో ప్రకృతి సాగు దిశగా ఒక్కో అడుగు ప్రారంభించారు.. ఆర్థిక ఇబ్బందులు లేకుండా సేంద్రియ ఉత్పత్తులతో లాభాల బాట పడుతున్నారు. కషాయాలు, ఘన, జీవామృతాలను వినియోగించి సేద్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గుంటూరు జిల్లా పెదకూరపాడు మండల వ్యాప్తంగా 524 ఎకరాల్లో 500 మంది మహిళా రైతులు భర్తల సాయంతో ప్రకృతి వనరులే పెట్టుబడిగా ఆకు కూరలు, కూరగాయలు, ముల్లంగి, చిక్కుడు, క్యారెట్, కొత్తిమీర, పుదీనా, గోంగూర, దోస, పత్తి, మిర్చిలాంటి పంటలను సాగు చేస్తున్నారు. సహజంగా దొరికే పశువుల పేడ, గోమూత్రం, ఎరువులు, కషాయాలు, జీవామృతం, ఘనజీవామృతం పొలాల్లోనే తయారు చేసుకుని డ్రోన్లతో పిచికారీ చేయిస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లో విక్రయాలు

పండించిన పంట ఉత్పత్తులను నేరుగా విక్రయిస్తున్నారు. సమీప పట్టణాలకు తీసుకెళ్లి ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాలు, వ్యాపార సముదాయాల వద్ద అమ్మకాలు చేస్తున్నారు.



ఆకు కూరలు విక్రయిస్తున్న మహిళా రైతులు

20 సెంట్లలో సేద్యం



మాకు ఉన్న 20 సెంట్లలో దోస, క్యారెట్, ముల్లంగి, తోటకూర, గోంగూర, పుదీనా సాగు చేశాను. మంచి ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణతోపాటు లాభాలు బాగానే ఉన్నాయి. ప్రస్తుత కాలంలో ప్రకృతి వ్యవసాయమే మేలు.

– నందిగామ జోత్స్న, ఎదకూరపాడు

ఏదో పంటలో ఆదాయం వస్తోంది



రెండు ఎకరాల్లో దోస, చిక్కుడు, క్యారెట్, ఆకు కూరలు, ముల్లంగి, మిరప, పత్తి ఇలా అనేక రకాల పంటలను సాగు చేస్తున్నాం. వీటిలో ఏదో ఒక పంట ద్వారానైనా బాగా ఆదాయం వస్తోంది. ఆరోగ్యకరమైన కూరగాయలు తింటున్నాం. లాభదాయకంగా ఉంది.

–మట్టుపల్లి హృదయలక్ష్మి, పెదకూరపాడు

ఖర్చులు బాగా తగ్గాయి



ఎకరంలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. ప్రకృతి సేద్యంతో ఖర్చులు బాగా తగ్గాయి. దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. కుటుంబ పోషణతోపాటు పది మందికి ఉపాధి కల్పిస్తున్నాం. మేమే స్వయంగా ఉత్పత్తులను విక్రయిస్తున్నాం.

– షేక్‌ మహిబూబ్, పెదకూరపాడు

సీఎం కలలు నెరవేరాలంటే.. ఈ నిధులు సరిపోవు

మంత్రులు సత్యకుమార్, పార్థసారథి రాంప్రసాదరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని ఆ శాఖ మంత్రి సత్యకుమార్‌ స్పష్టంచేశారు. పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ ఉండాలంటే ఈ ఏడాది కేటాయించిన నిధులు సరిపోవన్నారు. వైద్య ఆరోగ్యరంగం పద్దుపై మంత్రి సమాధానమిస్తూ.. వరల్డ్‌ హెల్త్‌ ఆర్గనైజేషన్‌ ప్రకారం ఏదైనా ఒక దేశం లేదా రాష్ట్ర జీడీపీలో వైద్య రంగానికి కనీసం ఆరు శాతం నిధులు కేటాయించాలని అప్పుడే రాష్ట్రంలో పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ ఉండి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. ఆరోగ్య రంగానికి మరిన్ని కేటాయింపులు పెంచాలన్నారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర–2047 కలలు నెరవేరాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించేలా లేదన్నారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాలపై గత ప్రభుత్వ జీఓలను అమలుచేస్తాం..

అలాగే, పీఎంఏవై–2 కింద రాష్ట్రంలో ప్రతీ పేదవానికీ సొంతిల్లు నిర్మాణం చేసి అందిస్తామని, ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.2.5 లక్షలకు పెంచడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి గత ప్రభుత్వం జారీచేసిన జీఓలను అమలుచేయనున్నట్లు తెలిపారు. మరోవైపు.. అమరావతి కేంద్రంగా 2028 జాతీయ క్రీడలను నిర్వహించడానికి ప్రణాళికలను సిద్ధంచేస్తున్నట్లు క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌ తెలిపారు. అనంతరం .. వివిధ శాఖల పద్దులకు శాసనసభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

నేడు డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు

- మహిళల కోసం వర్క్‌ఫ్రం హోం విధానం
- అనకాపల్లి ఎలీప్‌ ప్రాజెక్టుతో 10,000 మందికి ఉపాధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని, బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించడంతో పాటు యూనిట్ల ఏర్పాటులో 45శాతం వరకు రాయితీలు అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా రూ.14,000 కోట్ల రుణాలను డ్వాక్రా మహిళలకు అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే విధంగా ఇంటి వద్ద ఖాళీ సమయంలో పనిచేసే విధంగా వర్క్‌ ఫ్రం హోమ్‌ విధానం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం విజయవాడలో ఎలీప్‌ నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ 50 శాతం మంది మహిళలు పనిచేస్తేనే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసమే ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త నినాదం తీసుకున్నామని తెలిపారు. రతన్‌ టాటా ఇన్నోవేషన్‌ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి అనుసంధానంగా ఐదు రీజనల్‌ హబ్‌లు ఉంటాయని, ఒక ఆలోచనతో వస్తే దాన్ని ఏ విధంగా పారిశ్రామీకరణ చేయాలో ప్రభుత్వం దగ్గరుండి చేయిపట్టి అడుగులు వేయిస్తుందన్నారు. అనకాపల్లి జిల్లా, కోడూరు వద్ద 31 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఎలీప్‌ మహిళా పారిశ్రామిక పార్కు ద్వారా 200 యూనిట్లు ఏర్పాటు కావడమే కాకుండా 10,000 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. టెక్నాలజీని వినియోగించుకొని అడుగుముందుకేసే వారికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని తెలిపారు.

‘దిగుబడులు పెరిగే రకాలపై దృష్టి పెట్టాలి’

సాక్షి, అమరావతి: శనగ దిగుబడులు పెరిగే రకాలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ సేనాపతి ఢిల్లీరావు సూచించారు. తెగుళ్లు తట్టుకునే రకాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ‘శనగ సాగులో ఉత్తమ మేలైన యాజమాన్య పద్ధతులు–నూతన సాంకేతిక ఆవిష్కరణలు’ అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అపరాల్లో 47 శాతం శనగ పంటే సాగవుతోందన్నారు. శనగ సాగులో జేజీ–11కు ప్రత్యామ్నాయంగా ఎన్‌బీఈజీ 1267 రకం ఉత్తమమైనదని చెప్పారు.

మీడియా పాయింట్‌

అడుగడుగునా అడ్డుపడుతున్నారు

బొత్స సత్యనారాయణ, మండలిలో విపక్ష నేత



సాక్షి, అమరావతి : శాసన మండలిలో ప్రజల పక్షాన మాట్లాడుతుంటే అధికారపక్ష సభ్యులు అడుగడుగునా అడ్డుపడుతున్నారు. వాస్తవాలను జీర్ణించుకోలేకపోతున్నారు. సూపర్‌ సిక్స్‌ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. పింఛన్‌ మాత్రమే ఇస్తున్నారు. దీపంలో మూడు సిలిండర్లిస్తామని చెప్పి, ఒక్కటే ఇస్తున్నారు. అదీ కొందరికే ఇస్తున్నారు. సూపర్‌ సిక్స్‌ ఎప్పుడు అమలు చేస్తారని అడుగుతున్నాం. కనీసం ఏ పథకం ఎప్పుడిస్తారో చెప్పమని అడుగుతున్నాం. ఏ పథకం అమలు చేయకపోయినా ఈ పదినెలల్లో రూ.లక్ష కోట్లకు పైగా అప్పులు చేశారు. ఉద్యోగులకు రూ.25 వేల కోట్లు బకాయిలు, ఐఆర్, పీఆర్‌సీ ఎప్పుడిస్తారు? వ్యవసాయం గురించి మాట్లాడదామనుకున్నాం. మాట్లాడనివ్వడం లేదు. ప్రతిపక్షం కూడా భజన చేయాలని ఆశపడుతున్నట్టుంది ఈ ప్రభుత్వం. ఇలాంటి సంప్రదాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మేం విధ్వంసం చేశామని అంటున్నారు. అలాంటప్పుడు అప్పు ఎలా పుట్టింది అని అడుగుతున్నాం.

పవన్‌కు అవగాహన లేదని చెప్పాలనే జగన్‌ అలా మాట్లాడారు

వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా రాదని, వైఎస్సార్‌సీపీ కంటే జనసేనకే ఎక్కువ సీట్లు వచ్చాయని పవన్‌ అన్నారు. కానీ, ఉన్నవి రెండే పక్షాలు కాబట్టి ప్రతిపక్ష హోదా మా హక్కు. ఈ అవగాహన లేకే పవన్‌ మాట్లాడుతున్నారు. మొదటిసారి ఎమ్మెల్యే కదా పవన్‌కు అవగాహన లేదని చెప్పాలనే మా పార్టీ అధ్యక్షుడు జగన్‌ అలాంటి వ్యాఖ్యలు చేశారు.

‘విలేజ్‌ క్లినిక్స్‌’ కొనసాగించాలి

- సిపాయి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

వైఎస్‌ జగన్‌ ప్రవేశపెట్టిన ‘విలేజ్‌ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్‌’ గొప్ప వ్యవస్థలు. వాటి ద్వారా మారుమూల పల్లెకు కూడా 14 రకాల వైద్య పరీక్షలు, 20 రకాల రోగాలకు 150కి పైగా మందులు అందుబాటులో ఉండేవి. ప్రతి 2 వేల ఇళ్లకు ఒక నర్సింగ్‌ సిబ్బందిని నియమించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సిబ్బందికి జీతాలు, స్టైఫండ్‌ కూడా చెల్లించడం లేదు. ఈ వ్యవస్థను కొనసాగించాలి. నిర్వీర్యం చేయకూడదు.

ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న ప్రభుత్వం

- ఐ. వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ

జీతాల వల్ల ప్రభుత్వంపై 87 శాతం భారం పడుతుందని మండలిలో స్లైడ్‌ ప్రదర్శించడం కరెక్ట్‌ కాదు. పీఆర్సీ, ఐఆర్‌ అని హామీ ఇచ్చి, ఇప్పుడు దానిపై అడిగితే దాటవేస్తున్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి. పిల్లల్ని కనండి అని చెప్పే సీఎం ఆశా వర్కర్లను మాత్రం పట్టించుకోవడం లేదు. లిక్కర్‌ పాలసీ పేరుతో ప్రభుత్వం వ్యాపారం చేస్తోంది. ఈ రాష్ట్రంలో పాలించడం చేతకాని పాలకపక్షం విశ్వసనీయత కోల్పోయింది.

ప్రత్యేక హోదా తీసుకురండి

- బొర్రా గోపిమూర్తి, పీడీఎఫ్‌ ఎమ్మెల్సీ

కార్మికులు, ఉద్యోగులకి ఇచ్చిన హామీలు, ఇవ్వాల్సిన బకాయిల గురించి చెప్పడంలేదు. కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుంది అనేది మాత్రమే చెప్తున్నారు. కేంద్రంతో విభజన హామీలు గురించి మాట్లాడి, మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలి.



మీ ముఖాన్ని వెలుతురు వైపు ఉంచండి.
మీకు నీడలు కనబడవు.
– హెలెన్ కెల్లర్

సాక్షి
శనివారం, 8 మార్చి 2025

సుపరిపాలనకు దోవ

'సివిల్ సర్వీసు అధికారికి ఎంత తెలుసనేది కాదు... ఆ అధికారి ఎంత జాగ్రత్తగా విధి నిర్వహణ చేస్తారన్నదే అసలైన పరీక్ష' అన్నారు ప్రథమ భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. అఖిల భారత సర్వీసుల రూపశిల్పి, దేశ తొలి ఉపప్రధాని సర్దార్ పటేల్ సైతం ఈ అధికారుల గురించి చెప్పిన మాటలు వారి బాధ్యతను గుర్తుచేస్తాయి. సివిల్ సర్వీసులకు ఎంపికైనవారు స్వతంత్రంగా, నిజాయితీగా, నిర్భీతితో వ్యవహరించగలిగితేనే పటిష్ఠమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అభిలషించారు. కానీ ఇప్పటికీ ఆచరణలో సమస్యలు తప్పడం లేదు. ఈమధ్య తమ ముందు కొచ్చిన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఐఏఎస్‌ల తీరుపై కటువుగా వ్యాఖ్యానించింది. ఐఏఎస్‌లు తరచు తాము ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకన్నా అధికులమని భావిస్తారనీ, అది సరికాదనీ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. సివిల్ సర్వీసుల రూపకర్తలు ఇలాంటి అంతరాలను చూడలేదు. విధి నిర్వహణకు సంబంధించినంత వరకూ ఈ సర్వీసుల్లోని వారు దేశాభివృద్ధినీ, భద్రతనూ కాంక్షించి అందుకు అనువైన నిర్ణయాలు తీసుకుంటూ తమ విధులు నిర్వర్తించాలని కోరుకుంది. స్వభావరీత్యా విధి నిర్వహణ భిన్నంగా ఉండొచ్చు. ఇందులో ఎక్కువ, తక్కువ అనే సమస్యే రాకూడదు.

సాధారణంగా సివిల్ సర్వీస్ వైపు వచ్చే యువతీయువకులకు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపైనా, వాటివల్ల కలుగుతున్న అనర్థాలపైనా ఆగ్రహం ఉంటుంది. వాటి పరిష్కారం తమవల్ల సాధ్యమేనన్న విశ్వాసం ఉంటుంది. సంపాదనే ప్రధానమనుకుంటే ఏ బహుళజాతి సంస్థకో మేనేజర్‌గా లేదా సీఈవోగా వెళ్లవచ్చు. సివిల్ సర్వీసుల్లోకన్నా అత్యధిక జీతం, ఇతర సదుపాయాలూ, ఆస్తుల సంపాదన ఉంటాయి. పైగా అక్కడ అధిక శ్రమ, పని ఒత్తిడి ఉండవు. కానీ సివిల్ సర్వీస్‌లు అలా కాదు. ప్రభుత్వంలో ఎక్కడో కిందిస్థాయి అధికారి తీసుకునే పొరపాటు నిర్ణయం ఆ ప్రాంతంలోనో, ఆ జిల్లాలోనో, కొన్ని సందర్భాల్లో రాష్ట్రంలోనో కల్లోలానికి దారి తీయొచ్చు. ప్రభుత్వ పథకాల అమలులో చోటుచేసుకునే చిన్న లోపం కూడా సాధారణ పౌరులను కలవరపరిచి వారు ప్రాణం తీసుకునే ప్రమాదం కూడా ఉండొచ్చు. లేదా అధికారిపై దౌర్జన్యానికి దిగొచ్చు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవటం, అనుకోని సమస్య ఎదురైతే సమయస్ఫూర్తితో వ్యవహరించటం తప్పనిసరి. అలాగని ఈ అంతరాలు లేవని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఐఏఎస్‌లు మొదటి స్థానంలో ఉంటారు. ఆ తర్వాత ఐపీఎస్‌లు వస్తారు. ఇది పాలనా సౌలభ్యం కోసం చేసిన ఏర్పాటు. స్వల్ప వ్యత్యాసంతో ఇద్దరి ప్రారంభ వేతనాలూ... ఆరోగ్యం, ఆవాసం, సెలవులు, ఇతర సదుపాయాలూ ఒకేలావుంటాయి. మొదటి మూడు నాలుగు నెలలు ఉమ్మడిగా శిక్షణనిచ్చినా బాధ్యతలరీత్యా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు వేర్వేరుచోట్ల ప్రత్యేక శిక్షణనిస్తారు. ఒక జిల్లాకో, ఒక ప్రాంతానికో బాధ్యత వహించే ఐఏఎస్ అధికారి అక్కడి పాలనా వ్యవస్థను పటిష్ఠపరచటానికి నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుంది. ఎవరిని ఏ స్థానంలో పనిచేయించాలో, అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా అక్కడి ప్రజల అభ్యున్నతికి ఏమేం చేయవచ్చునో అధ్యయనం చేయటం, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోవటం కూడా ఐఏఎస్ అధికారుల బాధ్యత. ఐఏఎస్‌లకు భిన్న శాఖల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఐపీఎస్‌లకు శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. దానికి అనుగుణంగా వారికి ప్రత్యేక శిక్షణ అవసరమవుతుంది. అలాగే ఐఎఫ్ఎస్‌లు అడవుల పరిరక్షణలో, భద్రతలో, వాటి నిర్వహణలో అవగాహన పెంచుకుంటారు. పర్యావరణం, వాతావరణ మార్పులు, సహజ వనరుల సంరక్షణ వారి ప్రధానాంశాలు.

అందరి అంతిమ ధ్యేయమూ మెరుగైన పాలనా వ్యవస్థను ప్రజల అందుబాటులోకి తీసుకురావటమే అయినప్పుడు ఎవరికీ ఆధిక్యతా భావన ఉండకూడదు. అటువంటి మనస్తత్వం పాలనపై దుష్ప్రభావం కలిగిస్తుంది. ప్రభుత్వ తీరుతెన్నులపై విమర్శలకు తావిస్తుంది. కానీ దురదృష్టమేమంటే, ధర్మాసనం చెప్పినట్టు చాలాచోట్ల ఇలాంటి పోకడలు కనిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం కర్ణాటకలో ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతల్లోవున్న ఇద్దరు మహిళా అధికారులు సామాజిక మాధ్యమాల్లో ఎలా దూషించుకున్నారో ఎవరూ మరిచిపోరు. అప్పట్లో ప్రధాని కార్యాలయం ఆనాటి ముఖ్యమంత్రిని వివరణ కోరింది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తరాఖండ్‌లో అడవుల సంరక్షణ, అభివృద్ధి అవసరాలు సమతౌల్యం చేయటానికి ఉద్దేశించిన నిధులు దుర్వినియోగం కావటానికి సంబంధించి దాఖలైన కేసులో ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులిద్దరి మధ్య తలెత్తిన వివాదం ప్రస్తావనకొచ్చినప్పుడు న్యాయమూర్తులు ఐఏఎస్‌ల తీరును నిశితంగా విమర్శించారు. ఒకచోట పనిచేయాల్సి వచ్చినప్పుడు వివాదాలు తలెత్తటం అసాధారణమేమీ కాదు. కానీ వ్యక్తిగత స్థాయికి వివాదాల్ని దిగజార్చటంవల్ల వ్యవస్థ దెబ్బతింటుంది. చాలా రాష్ట్రాల్లో ఇలాంటి సమస్యలుంటున్నాయి. వీటికి ఎక్కడో ఒకచోట బ్రేక్ పడాలి. తాత్కాలిక సర్దుబాట్లుకాక మరోసారి సమస్య తలెత్తకుండా ఏం చేయవచ్చునో ఆలోచించాలి. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పరిచిన అధి కార యంత్రాంగం కాస్తా అంతర్గత కలహాల్లో మునిగితే వ్యవస్థ నష్టపోతుంది. అంకితభావంతో, కర్తవ్యనిష్ఠతో పనిచేసిన ఎస్.ఆర్. శంకరన్, బి.డి. శర్మవంటివారు ఇవాళ్టికీ చిరస్మరణీయులు. అధికారులకు వారు ఆదర్శం కావాలి. అప్పుడు అహంభావానికి తావుండదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.నవమి ప.12.02 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.2.45 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.11.35 నుండి 1.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.16 నుండి 7.53 వరకు, **అమృత ఘడియలు:** సా.5.01 నుండి 9.43 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఎందరో మహానుభావులు

దేశం కోసం ఆమె

సందర్భం



డా॥ సౌమ్య స్వామినాథన్

స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని కాంక్షిస్తున్న నేపథ్యంలో వివిధ రంగాలకు నిర్దిష్ట లక్ష్యాలు నిర్వచించుకున్నాం. ఈ లక్ష్యం నెరవేరడంలో సైన్స్ కీలకపాత్ర పోషించనుంది.

అయితే, భారతీయ శాస్త్ర రంగం అక్కడక్కడ కొన్ని సంస్థల్లో కనిపించే అద్భుతంగా ఉండకూడదు. సామాజిక సమస్యల పరిష్కారానికి అన్నిచోట్లా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా మారాలి. ఇవన్నీ జరగాలంటే, ప్రాథమిక విద్య నుంచి స్నాతకోత్తరం వరకూ శాస్త్ర రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరగాలి. ప్రభావశీల పరిశోధనలకు ఇచ్చే ప్రోత్సాహకాలు, బహుమతులు పెరగాలి. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ రంగంతో ప్రభుత్వ భాగస్వామ్యం, సమాజంలోని అట్టడుగు వర్గాలు ముఖ్యంగా మహిళల ప్రాతినిధ్యం పెరగాలి.

హేతుబద్ధమైన, ససాక్ష్యాలతో కూడిన పరిష్కారాలను చూపడం మొదలుపెడితే ప్రజాభిప్రాయం శాస్త్రవేత్తల నిర్ణయాలతో ఏకీభవిస్తుందని కోవిడ్ సమయంలో నిరూపితమైంది. మన అభివృద్ధిని అడ్డుకునే... పరిష్కారం లేని, రిస్క్ కారణంగా ప్రైవేట్ రంగం పెట్టుబడులు పెట్టని శాస్త్రపరమైన సమస్యలపై తక్షణం ప్రభుత్వం దృష్టి పెట్టాలి. బయో–ఈ3, నేషనల్ క్వాంటమ్ మిషన్, డీప్ ఓషన్ మిషన్ వంటివి ఇలాంటి సమస్యల పరిష్కారం దిశగా శాస్త్రవేత్తల దృష్టిని కేంద్రీకరించేందుకు ప్రయత్నించాయి. ప్రోత్సాహకరమైన విషయం ఏమిటంటే, ఈ ఏడాది బడ్జెట్‌లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలకు కేటాయింపులు రెట్టింపు కంటే పెరగడం.

దేశంలోని శాస్త్ర పరిశోధనశాలల్లో మూలనపడ్డ అద్భుతమైన ఆవిష్కరణలు ఉన్నాయడంలో నాకు ఎలాంటి సందేహమూ లేదు. ప్రోత్సాహకాల లేమితో ఇవి ముందుకు కదలడం లేదు. వాయు కాలుష్యం, నీటిలోని సీసం, ఆర్సెనిక్ విషాల ఏరివేత, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్యం, ముఖ్యంగా జలవనరులకు సంబంధించిన సమస్యలను శాస్త్ర పరిశోధన సంస్థలు కలిసికట్టుగా చేపట్టాలి.

దేశ సమస్యలకు శాస్త్ర ఆధారిత పరిష్కారాలు కనుక్కొనేందుకు అవసరమైన మౌలిక పరిశోధనలకు కేంద్రం సంస్థాగత గ్రాంట్ల రూపంలో అధికంగా సాయపడాలి. ఇదే సమయంలో అప్లికేషన్స్, వాటి వాణిజ్యీకరణ, పరిశోధనలను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లడం వంటివి భాగస్వామ్య ఏర్పాట్లతో ప్రోత్సహించవచ్చు. దేశంలో శాస్త్ర పరిశోధన సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న సంస్థలు క్రమేపీ పెరుగుతున్నాయి. టాటా గ్రూపు లాంటివి వందేళ్లుగా ఈ పని చేస్తున్నాయి. ప్రభుత్వ నిధులకు ప్రైవేట్ పెట్టుబడులు, దేశీ దాతలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు తోడైతే సమాజానికి ఉపయోగపడే పరిశోధనలకు ఊతమివ్వవచ్చు.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

> మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉంటే సంస్థల సమర్థత పెరుగుతుందనీ, వ్యవహారాలు పారదర్శకంగా ఉంటాయనీ, పనులు సమతుల్యతతో సాగుతాయనీ అధ్యయనాలు చెబుతున్నాయి.

మహిళలకు సముచిత స్థానం...

భారతీయ మహిళలు చాలా రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. పురిటిబిడ్డను కోల్పోయిన బాధ ఆనందీబాయి జోషీని ఎన్నో అడ్డంకులు అధిగమించి వైద్యశాస్త్రం చదువుకునేలా చేసింది. అది కూడా అమెరికాలోని పెన్సిల్వేనియా మహిళా కళాశాలలో. 1886లోనే ఈ ఘనత సాధించిన తొలి భారతీయ వైద్యురాలు ఆమె. దురదృష్టవశాత్తూ ఆ మరుసటి ఏడాదే ఆమె క్షయ వ్యాధికి బలైనా... ఎంతో మంది మహిళలు వైద్యం, వైద్య పరిశోధనల రంగాలను ఎంచుకునేందుకు స్ఫూర్తిగా నిలిచారు.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి కానీ... 'స్టెమ్' రంగాల్లో (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మేథమేటిక్స్) భారతీయ మహిళల భాగస్వామ్యం తక్కువ. ఈ రంగాల్లో కోర్సులందిస్తున్న సంస్థలపై ఇటీవల ఒక అధ్యయనం జరిగింది. అక్కడి బోధన సిబ్బందిలో కేవలం 16.6 శాతం మంది మాత్రమే మహిళలు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) జాబితాలోని టాప్ ఎనిమిది సంస్థల్లో ఇది 10 శాతానికి మించడం లేదు. ఈ మహిళల్లోనూ 26.2 శాతం మంది మాత్రమే సీనియర్ స్థానాల్లో ఉన్నారు. దీన్నిబట్టి మహిళల విషయంలో ఎన్ని అసమానతలు ఉన్నాయో అర్థమవుతుంది. మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉంటే సంస్థల సమర్థత పెరుగుతుందనీ, వ్యవహారాలు పారదర్శకంగా ఉంటాయనీ, పనులు సమతుల్యతతో సాగుతాయనీ దశాబ్దాల అధ్యయనాలు చెబుతున్నాయి.

దేశంలోని శాస్త్ర, వైద్య సంస్థల్లోని ఈ అసమానతలను సరిదిద్దాలంటే మొత్తం వ్యవస్థలో మార్పులు చేయాల్సి ఉంటుంది. వనరుల కేటాయింపు, టాలెంట్ మేనేజ్‌మెంట్, పదోన్నతులు, బదిలీల వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకునే వ్యవస్థల్లో మహిళలకు తగిన భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలి. అన్ని స్థాయుల్లోనూ మహిళలకు ఉద్యోగాల విషయంలో తగిన సలహాలు ఇచ్చేందుకు, శిక్షణ వంటివి కల్పించేందుకు ఏర్పాట్లు ఉండాలి. శిశు సంరక్షణ, డే కేర్ సర్వీసులు, ప్రసూతి సెలవులు, పిల్లలకు పాలు పట్టేందుకు ప్రత్యేకమైన గదులు, పని వేళల్లో వెసలుబాటు, ఇంట్లోంచే పని చేసే అవకాశాలు అన్ని స్థాయుల్లోనూ కల్పించాలి. మహిళలు మళ్లీ ఉద్యోగాల్లో చేరేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయి.

వ్యవసాయం, ఆహార భద్రత, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ తయారీ, టీకాలు, వ్యాధి నిర్ధారణ, ఫార్మా, ఐటీ వంటి అనేక రంగాల్లో భారతీయ శాస్త్రవేత్తల సామర్థ్యం, నాయకత్వం రెండింటికీ ఇప్పటికే ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఈ విజయాల నుంచి స్ఫూర్తి పొందుదాం.

వ్యాసకర్త 'ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' చైర్‌పర్సన్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఆమె కోసం అతను

సందర్భం



కె.ఎన్. మల్లీశ్వరి

స్త్రీలు– ఎవరి నొప్పికి వారే మందు వేసుకుంటూ, ఎవరి యుద్ధం వాళ్ళే చేస్తూ, ఆకాశంలో సగాలమని నినదిస్తూ, పడుతూ, రెట్టింపు బలంతో లేస్తూ– చలిచీమల కవాతుకి అర్ధ శతాబ్ది. కడచి వచ్చిన కాలాలను ఈ మహిళా దినోత్సవం రోజున పాఠకురాలిగా తిరిగి చూడటమంటే వెన్ను నిలబెట్టిన అక్షరాలని కావిలించుకోవడం. ఎన్నెన్ని కథలు, కవిత్వాలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు మీకోసం మేమున్నామని భుజంమీద చేయివేసి కన్నీరు తుడిచాయి! అక్షరాలలో దట్టించిన ధైర్యం, విశ్వాసం, విజ్ఞానం, పోరాటం నలుగడలా కమ్ముకుని స్త్రీశక్తి విస్ఫోటనమై ఎన్నెన్ని కొత్త విలువలు బారులు తీరాయి! ఇప్పటి, మునుపటి తరాల ముందుచూపు కవులకి, రచయితలకి వందనాలు.

ఆడపిల్లలను అమ్ముకుంటున్న రోజుల్లో, అతిబాల్య, అతివృద్ధ వివాహాల మారకంలో స్త్రీ వస్తువైన రోజుల్లో– 'మగడు వేల్పన పాతమాట, ప్రాణసఖుడ'ని చెప్పి, 'ఆధునిక మహిళ చరిత్ర పునర్లిఖిస్తుంద'ని నమ్మిన క్రాంతదర్శికి కృతజ్ఞతలు. ఒకటీ అరా ఘటనలు పట్టుకుని స్త్రీలు ఎంత నేరస్థులో నిరూపించడానికి వర్తమాన మీడియా ప్రయత్నిస్తున్న కాలాన– 'స్త్రీల మీద ప్రపంచానికి యింత అపనమ్మకం గనుకనూ స్త్రీని శీలం విషయమై damn చెయ్యడమూ, గాయం చెయ్యడమూ ఇంత సులభం గనుకనూ స్త్రీ శీలం తన సొమ్మని పురుషుడు అనుకోవడం వల్లనూ స్త్రీని శిక్షించే అధికారం ప్రతి పురుషునికీ ఉండటం వల్లనూ స్త్రీ ఇంత మోసగత్తె అబద్ధీకురాలు ఐ జీవితమంతా నటిస్తోంద'ని స్త్రీల చెడుగు వెనుక కారణాలను బట్టబయలు చేసిన స్వేచ్ఛామూర్తిని స్మరించుకుంటూ ముంజేతిపై నాలుగు ముద్దులు.

స్త్రీల నవ్వు, నడక, మాట దుస్తులబట్టి ఆమె లైంగిక వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్న ఈ మాయదారి కాలంలో– చెడిపోయిన మనుషులను, సవతి తల్లి, కొడుకుల ప్రేమబంధాన్ని ఒప్పించేలా రాసి, 'మనిషి నుంచి మనిషికి సాధ్యమైనంత హెచ్చు ఉపకారమూ సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేలా చూసుకోవడమే నీతి. తక్కిన బూటకపు నీతి నియమాలను నమ్మకండి' అన్న భావ విప్లవకారునికి శాల్యూట్. ఉన్నదంతా కుటుంబానికి పెట్టి, అన్నిటికోసం చేయిసాచాల్సి వచ్చే స్త్రీలకి కొదవలేని మనదేశంలో– 'అది నా ఇల్లు కాదా అని అడిగావు. అది నా ఇల్లు కాదు. ఒకప్పుడు నాదే అనుకున్నాను. ఆ ఇల్లు, మా ఆయన పెంచుకొంటున్న కుక్కదెట్లా కాదో, నాదీ అట్లానే కాదు. ఆయన కుక్కనీ అపేక్షగానే చూసుకొంటారు. నన్నూ ఆపేక్షగానే చూసుకొంటారు. అంతమాత్రాన ఆయనకులాగా మాకు ఇంటిమీద హక్కులుండవు. మేము మా బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఆయన ఆపేక్షని ప్రతిఫలంగా పొందగలిగాము. అంతే!' అని ధీమాగా చెప్పిన ఆమె కోసం ఒక ఇంటిని దృఢంగా నిర్మించిన మంచి రచయితకు ధన్యవాదాలు.

> కొందరుంటారు. తమ చుట్టూ తనకలాడుతున్న ఆరాట పోరాటాలతో మమేకమయ్యేవారు. కొందరున్నారు తమ జీవితాల్లో మేలిమి భాగమైన స్త్రీల విలువని గుర్తించి అక్షరాలలో నిలబెట్టినవారు.

అరవై దాటితే ఇక జీవితం బోనస్ అంటూ స్త్రీలకి ప్రో ఏజింగ్ మెళకువలను తిరస్కరించే సమాజంలో – 'చీకటిని చూసో, పరిసరాలలోని అపరిచితత్వాన్ని చూసో భయం వేసినప్పుడు, ఆకలితో బెంగతో జ్వరంతో జీవనలౌల్యాల తీరని మంకుతనంతో అల్లాడినప్పుడు, ఒక్కసారి గుక్కపట్టి ఏడ్వాలనిపిస్తుంది. లాలన, రక్షణ ఇవ్వగలిగే ఒకే ఒక్క అమ్మని పిలవాలనిపిస్తుంద'ని తల్లి విలువని గుర్తించిన పసిబాలునికి కావిలింతలు. తన కుటుంబ స్త్రీలు తప్ప తక్కినవారంతా అవైలబుల్ వస్తువులుగా కనపడే మెజారిటీ మగ సమాజంలో– 'బాగ్ ఒక మూలకి పడేసి, కుర్చీలోంచి నా కాళ్ళు తీసి అక్కడ కూర్చుని కళ్ళు మూసుకుని 'యాభై వచ్చాయి. రెండునెలల నుంచి మెన్సెస్ రాలేదు. ఇప్పుడేమో రెండురోజుల నుంచి బ్లీడింగ్' (I know that is not the complete story) ''ఊ'' అంటాను. 'ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి పది అయ్యింది. బ్లూ ఫిలిమ్స్ చూస్తూ కూర్చున్నాడు. ఓపిక లేదన్నా వినలేదు, బ్లీడింగ్ అవుతుందని చెబుతున్నా...' అనేక ఆమెలపై సాగే హింసలను ఒకచోట ముద్దచేసి కళ్లముందు పెట్టుకుని ఆ నెప్పినంతా తానే తీసేసుకోవాలన్నంతగా తపించే పువ్వులాంటి మనసున్న కవికి కరచాలనం.

స్త్రీల విలువను గుర్తించేవారు...

ఇతర మతాలు, ఆచారాలు, అలవాట్ల పట్ల వల్లమాలిన ద్వేషాన్ని నూరిపోస్తున్న మెజారిటీ మత రాజకీయ చదరంగంలో– 'పువ్వులు రాల్చుకునీ రాల్చుకునీ/ నన్ను కాడగా మిగిల్చావు/ ఇంకా ఏం మిగిలిందని/ ఈ కంకాళంపై కారుమబ్బు కప్పి నడిపిస్తున్నావు/ నా ముఖానికి వేలాడేసిన నఖాబ్/ ఎత్తి చూశావా ఎన్నడైనా/ నా కళ్లు/ రెండు అమాస చంద్రుళ్లను మోస్తుంటాయ్' అంటూ స్వజనులు చూపే వివక్షని నిలదీసిన సాహసికి సలాములు. స్త్రీలు, తాము ఎవరిని ఎపుడు పెళ్లి చేసుకోవాలో సొంతంగా నిర్ణయం తీసుకోగల హక్కుని నిరాకరించే కుటుంబాలున్న సామాజిక చట్రంలో– 'మీ ఊరికి మా వాడకి మధ్య ఎద్దుతునకల దండెం కడదాం /కాస్త మీ ఇంట్లో ఉన్న జంధ్యం తీసుకు రారాదూ /కులం గీతలు దాటిన ప్రేమలు చంపబడుతున్న చోట /పారుతున్న నెత్తుటి ప్రవాహంలో నిలబడి అడుగుతున్నా/ రావే పిల్లా రా/ హద్దులన్నీ చెరిపేసి/ సరిహద్దులు లేని సమాజంలోకి నడుద్దా'మంటూ స్త్రీలు కులాలు దాటగలరని నమ్మి, చేయందించిన ప్రేమికునికి వందనం.

కొందరుంటారు, తమ ఆధిపత్యాలకి తామే గండికొట్టుకుని చుట్టూ తనకలాడుతున్న ఆరాట పోరాటాలతో మమేకమయ్యేవారు. కొందరున్నారు తమ జీవితాల్లో మేలిమి భాగమైన స్త్రీల విలువని గుర్తించి అక్షరాలలో నిలబెట్టినవారు. వారందరి తపనని, ప్రేమని, అక్కరని, బాధ్యతని గుర్తు చేసుకుంటూ, అభినందిస్తూ అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

వ్యాసకర్త ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఏపీ కార్యదర్శి
malleswari.kn2008@gmail.com

అమ్మ

చీకటి తొలగని వేకువలోనే
అమ్మ దినచర్య ప్రారంభమవుతుంది
అందరి పనులు పూర్తి చేసేదాకా
అది కొనసాగుతూనే ఉంటుంది

ఆమె రాత్రులు చిన్నవి
కుంచించుకు పోయేవి
ఆమె పగళ్ళు
రాత్రుల్లోకి జొచ్చుకుపోయి
దీర్ఘంగా సాగేవి

ఆమె రాత్రుల మీద
పగళ్ళు చేసే దాడి గూర్చి
ఎవరికీ ఆలోచన రాదు
ఎవరూ ఆలోచించరు

మిగిలిపోయిన చిన్న
రాత్రి ముక్కను కప్పుకుని
ఆమె కాళ్ళు ముడుచుకుని
పడుకుంటుంది



కాళ్ళు కాస్తా చాపుకుని,
హాయిగా పడుకోవడానికి కూడా లేదు
ఆ కొద్దిపాటి రాత్రి –
అందుకున్నాడా సరిపోదు!

హిందీ మూలం : జ్యోత్స్న మిలన్
స్వేచ్ఛానువాదం : డా॥ దేవరాజు మహారాజు

మహిళా విముక్తిలో ఓ అంకం

విశ్లేషణ



డా॥ తుర్లపాటి రాజేశ్వరి

'కన్యాశుల్కం' నాటకం గురజాడను అత్యుత్తమ నాటక రచయితగా తెలుగు సాహిత్యంలో నిలిపింది. ఈ నాటకాన్ని 'జగన్నాథ విలాసినీ సభ' 1892 ఆగస్టులో మొదట ప్రదర్శించింది. కన్యాశుల్కంలో ప్రధానమైన సమస్య సుబ్బి పెళ్లి తప్పించటం! ఆడవాళ్లకి ఏ ఆలోచనాశక్తి లేదని, చులకనగా వారిని చూసే నాటి సమాజంలో మహిళలను ధైర్యవంతులుగా చిత్రించి మహిళల చరిత్రను పునర్లిఖించారు గురజాడ.

సుబ్బమ్మ లేక సుబ్బి ఈ కథకి మూలం. నాటకంలో ఎక్కడా కనిపించదు. వెంకమ్మ – కృష్ణరాయపురం అగ్రహారీకుడు అగ్నిహోత్రావధాన్ల భార్య. బుచ్చమ్మ – అగ్ని హోత్రావధాన్ల పెద్ద కూతురు, వితంతువు. మీనాక్షి – రామచంద్రాపురం అగ్రహారీకుడు లుబ్ధావధాన్ల కుమార్తె, వితంతువు. మధురవాణి–విజయనగరానికి చెందిన వేశ్య. పూటకూళ్ళమ్మ విజయనగరంలో పూట కూళ్ళిల్లు నడిపే వితంతువు. వెంకమ్మ అన్నగారు కరటక శాస్త్రి. ఇతడు కృష్ణరాయపురం అగ్రహారంలో ఉన్న చెల్లెలి ఇంటికి వచ్చినపుడు సుబ్బి పెళ్ళి విషయం తెలుస్తుంది. ఈ సంబంధం ఇష్టంలేని వెంకమ్మ అన్న కరటకశాస్త్రిని ఈ సంబంధం తప్పించమని వేడుకుంటుంది. ఎలాగైనా మేనకోడలు పెళ్లి తప్పించాలని పథకాన్ని రూపొందిస్తాడు అతడు.

మధురవాణిది నాటకంలో కీలకమైన పాత్ర. ఆమె వేశ్య. విజయనగరంలో ఉండే మధురవాణి కారణాంతరాల చేత రామచంద్రపురం అగ్రహార నివాసి, ఊరి కరణం రామప్ప పంతులి ఇంటికి చేరుతుంది. సుబ్బితో పెళ్లి ఖాయం చేసుకున్న లుబ్ధావధాన్లు రామచంద్రపుర వాసి. రామప్ప పంతులు నయవంచకుడని ఆమె తొంద ర్లోనే కనిపెట్టేసింది. స్వతహాగా ఎదుటివారికి సాయం చెయ్యాలనే సద్బుద్ధి కలిగిన మధురవాణి... లుబ్ధావధాన్ల పెళ్లి రామప్ప పంతులు కుదిర్చాడని తెలిసిన వెంటనే 'ఈ పెళ్లి మాన్పించకపోతే నేను మీతో మాట్లాడను' అంటుంది. ఆ తరువాత అసలు కథ మొదలైంది.

కరటకశాస్త్రి తన ప్రణాళిక అమలు చెయ్యటానికి రామప్ప పంతులు ఇంటికి వస్తాడు. అక్కడ మధుర వాణిని చూసి తన మేనకోడలి పెళ్లి తప్పించమని కోరతాడు. ఆమె అంగీకరించి కొన్ని సలహాలు ఇస్తుంది. తన 'కంటె'ని పెళ్లిలో పెళ్లికూతురికి పెట్టటానికి కూడా ఒప్పుకుంటుంది. ఆడవేషంలో ఉన్న కరటకశాస్త్రుల శిష్యుడు మహేష్‌ని ఇచ్చి పెళ్ళి జరిపించి, తద్వారా సుబ్బి పెళ్లి ఆపటంలో మధురవాణి చాకచక్యాన్ని ప్రదర్శించింది. తర్వాత లుబ్ధావధాన్లను పెళ్లి చేసుకున్న మహేష్... మధురవాణి దగ్గరకు వచ్చి ఆమె



'కంటె' ఆమెకి ఇచ్చేస్తాడు. మధురవాణి ఆడపిల్ల వేషంలో ఉన్న మహేష్‌కు దాసరి వేషం వేసి ఊరు దాటిస్తుంది. 'కంటె' కోసం రామప్ప పంతుల్ని ఇబ్బంది పెట్టడంతో అతడే హెడ్ కానిస్టేబుల్‌తో లుబ్ధావధాన్ల మీద ఖూనీ కేసు పెట్టిస్తాడు. ఈ వ్యవహారంలో లుబ్ధావధాన్లను కేసు నుంచి బయటపడెయ్యడానికి మధురవాణి, సౌజన్యా రావు పంతులు ఇంటికి వెళుతుంది. అదే సమయంలో గిరీశం కూడా ఆ ఇంటికి వస్తాడు. బుచ్చమ్మని లేవదీసుకు పోయిన గిరీశం అంతటితో తృప్తిపడక లుబ్ధావధాన్ల ఆస్తి చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తూ అక్కడికి వచ్చాడు. గిరీశం నిజస్వరూపం తెలుసుకున్న సౌజన్యా రావు పంతులు బుచ్చమ్మను పూనాలో విడోస్ హోమ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తాడు. నాటకంలో మీనాక్షి పాత్ర కూడా ముఖ్యమైనదే. ముసలి తండ్రి పెళ్లి కరటకశాస్త్రి శిష్యుడు మహేశంతో జరిపించటంలో సిద్ధాంతికి సంపూర్ణ సహకారం అందిస్తుంది. ఒక రాత్రివేళ రామప్ప పంతులితో తమ ఇంట్లో తండ్రికి దొరికిపోతుంది. తండ్రి బయటికి గెంటేస్తాడు. ఈ చర్యకి మీనాక్షి ఏమీ జంకకుండా ''... ఈ జన్మలో ఈ ఇంట్లో అడుగుపెట్టను'' అంటూ రామప్ప పంతు లుతో వెళ్లిపోతుంది.

ఇక గంపెడు చాకిరీ చేస్తూ నెత్తిన ముసుగేసుకుని జీవితాన్ని గడుపుతున్న బుచ్చమ్మ ఆలోచనాశక్తి, తెంపరితనం ఉన్న మహిళ. బుచ్చమ్మకి గిరీశం తన కళ్లముందు నిలిపిన రంగుల లోకం... అందరి ముత్తయిదువలలాగ జీవించాలనే ఆశని కల్గించింది. ఇంకో పక్క గిరీశం తన ఈ నిర్ణయం వల్ల ముసలాడితో చెల్లెలి పెళ్లి ఆగిపోతుందని నచ్చ చెప్పాడు. ధైర్యంగా ఆమె గిరీశంతో అగ్ని హోత్రావధాన్ల కళ్లుగప్పి వెళ్లిపోయింది. విజయనగరంలో పూటకూళ్ల ఇల్లు నడుపుకునే పూటకూళ్లమ్మ ఇంట్లో పనీపాటూ చేసుకుంటూ, ఆకతాయిగా తిరిగే మాయలాడు గిరీశం ... ఆమెని మోసగించినందుకు అతడిని చీపురు తీసుకుని వెంటబడుతుంది. దానితో కృష్ణరాయపురం అగ్రహారం వెంకటేశంతో చేరతాడు గిరీశం. లుబ్ధా వధాన్లకి వరసకి తమ్ముడైన గిరీశం: సుబ్బిని పెళ్లి చేసుకోవద్దంటూ లుబ్ధావధాన్లకి అర్థం అయ్యేటట్లు, భయపెడుతూ ఉత్తరం రాస్తాడు. కాబట్టి సుబ్బి పెళ్లి ఆపటంలో పూటకూళ్లమ్మ కూడా తెలీకుండానే పెద్దసాయం చేసింది. గిరీశం కృష్ణరాయపురం చేరేటట్టు చేసింది.

కన్యాశుల్కం నాటకం సుబ్బి కొరకే, సుబ్బికోసమే నడిచింది. చెప్పాలంటే అదృశ్యంగా కథ నడిపింది సుబ్బే. తలా ఒక చెయ్యివేసి దుర్మార్గాన్ని అడ్డుకున్నది మహిళా శక్తి! అదే గురజాడ మహిళలకు చూపిన వెలుగుదారి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కార విజేత । 90787 43851

సమానత్వ సాధనే లక్ష్యం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రకటించి 115 సంవత్సరాలయింది. అమానవీయమైన అణచివేతను, వివక్షను ఎదుర్కొన్న మహిళా కార్మికులు నెత్తురు ధారబోసి హక్కులకోసం తెగించి పోరాడారు. ఫలితంగా 8 గంటల పని దినాన్ని, వేతన పెంపుదలను, మరికొన్ని హక్కులను సాధించుకున్నారు. అయినప్పటికీ మహిళలు నేటికీ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ కనిపిస్తున్నారు. మన సమాజంలో, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో మహిళా లోకం పురుషుల కంటే తక్కువగానే ఉంటూ వస్తోంది. ఇంట్లోనూ, బయట ఉద్యోగాల్లోనూ – మహిళలు పూర్తి బాధ్యతను మోస్తున్నప్పటికీ – ఈ అసమానత కొనసాగుతుంది.

మహిళలు బలమైన పోరాటాలు చేస్తున్నప్పటికీ, వారి మీద లైంగిక హింస పెరుగుతూనే వుంది. దళిత, మైనారిటీ మహిళలు ఎక్కువగా దాడులకు గురి అవుతున్నారు. ప్రొఫెసర్లు, సైంటిస్టులు, డాక్టర్ల దగ్గర నుండి పారిశుద్ధ్య కార్మికుల వరకు – అందరికీ కాంట్రాక్టు, తాత్కాలిక పనులే తప్ప ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. ఈ పనుల్లో కూడా మహిళలకు సమాన పనికి సమాన వేతనాలు రావడం లేదు. ఉద్యోగ బీమా పథకాన్ని కోల్పోవడం అంటే మహిళలను ప్రసూతి ప్రయోజనాలకు దూరంగా పెట్టినట్లే.

1970లో పురుడు పోసుకున్న 'ప్రగతిశీల మహిళా సంఘం' ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించింది. నిర్బంధానికి అణచివేతకు గురయ్యింది. అనేక మంది వీరవనితలు అమరులయ్యారు. 12 రాష్ట్రాల్లో గుర్తింపు కలిగిన మహిళా పోరాటాలు నిర్వహించింది. భూమికోసం, ఇళ్ళస్థలాలకోసం, స్త్రీ పురుష సమానత్వంకోసం లైంగిక హింసకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నిర్మించాం. ఈ క్రమంలో 2013లో సంస్థ చీలికకు గురయ్యింది. ఫలితంగా మహిళా ఉద్యమాలు తీవ్రంగా నష్టాన్ని చవిచూసాయి. వీటిని సమీక్షించుకొన్న తర్వాత రెండు సంస్థలు కలిసి భవిష్యత్‌లో ఒకే సంస్థగా పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. మార్చి 8వ తేదిన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా విలీనం కావాలని రెండు సంస్థలు భావించాయి. ఈ విలీనానికి ఒంగోలు వేదిక కాబోతుంది.

– బి.పద్మ, ప్రధాన కార్యదర్శి,
ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ), ఏపీ



విదేశీ పర్యాటకులు అధికం ఢిల్లీకే

మనదేశానికి వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య 2023లో 95.20 లక్షలు కాగా, 2024లో 96.57 లక్షలకు పెరిగింది. 2024 జనవరి – డిసెంబరులో మనదేశానికి వచ్చిన వారిలో అత్యధికం సెలవులు, వినోదం కోసమే పర్యటిస్తున్నారు. మొత్తం సందర్శకుల్లో సుమారు 57 శాతం పురుషులే. అత్యధికుల పర్యటించిన నగరం ఢిల్లీ. ఈ జాబితాలో పశ్చిమ బెంగాల్‌లోని హరిదాస్‌పూర్ ఉంది. ఇక్కడ దక్షిణాసియాలోనే అతిపెద్ద ల్యాండ్ పోర్ట్ ఉంది.

నగరం	పర్యాటకుల శాతం
ఢిల్లీ	32.39
ముంబై	15.66
చెన్నై	8.29
హరిదాస్‌పూర్	7.91
బెంగళూరు	7.01

ఆధారం: కేంద్ర పర్యాటక శాఖ



అబ్బురపరుస్తున్న సైకత శిల్పం

మహిళా దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా, రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత సైకత శిల్పాన్ని రూపొందించారు. 'అత్యాచారాలు, అసమానతలు', 'ప్లీజ్ రెస్పెక్ట్ ఉమెన్', 'సమానత్వమా..నీవెక్కడ?' అనే నినాదంతో ఈ సైకత శిల్పం రూపొందించారు. ఆరు అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పు, మూడు యూనిట్ల ఇసుకతో ఎనిమిది గంటలు శ్రమించి ఈ శిల్పాన్ని రూపొందించారు. అందరూ దేవిన సిస్టర్స్‌ను అభినందిస్తున్నారు. – రంగంపేట



లారీ ఎక్కిన బోటు

జాతీయ రహదారిపై ఓ బోటు లారీ ఎక్కడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు. గుంటూరు జిల్లా, మంగళగిరి జాతీయరహదారిపై రత్నాల చెరువు వద్ద ఓ పెద్ద బోటు లారీపై వెళుతోంది. దీని గురించి లారీ డ్రైవర్‌ను అడగ్గా నదుల నుంచి ఇసుక రవాణాకు వినియోగించే దీన్ని నెల్లూరు నుంచి రాజమహేంద్రవరానికి తరలిస్తున్నట్టు చెప్పాడు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. 'ఇంత పెద్ద బోటా' అంటూ చూసినవాళ్లు తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకున్నారు. – మంగళగిరి



అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలం శ్రీ భ్రమరాంబా దేవికి శుక్రవారం కొబ్బరికాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఏప్రిల్ 13న కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఆ రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో కొబ్బరికాయలను సమర్పిస్తారు. – శ్రీశైలం టెంపుల్



'ఏటికొప్పాక'కు రాష్ట్రపతి అభినందనలు

ఏటికొప్పాక హస్త కళలు, కళాకారుల నైపుణ్యాన్ని శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అభినందించారు. అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో హస్త కళాకారుడు పెదపాటి శరత్ తన కళాఖండాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇప్పటికే 4 సార్లు రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొంది, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న శరత్ తాజాగా రాష్ట్రపతి అభినందనలను అందుకున్నారు. ఈ నెల ఐదో తేదీ నుంచి రాష్ట్రపతి భవన్‌లో జరుగుతున్న అమృత్ మహోత్సవ్ ప్రదర్శనలో ఏటికొప్పాక హస్తకళాకారుడు శరత్ పాల్గొన్నారు. – యలమంచిలి రూరల్

తహసీల్దార్లకు చట్ట విరుద్ధ రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం

సాక్షి, అమరావతి : చట్ట విరుద్ధంగా జరిగినట్టు తేలిన రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారాన్ని తహసీల్దార్లకు అప్పగించారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శుక్రవారం మెమో జారీ చేశారు. ఇప్పటివరకు చట్ట విరుద్ధ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం కేవలం కలెక్టర్లకు మాత్రమే ఉంది. అనేక చోట్ల భూ మాఫియా.. భూముల కు సంబంధించి వివాదాలు సృష్టించి చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తుండడం, లీగల్ వివాదాల్లోకి లాగడంతో భారీ ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయి. ఆ రిజిస్ట్రేషన్లు చట్ట విరుద్ధమని తేలినా కలెక్టర్లకు మాత్రమే రద్దు చేసే అధికారం ఉండడంతో అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయడం చాలా ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో తహసీల్దార్లకు అధికారాలిస్తే ఎక్కడికక్కడ స్థానికంగానే వివాదాలను పరిష్కరించవచ్చని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ భూములతో పాటు, చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ జరగలేదని తేలిన డాక్యుమెంట్లను తహసీల్దార్లు రద్దు చేయొచ్చని మెమోలో పేర్కొన్నారు. ఇందుకోసం సంబంధిత రిజిస్టర్ పత్రాలను తనకు సమర్పించాలని సబ్ రిజిస్ట్రార్లను తహసీల్దార్లు కోరవచ్చని తెలిపింది. రద్దు చేసిన డాక్యుమెంట్‌ను సంబంధిత వ్యక్తులకు పంపాలని తహసీల్దార్ సూచిస్తారు. డాక్యుమెంట్ల రద్దుకు సంబంధించి ఓ మోడల్ ఫార్మాట్‌ను రెవెన్యూ శాఖ కలెక్టర్లకు పంపింది.

పెచ్చులూడిపడి విద్యార్థినికి తీవ్ర గాయాలు



అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాల వరండాలో శుక్రవారం పెచ్చులూడిపడి ఓ విద్యార్థిని తలకు బలమైన గాయాలయ్యాయి. దాదాపు ఏడు కుట్లు పడినట్లు సమాచారం వివరాల్లోకి వెళ్తే.. గుత్తి మండలం సూర్యసింగంపల్లి గ్రామానికి చెందిన మానస అనంతపురంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. మధ్యాహ్న సమయంలో విద్యార్థినులందరితో పాటు భోజనం చేసింది. ఆ తర్వాత అందరూ వారి వారి తరగతుల్లోకి వెళ్లారు. మానస నీళ్లు తాగి వారి వెనుకాల వెళ్లింది. సరిగ్గా గేటులోకి వెళ్లగానే వరండాపై నుంచి పెచ్చులూడి తలపై పడ్డాయి. అంతకముందు నిమిషాల వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఇదే దారి గుండా తరగతి గదుల్లోకి వెళ్లారు. ఆ సందర్భంలో పెచ్చులూడి ఉంటే పలువురికి తీవ్ర గాయాలయ్యేవని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

విక్రాంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

కాకినాడ సీ పోర్ట్ వాటాల బదిలీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు

- వాటాల బదిలీపై నాలుగున్నరేళ్ల తరువాత కేవీ రావు ఫిర్యాదు చేశారు
- ఇంత జాప్యానికి ఆయన సంతృప్తికర వివరణ ఇవ్వలేదు
- బెదిరించి ఉంటే కోర్టులో ఎందుకు ఫిర్యాదు చేయలేదు?
- ఫిర్యాదుకు ముందే పోలీసులు ప్రాథమిక విచారణ ఎలా చేస్తారు?
- ఆడిట్ రిపోర్ట్‌ను ఆడిట్ కంపెనీనే తయారు చేసిందని కేవీ రావే చెబుతున్నారు
- అలాంటప్పుడు ఆ నివేదికను విక్రాంత్‌రెడ్డి ఎలా ఫోర్జరీ చేస్తారు?
- తీర్పులో పేర్కొన్న హైకోర్టు

సాక్షి, అమరావతి : కాకినాడ సీ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో యర్రంరెడ్డి విక్రాంత్‌రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, కేసుతో సంబంధం ఉన్న ఏ వ్యక్తినీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రలోభపెట్టడం, భయపెట్టడం చేయరాదని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. తనను బెదిరించి పోర్టులో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసిందంటూ సీఎం చంద్రబాబు సన్నిహితుడు, పోర్టు ప్రమోటర్ కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసిన ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విక్రాంత్‌రెడ్డి డిసెంబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విక్రాంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, కేవీ రావు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. ఆ తీర్పులో ప్రధానాంశాలు..

నాలుగున్నరేళ్ల తర్వాత ఫిర్యాదా?

'నాలుగున్నరేళ్ల క్రితం ఘటన జరిగితే ఇప్పుడు ఫిర్యాదు చేశారు. ఈ ఆలస్యంపై ఫిర్యాదుదారు కేవీ రావు నుంచి సంతృప్తికర సమాధానం రాలేదు. జాప్యానికి బెదిరింపులే కారణమని, ప్రభుత్వం మారడంతో ఫిర్యాదు చేశానంటూ ఆయన చేసిన వాదన ఆమోదయోగ్యం కాదు. అయన్ని బెదిరించి ఉంటే, కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు ఎందుకు దాఖలు చేయలేదో వివరణ లేదు. కేవీ రావును బెదిరించడం వల్లే ఆయన వాటాలను నామమాత్రపు ధరకు అరబిందో రియాలిటీకి బదిలీ చేశారన్నదే పిటిషనర్ విక్రాంత్‌రెడ్డిపై ఉన్న ప్రధాన నేరారోపణ. పీకేఎఫ్ శ్రీధర్ సంతానం ఆడిట్ సంస్థతో విక్రాంత్ కుమ్మక్కయి ఆడిట్ రిపోర్ట్‌లో సంఖ్యలను పెంచి చూపారని, దీన్ని అడ్డంపెట్టుకునే కేవీ రావును బెదిరించారని ఆరోపిస్తున్నారు. ఆడిట్ సంస్థతో కలిసి విక్రాంత్‌రెడ్డి సంఖ్యలను పెంచి చూపారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవు. దీనిద్వారా విక్రాంత్ లబ్ధి పొందారని సీఐడీ కూడా చెప్పడంలేదు. ఎఫ్ఐఆర్‌లోనూ ఆడిట్ కంపెనీని విక్రాంత్ కలిసినట్లు లేదు. అంతేకాక అరబిందో కొన్న వాటాల ద్వారా విక్రాంత్‌రెడ్డి ఆర్థికంగా లబ్ధి పొందినట్లు ఎలాంటి ఆరోపణలు లేవు. రిపోర్టును ఆడిట్ సంస్థే తయారు చేసిందని కేవీ రావే అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు ఈ నివేదిక విషయంలో విక్రాంత్‌పై నేరారోపణలు చేయడానికి వీల్లేదు. దానిని విక్రాంత్‌రెడ్డి ఫోర్జరీ చేశారన్న ప్రశ్నే తలెత్తదు. ఫోర్జరీ చేశారని సీఐడీ, ఫిర్యాదుదారు కూడా చెప్పడం లేదు. విక్రాంత్‌రెడ్డి ఆ నివేదికను తారుమారు చేయడం, మార్చడం, మోసపూరితంగా సంపాదించడం చేయలేదు. అందువల్ల ఆయనకు సెక్షన్ 464 వర్తించదు' అని జస్టిస్ శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



ఫిర్యాదు లేకుండానే ప్రాథమిక విచారణ జరపడమా!

'2024 సెప్టెంబర్‌లో తామిచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారని కేవీ రావు చెబుతున్నారు. ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే.. 2024 డిసెంబరు 2న కేవీ రావు ఫిర్యాదు చేశారు. అంటే అంతకు ముందు ఎలాంటి ఫిర్యాదు లేదు. ఫిర్యాదు లేకుండానే పోలీసులు ఎలా ప్రాథమిక విచారణ జరిపారో తెలియడంలేదు. నాలుగున్నరేళ్ల జాప్యంతో ఫిర్యాదు చేసినప్పుడు, పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి తీరాలి. కానీ, ఇక్కడ ఫిర్యాదు ఇవ్వకపోయినా పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారు. దీనినిబట్టి పోలీసులు దర్యాప్తును ఏ తీరున సాగించారన్న దానిపై ఎలాంటి సందేహం అక్కర్లేదు' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

మాజీమంత్రి పేర్ని నానికి ఊరట

హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు

- గోదాము కార్యకలాపాలతో ఆయనకు సంబంధంలేదు
- ఉద్యోగి నుంచి నాని ఖాతాకు రూ.1.50 లక్షలు రావడం నేరంకాదు
- బియ్యం నిల్వల్లో తేడాలపై ఆయన భార్య జయసుధ మొదట్లోనే అధికారులకు చెప్పారు
- వారు పది రోజుల తర్వాత స్పందించారు
- జరిమానా కట్టాలన్నారు, కట్టేశారు.. ఇది వారి చిత్తశుద్ధిని చూపుతోంది
- అందుకే ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నా
- తీర్పులో స్పష్టంచేసిన న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: రేషన్ బియ్యం మాయం కేసులో మాజీమంత్రి పేర్ని నానికి హైకోర్టు ఊరటనిచ్చింది. కృష్ణాజిల్లా బందరు (మచిలీపట్నం) తాలుకా పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు షరతులు విధించింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని నానిని ఆదేశించింది. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏ వ్యక్తిని కూడా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రలోభపెట్టడం గానీ, భయపెట్టడం గానీ చేయరాదంది. దర్యాప్తునకు సహకరించాలని ఆయన్ను ఆదేశించింది. అంతేకాక.. ఎప్పుడు పిలిస్తే అప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. నాని కస్టోడియల్ ఇంటరాగేషన్ ఎంత మాత్రం అవసరంలేదని అందులో పేర్కొన్నారు. ఆయన పారిపోయే అవకాశంలేదని.. పైపెచ్చు ఆయనకు ఇక్కడే స్థిర నివాసం ఉందని తెలిపారు. అంతేగాక, నాని భార్య జయసుధ నిర్వహిస్తున్న గోదాము రోజువారీ కార్యకలాపాలతో ఆయనకెలాంటి సంబంధంలేదన్నారు. సంబంధం ఉన్నట్లు పోలీసుల ఎఫ్ఐఆర్‌లో గానీ, మిగిలిన నిందితుల రిమాండ్ రిపోర్ట్‌లోగానీ ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. తగ్గిన బియ్యం బస్తాలకు సంబంధించి రూ.1.70 కోట్ల మొత్తాన్ని గోదాము యజమాని అయిన నాని భార్య చెల్లించేశారని, ఇది వారి చిత్తశుద్ధిని చూపుతోందని.. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టంచేశారు. అలాగే, బియ్యం నిల్వల్లో తేడాపై జయసుధ మొదట్లోనే అధికారులకు చెప్పినప్పటికీ వారు పదిరోజుల వరకు స్పందించలేదని.. దీనికి కారణాలూ చెప్పడంలేదన్నారు.

మొదటి ఎఫ్ఐఆర్‌లో నాని పేరులేదు..

ఇక గోదాములో పనిచేస్తున్న మానసతేజ తన ఖాతా నుంచి పేర్ని నానికి రూ.1.50 లక్షలు వచ్చాయన్నదే ప్రధాన ఆరోపణ అని, ఇదేమీ బీఎన్ఎస్ సెక్షన్ 316 (5) కింద శిక్షార్హమైన నేరం కిందకు రాదన్నారు. మిగిలిన నేరాలన్నీ కూడా ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడేవేనని తెలిపారు. పోలీసులు మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్ని నాని పేరు లేదని, ఎప్పుడైతే కింది కోర్టు నాని భార్య జయసుధకు బెయిల్ మంజూరు చేసిందో, ఆ వెంటనే పోలీసులు నాని పేరును నిందితుల జాబితాలో చేర్చారన్నారు. మానస తేజ నుంచి నానికి రూ.1.50 లక్షల బదిలీ కావడాన్నే నిందితునిగా చేర్చడానికి కారణంగా పోలీసులు చెబుతున్నారని తెలిపారు. నాని తరఫున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు, న్యాయవాది వీసీహెచ్ నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన జస్టిస్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరించారు.

12న 'యువత పోరు' బాట



- అదే రోజు ఉదయం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు
- కేసులు నమోదవుతున్న సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయసహాయం
- 16 నాటికి పార్టీ మండల కమిటీల నియామకాలు పూర్తిచేయండి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఆయా వర్గాల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 12న అన్ని జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన యువత పోరు ర్యాలీలను, జిల్లా కలెక్టర్లకు మెమోరాండం సమర్పించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అదే రోజున వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శులు, ముఖ్య నేతలతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

- నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి మోసగించిన వైనం, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం ఇలా విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆయా వర్గాల పక్షాన పోరుబాటకు సిద్ధమయ్యాం. ఇది అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడాల్సిన సమయం. యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. విద్యార్థులు, యువకులు, వారి తల్లిదండ్రులు భాగస్వాములయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలి.
- కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ.. రైతులకు అండగా నిలుస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపట్టిన కార్యక్రమం ఇప్పటికే విజయవంతమైంది. ఆ తర్వాత విద్యుత్ చార్జీలపై చేసిన కార్యక్రమం కూడా అదే స్థాయిలో విజయవంతమైంది. జిల్లాల పార్టీ అధ్యక్షులు కీలకంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ ఈ మూడో కార్యక్రమాన్నీ (యువత పోరు) విజయవంతం చేయాలి.
- యువత పోరుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహిద్దాం. పార్టీ శ్రేణులు సైతం భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రజల గొంతుకగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలి. జిల్లా స్థాయిలో జరుగుతున్న కార్యక్రమమైనందున ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విజయవంతం చేయాలి.
- 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి చోటా ఘనంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి, మన పార్టీపై ఉన్న ప్రజాభిమానం ఈ సందర్భంగా వెల్లడవ్వాలి. ఈ కార్యక్రమాన్ని ఉదయాన్నే పూర్తి చేసుకుని అనంతరం యువత పోరు కార్యక్రమం నిర్వహించాలి. యువత పోరు కార్యక్రమం ప్రజలకు సంబంధించిన అంశం కాబట్టి ఆ రోజు యధావిధిగా కొనసాగించాలని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సూచించారు. అంతేకాక పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామాల నుంచి రాష్ట్రస్థాయి వరకూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి.
- సోషల్ మీడియాకు సంబంధించి కొత్తగా మరి కొంతమంది కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారు. వారికి న్యాయ సహాయం అందించేందుకు లీగల్ సెల్ సిద్ధంగా ఉంది. ఏ సమయంలో ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే లీగల్ సెల్‌ను అప్రమత్తం చేసి వారికి అండగా నిలబడాలి.
- వైఎస్సార్‌సీపీ మండల స్థాయి వరకూ కమిటీల నియామకం కూడా ఈ నెల 16 నాటికి పూర్తి చేయాలని వైఎస్ జగన్ ఆదేశించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయి నాయకుల సహకారం తీసుకుని కమిటీల నియామకాలు పూర్తిచేయాలి.

పోసానికి బెయిల్

మంజూరు చేసిన కడప కోర్టు

కడప అర్బన్: అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి కడపలోని మొబైల్‌కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పోసానిని పోలీసులు గత నెలలో అరెస్ట్ చేసి, రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. తరువాత ఆయన తరఫున న్యాయవాది నాగిరెడ్డి కడప మొబైల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మేజిస్ట్రేట్ శుక్రవారం బెయిల్ మంజూరు చేశారు. ఓబులవారిపల్లె పోలీసులు పోసానిని కస్టడీకి కోరుతూ వేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేట్ తోసిపుచ్చారు.

నోటీసులిచ్చి వివరణ తీసుకోండి: హైకోర్టు

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో సినీ నటుడు పోసాని కృష్ణమురళికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు జారీ చేసి, ఆయన వివరణ తీసుకోవాలని విజయవాడ సూర్యారావుపేట పోలీసులను హైకోర్టు ఆదేశించింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎల్లో మీడియా అధినేతలపై చేసిన వ్యాఖ్యలపై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన ఈ కేసును కొట్టేయాలని కోరుతూ పోసాని హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ శుక్రవారం విచారణ జరిపారు. ఈ కేసులో ఇంకా పీటీ వారెంట్ అమలు కాలేదని పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) సాయి రోహిత్ చెప్పారు. దీంతో పిటిషనర్ పోసానికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు.

రెండు రోజుల పోలీస్ కస్టడీకి పోసాని

నరసరావుపేట టౌన్: పోసాని కృష్ణమురళిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోసాని నుంచి కేసుకు సంబంధించిన వివరాలు రాబట్టడానికి వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ స్థానిక రెండో పట్టణ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ నెల 8వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పోలీస్ కస్టడీకి అనుమతించారు. కస్టడీ సమయంలో థర్డ్ డిగ్రీ మెథడ్స్ ఉపయోగించకూడదని, పోసాని కోరితే ఆయన న్యాయవాదుల సమక్షంలోనే విచారించాలని ఆదేశించారు. పోసానిని పోలీస్ కస్టడీకి తీసుకొన్న తర్వాత, తిరిగి అప్పగించే సమయంలో వైద్యుల చేత పరీక్షలు చేయించి నివేదికను న్యాయస్థానంలో సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, పోసాని దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

విలేజ్ క్లినిక్స్‌లో పాముకాటు మందులు ఉంచాలి

'మండలి'లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 10,032 విలేజ్ క్లినిక్స్‌ను ఏర్పాటుచేశారని.. వీటిల్లో పాము కాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణ రాజు ప్రభుత్వాన్ని కోరారు. విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో అడ్డపాగ (చుట్టతిప్పి తాగడం) అలవాటు ఎక్కువగా ఉందని.. దీనివల్ల సబ్‌మ్యూకోజ్ ఫైబ్రోసిస్ అనే ప్రీ క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశమున్నందున దీని తాలూకు మందులను పీహెచ్‌సీ, విలేజ్ క్లినిక్స్‌లో ఉంచాలని సూచించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలిస్తామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. అలాగే, గర్భాశయ క్యాన్సర్‌ను నివారించే చర్యల్లో భాగంగా బాలికలకు ఉచితంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ పంపిణీ కోసం పలు సంస్థలతో చర్చలు జరుపుతున్నామని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 9 నుంచి 15 ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సలీమ్



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా బ్రైత్‌వెయిట్ కంపెనీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సలీమ్ జి పురుషోత్తమన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు డైరెక్టర్(ఆపరేషన్స్)గా బాధ్యతలు నిర్వహించిన ఎ.కె.సక్సేనా మెయిల్ ఎండీగా వెళ్లడంతో.. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. గతేడాది ఇంటర్వ్యూలు నిర్వహించగా స్టీల్‌ప్లాంట్ సీజీఎం ఒకరు కోర్టులో కేసు వేయడంతో ఇప్పటి వరకు భర్తీ కాలేదు. అప్పటి నుంచి ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు కేంద్ర కేబినెట్ కమిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో సలీమ్ మే 2026 వరకు ఆ పదవిలో కొనసాగనున్నారు.

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సులు

ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు

సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్‌కుమార్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)/పెనమలూరు: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు నూతన ఆలోచనలతో కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ మామిడాల జగదీష్ కుమార్ సూచించారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గోల్డెన్ జూబ్లీ వేడుకల ప్రారంభ సభ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ఆవరణలోని మైదానంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి జగదీష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన, సిద్ధార్థ గోల్డెన్ జూబ్లీ వేడుకల లోగో, కళాశాల టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా యూజీసీ చర్యలు తీసుకుంటోందన్నారు. దేశంలో పరిశోధనలు మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. డిగ్రీలో చదువుకున్న సబ్జెక్టుతో సంబంధం లేకుండా విద్యార్థికి నచ్చిన సబ్జెక్టులతో పీజీ కోర్సు చేసే వెసులుబాటును యూజీసీ తీసుకురావడం వల్ల ఉన్నతవిద్యకు ఆదరణ పెరిగిందన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ విలువలతో కూడిన ఉన్నత విద్య అందించే లక్ష్యంతో సిద్ధార్థ అకాడమీని స్థాపించామని చెప్పారు. కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ అన్ని విభాగాల్లో సిద్ధార్థ సంస్థలు స్థాపించి విజయవాడను విద్యలవాడగా మలిచామన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పీవీ.రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ సభ్యులు జగదీష్‌కుమార్‌ను సత్కరించారు. సభకు ముందు, ముగిసిన తరువాత సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.



ప్రాజెక్టు గురించి తెలుసుకుంటున్న యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్

జాతీయ నూతన విద్యావిధానం అమలుకు కృషి

జాతీయ నూతన విద్యా విధానం (ఎన్ఎస్ఈపీ) అమలుకు కృషి చేస్తున్నట్టు యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్‌కుమార్ తెలిపారు. విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో నూతన అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ భవనం శంకుస్థాపన, వై.వి.రావు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. అనంతరం కాలేజీలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ఎక్స్‌పోను జగదీష్‌కుమార్ పరిశీలించి, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మహిళా టీచర్లపై పీజీటీ దాడి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పీజీటీ గురునాథ్ రెడ్డి, హెచ్‌ఎం సస్పెన్షన్

అన్నమయ్య జిల్లా వేంపల్లెలో ఘటన

వేంపల్లె : అన్నమయ్య జిల్లా వేంపల్లెలోని తలిశెట్టి శేషమ్మ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్లపై పీజీటీ (పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్) గురునాథ్‌రెడ్డి దాడి చేసిన ఘటన తీవ్ర దుమారానికి తెరదీసింది. ఈ మేరకు శుక్రవారం వేంపల్లె పోలీసుస్టేషన్‌లో పీజీటీ గురునాథ్ రెడ్డిపై మహిళా టీచర్లు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం మహిళా టీచర్లు పాఠశాలకు వస్తున్న క్రమంలో పీజీటీ గురునాథ్ రెడ్డి వారిని ఆనుకుంటూ తన కారును వేగంగా నడుపుకుంటూ లోపలికి ప్రవేశించాడు. దీంతో వారు ఆయనను ప్రశ్నించడంతో పీజీటీ వారిని దూషించాడు. ప్రతిగా టీచర్లు కూడా వాగ్వాదానికి దిగారు. అనంతరం పాఠశాలలోని ఆఫీసులోకి వెళ్లిన గురునాథ్ రెడ్డి.. అక్కడే ఉన్న నాగాంజలి అనే హిందీ ఉపాధ్యాయురాలిని బలంగా కాలితో తన్నాడు. ఆ పక్కనే ఉన్న క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు ప్రభావతిని గొంతు పట్టుకుని నెట్టడంతో పాటు.. ఫిజికల్ సైన్స్ సహాయ ఉపాధ్యాయురాలు సునీతను చేతితో గుద్దాడు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడంతో గురునాథ్ రెడ్డి పాఠశాల నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, డిప్యూటీ డీఈఓ మీనాక్షి పాఠశాలకు వచ్చి ఘటనపై విచారణ చేపట్టారు. పాఠశాల హెచ్‌ఎం నారాయణమ్మ, గురునాథ్ రెడ్డి ఘటనకు బాధ్యులని నిర్ధారణ అయ్యిందని డీఈఓ తెలిపారు. హెచ్‌ఎం ప్రోత్సాహంతోనే గురునాథ్ రెడ్డి దాడి చేసినట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో పీజీటీ గురునాథ్ రెడ్డి, హెచ్‌ఎం నారాయణమ్మను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ వివరించారు.

మళ్లీ అదే మాట!

భారత్‌లో అధిక సుంకాలని అసహనం

ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలకు సిద్ధంగా ఉండాలి: ట్రంప్



న్యూయార్క్: అమెరికా ఉత్పత్తులపై విదేశాలు వసూలు చేస్తున్న టారిఫ్‌ల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అసహనం వెళ్లగక్కారు. భారతదేశంలో అధికంగా టారిఫ్‌లు విధిస్తున్నారని మళ్లీ అసంతృప్తి వ్యక్తంచేశారు. నిజంగా అధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్ అని పేర్కొన్నారు. ఇది న్యాయబద్ధం కాదని చెప్పారు. తమకు న్యాయం జరగాలంటే అదే రీతిలో ప్రతిస్పందించక తప్పదని స్పష్టంచేశారు. ప్రతీకార సుంకాలు విధించబోతున్నామని, వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తేల్చిచెప్పారు. తమ ఉత్పత్తులపై విచ్చలవిడిగా టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల ఉత్పత్తులపైనా అదే స్థాయిలో టారిఫ్‌లు విధించబోతున్నామని ఉద్ఘాటించారు. ఇండియా, చైనాతో పాటు ఏ దేశమైనా సరే తమ ఉత్పత్తులు వాడుకుంటే భారీగా సుంకాలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇన్నాళ్లూ అమెరికాను దోచుకున్నారని, ఇకపై అది సాగనివ్వబోమని హెచ్చరించారు. ఆయన గతంలో కూడా ఇండియాను 'టారిఫ్ కింగ్', 'బిగ్ అబ్యూసర్' అని నిందించారు. ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్లుగా(రూ.8.70 లక్షల కోట్లు) ఉందని ట్రంప్ చెబుతున్నారు. దీన్ని తగ్గించాల్సిందేనని పట్టుబడుతున్నారు.

అమెరికాకు గేమ్ ఛేంజర్

వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో గురువారం కొన్ని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై డొనాల్డ్ ట్రంప్ సంతకాలు చేశారు. అమెరికా పాల ఉత్పత్తులతోపాటు ఇతర వస్తువులపై కెనడాలో 250 శాతం టారిఫ్‌లు విధిస్తున్నారని ఆక్షేపించారు. కెనడా ఉత్పత్తులు ఇకపై తమకు అవసరం లేదని, ఒకవేళ దిగుమతి చేసుకున్నా భారీగా సుంకాలు విధిస్తామని స్పష్టంచేశారు. విదేశీ ఉత్పత్తులపై ఇప్పుడు విధిస్తున్న టారిఫ్‌లు తాత్కాలికమేనని, అసలైన మోత ఏప్రిల్ 2 నుంచి మోగబోతోందని, అందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. అమెరికాకు ఇదొక గేమ్ ఛేంజర్ కాబోతోందని వివరించారు.

టారిఫ్ వార్.. ఎవరికి లాభం?

అమెరికాపై సగటున 18 శాతం సుంకాలు

- మనపై అమెరికా విధిస్తున్నది సగటున 5 శాతం లోపే
- పరస్పర సుంకాలు అమలైతే మనపై తీవ్ర ప్రభావమే!
- కేంద్రం దిద్దుబాటు చర్యలు
- పలు సుంకాల తగ్గింపు యోచన

2024లో ద్వైపాక్షిక వాణిజ్యం
129.2 బిలియన్ డాలర్లు
(రూ.11.2 లక్షల కోట్లు)
అమెరికాకు భారత ఎగుమతులు
87.4 బిలియన్ డాలర్లు
(రూ7.6 లక్షల కోట్లు)
అమెరికా నుంచి దిగుమతులు
41.8 బిలియన్ డాలర్లు
(రూ.3.63 లక్షల కోట్లు)
వాణిజ్య లోటు
45.7 బిలియన్ డాలర్లు
(రూ.3.97 లక్షల కోట్లు)
అయితే చైనా (296 బిలియన్లు), మెక్సికో (172 బిలియన్లు) వంటి దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువేనన్నది భారత్ వాదన



అన్నట్టుగానే భారత్‌పైనా సుంకాల మోతకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెర తీశారు. ఏప్రిల్ 2 నుంచి పరస్పర సుంకాలు తప్పవని పునరుద్ఘాటించారు. దీని ప్రభావం మనపై ఏ మేరకు ఉండనుందంటూ జోరుగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అమెరికా మనకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. అందుకే అగ్ర రాజ్యంతో టారిఫ్‌ల రగడకు తెర దించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఇప్పటికే అమెరికాలో పర్యటిస్తున్నారు. ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ద్వైపాక్షిక వర్తక ఒప్పందం (బీటీఏ)పై చర్చలు జరుపుతున్నారు. ఈలోగా పలు అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లను వీలైనంతగా తగ్గిస్తూ భారత్ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ తదితర ఉత్పత్తులపైనా టారిఫ్ కోతలు ప్రకటించే అవకాశం కన్పిస్తోంది.

ఏ మేరకు సుంకాలు?

సుంకమంటే ఒక దేశం మరో దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను. భారత ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలు సగటున 4 నుంచి 5 శాతం మించడం లేదు. భారత్ మాత్రం అమెరికా ఉత్పత్తులపై సగటున 18 శాతం పై చిలుకు దిగుమతి సుంకాలు విధిస్తోంది. లగ్జరీ కార్లు, కెమికల్స్, ఎలక్ట్రానిక్స్‌పై 125 శాతం, మద్యం మీదైతే ఏకంగా 150 శాతం దాకా వసూలు చేస్తోంది! ఈ తేడాలను సరిచేయకుంటే ఏప్రిల్ 2 నుంచి తామూ అంతే మొత్తం బాదుతామని ట్రంప్ బెదిరిస్తున్నారు. అమెరికాపై ప్రధానంగా ఆధారపడ్డ భారత ఎగుమతిదారులపై ఇది గట్టి ప్రభావమే చూపనుంది. ముఖ్యంగా మన ఇనుము, ఉక్కు, జౌళి ఎగుమతులపై ప్రభావం తీవ్రంగా ఉండనుంది. దిద్దుబాటు చర్యలేవీ తీసుకోని పక్షంలో 25 బిలియన్ డాలర్ల విలువైన భారత ఎగుమతులపై ప్రభావం పడవచ్చని అంచనా. అయితే మన జీడీపీలో అమెరికా ఎగుమతుల వాటా కేవలం 2.2 శాతమే. కనుక భారత్ మరీ అంతగా బెంబేలెత్తిపోవాల్సిన పని లేదన్నది ఆర్థికవేత్తల మాట. ''భారత్ వంటి అతిపెద్ద మార్కెట్‌ను అమెరికా విస్మరించలేదు. అక్కడి ఈ కామర్స్ కంపెనీలు, బ్యాంకులు, ఆర్థిక సేవలు, టెక్నాలజీ సంస్థలకు భారత మార్కెట్ అంటే భారీ ఆసక్తి. సోషల్ నెట్‌వర్కింగ్ కంపెనీలకూ భారత్ ప్రధానమే'' అని వారంటున్నారు.

అమెరికాతో భారత్ వాణిజ్యమెంత?

అమెరికాకు అతి పెద్ద ఎగుమతిదారుల్లో భారత్ ఒకటి. 2024లో ఆ దేశానికి 87.4 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా నుంచి 41.8 బిలియన్ డాలర్ల దిగుమతులు మాత్రమే చేసుకుంది. ఈ వాణిజ్య లోటునూ ట్రంప్ ప్రశ్నిస్తున్నారు. దీన్ని పూడ్చాల్సిందేనని పట్టుబడుతున్నారు.

మనకు మేలే!

ట్రంప్ తెర తీసిన టారిఫ్ వార్ అంతిమంగా భారత్‌కే లబ్ధి చేకూరుస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. చైనా, కెనడా, మెక్సికో తదితర దేశాలపై అమెరికా ఇప్పటికే సుంకాలను పెంచడం తెలిసిందే. బదులుగా అమెరికాపై ప్రతీకార సుంకాలు తప్పవని ఆ దేశాలు కూడా స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా దేశాల నుంచి అమెరికాకు ఎగుమతులు బాగా తగ్గేలా కన్పిస్తున్నాయి. ఇది భారత్‌కు సానుకూలంగా మారుతుందని, మనం మరిన్ని ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకు వీలు కలుగుతుందని ఆర్థికవేత్తలు అంటున్నారు. ట్రంప్ తొలి హయాంలో కూడా చైనాపై సుంకాలు పెంచడంతో భారత్ బాగా లాభపడింది. ఈసారి కూడా అమెరికాకు మన మిర్చి, జౌళి తదితర ఉత్పత్తుల ఎగుమతులు బాగా పెరిగే అవకాశముంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాకు మన ప్రధాన ఎగుమతులు	అమెరికా నుంచి మన దిగుమతులు
→ ముత్యాలు, విలువైన రాళ్లు	→ ముడిచమురు, అనుబంధ ఉత్పత్తులు
→ ఎలక్ట్రానిక్ యంత్రాలు, పరికరాలు	→ ఆర్టిఫిషియల్ జ్యుయెలరీ
→ ఔషధాలు, అనుబంధ ఉత్పత్తులు	→ న్యూక్లియర్ రియాక్టర్లు, బాయిలర్లు
→ అణు రియాక్టర్లు, మెషీనరీ	→ పవర్ ప్లాంట్ పరికరాలు
→ పెట్రోలియం ఉత్పత్తులు,	→ విమానాలు, వాటి విడిభాగాలు
→ టెలీకమ్యూనికేషన్ పరికరాలు	→ వైద్య, రక్షణ పరికరాలు
→ నూలు వస్త్రాలు	

ఇప్పటికే చర్యలు

అమెరికాపై విధిస్తున్న సుంకాల తగ్గింపుకు భారత్ ఇప్పటికే చర్యలు తీసుకుంటోంది...

→ ఇటీవలి బడ్జెట్లో స్మార్ట్ ఫోన్ దిగుమతులపై ప్రకటించిన 15-16 శాతం సుంకాల నుంచి అమెరికాను మినహాయించాలని కేంద్రం భావిస్తోంది.

→ వైద్య పరికరాలు, లగ్జరీ మోటార్ సైకిళ్ల వంటి పలు అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లను తగ్గించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

→ వాణిజ్య లోటును తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా నుంచి రక్షణ, చమురు తదితర ఉత్పత్తుల దిగుమతులను ఇతోధికంగా పెంచేందుకు ట్రంప్-మోదీ భేటీలో అంగీకారం కూడా కుదిరింది.

→ ఏఐజీ వంటి అమెరికా బీమా దిగ్గజాలకు లబ్ధి చేకూర్చేలా ఆ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతానికి పెంచుతూ తాజా బడ్జెట్లో కేంద్రం నిర్ణయం తీసుకుంది.

→ భారత ఔషధాలపై అమెరికా ఎలాంటి సుంకాలూ వసూలు చేయడం లేదు. కనుక అమెరికా ఔషధ దిగుమతులపై భారత్ విధిస్తున్న 10 శాతం సుంకాన్ని కూడా ఎత్తేయాలని ఫార్మా సంస్థలు సూచిస్తున్నాయి.

→ అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న పలు వ్యవసాయోత్పత్తులపై ఏకంగా 42 నుంచి 120 శాతం దాకా సుంకాలున్నాయి. వీటిని కూడా బాగా తగ్గించే అవకాశముంది.

త్వరలో ఒప్పందం: భారత్

న్యూఢిల్లీ/వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుని తాజా ప్రకటనపై భారత్ ఆచితూచి స్పందించింది. అగ్ర రాజ్యంతో వాణిజ్య బంధాన్ని మరింత పటిష్టం చేసుకోవడమే తమ లక్ష్యమని పేర్కొంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) ద్వారా టారిఫ్, టారిఫేతర అడ్డంకులను తగ్గించుకునేందుకు కృషి చేస్తున్నట్టు వివరించింది. దీన్ని ఇరు దేశాలకూ ఆమోదనీయ రీతిలో పరిష్కరించుకుంటామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో విశ్వాసం వెలిబుచ్చారు.

సుంకాల తగ్గింపుకు భారత్ ఒప్పకుంది: ట్రంప్

అమెరికాపై సుంకాలను భారీగా తగ్గించేందుకు భారత్ అంగీకరించినట్టు ట్రంప్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం వైట్‌హౌస్ ఓవల్ కార్యాలయంలో ఈ మేరకు ప్రకటించారు. అమెరికాపై ఇన్నాళ్లుగా భారత్ విధిస్తున్న హెచ్చు సుంకాలను తాను బయట పెట్టడమే ఇందుకు కారణమని చెప్పుకొచ్చారు.

రష్యాకు ట్రంప్ షాక్

ఆంక్షలు, టారిఫ్‌ల యోచన • సోషల్ మీడియాలో పోస్టు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు ఊహించని షాక్ ఇచ్చారు. ఉక్రెయిన్-రష్యా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం, శాంతి ఒప్పందం కుదిరేదాకా రష్యాపై భారీ స్థాయిలో ఆంక్షలు, టారిఫ్‌లు విధించాలని తీవ్రంగా యోచిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రష్యా, ఉక్రెయిన్ వెంటనే శాంతి చర్చలకు శ్రీకారం చుట్టాలని స్పష్టంచేశారు. ఆలస్యం కాకముందే ఆ పని ప్రారంభిస్తే బాగుంటుందని హితవు పలికారు. నిన్నటిదాకా రష్యా పట్ల సానుకూలంగా మాట్లాడిన ట్రంప్ హఠాత్తుగా స్వరం మార్చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, రష్యాకు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం కొత్తేమీ కాదు. ఈ ఏడాది జనవరిలో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రష్యాను ఉద్దేశించి కఠిన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని నిలిపివేయకపోతే మరిన్ని ఆంక్షలు విధిస్తామని, రష్యా ఉత్పత్తులపై అధికంగా టారిఫ్‌లు వసూలు చేస్తామని తేల్చిచెప్పారు. ఆయన తన వైఖరికి కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధాన్ని ముగించే దిశగా రష్యాపై ఒత్తిడి పెంచడానికి ఆంక్షలు, టారిఫ్‌లను మరోసారి తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ట్రంప్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. యూరప్ దేశాలు వ్యతిరేకిస్తున్నా ఆయన వెనక్కి తగ్గడం లేదు. ఒకవైపు ఉక్రెయిన్‌ను, మరోవైపు రష్యాను ఏకకాలంలో దారికి తీసుకురావాలన్నదే ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. రష్యాపై కొత్తగా ఎలాంటి ఆంక్షలు విధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పుతిన్ ప్రభుత్వం వాటికి తలొగ్గుతుందా? అనేది చూడాలి.

మహిళల రక్షణలో ప్రధాని

గాంధీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రధానికి గుజరాత్‌లో పూర్తిగా మహిళా పోలీసులు బందోబస్తు కల్పించనున్నారు. ప్రధాని రక్షణ కవచంలో ఇలా అందరూ మహిళలే ఉండటం తొలిసారి. శనివారం నవసరి జిల్లాలోని వాన్సీ బోరిలో ప్రధాని హెలికాప్టర్ దిగినప్పటినుంచి వేదిక దాకా మహిళా పోలీసు అధికారిణులే రక్షణ కల్పిస్తారు. లక్‌పతి దీదీ సమ్మేళనంలో మోదీ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి 2,100 మహిళా కానిస్టేబుళ్లు, 187 మంది సబ్ఇన్‌స్పెక్టర్లు, 61 మంది సీఐలు, 16 మంది డీఎస్పీలు, ఐదుగురు ఎస్పీలు, ఒక ఇన్‌స్పెక్టర్ జనరల్, ఒక అదనపు డీజీపీ.. ఇలా వివిధ స్థాయిల్లోని మహిళా సిబ్బంది భద్రతా వలయంలో ఉండనున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారిణి, హోంశాఖ కార్యదర్శి నిపుణ తోర్వాణే ప్రధాని మోదీ భద్రతను పర్యవేక్షిస్తారని హోంశాఖ సహాయమంత్రి హర్ష్ సంఘవి తెలిపారు.

రాణా పిటిషన్ తిరస్కరణ

వాషింగ్టన్: భారత్‌కు అప్పగించొద్దంటూ ముంబై ఉగ్రదాడుల నిందితుడు తహవ్వుర్ రాణా వేసిన అత్యవసర పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. పాక్ సంతతికి చెందిన కెనడా జాతీయుడైన రాణా లాస్ ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ జైల్లో ఉన్నాడు. లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ కోల్మన్ హెడ్లీతో అతనికి సంబంధాలున్నాయి. 26/11 దాడుల కేసులో రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించింది. అతని రివ్యూ పిటిషన్‌ను జనవరిలో ఫెడరల్ కోర్టు తోసిపుచ్చింది. రాణాకు చికిత్స విషయంలో నిర్ణయం తెలిపేందుకు భారత్ నిరాకరించింది. దాంతో భారత్‌కు అప్పగిస్తే బతికనంటూ రాణా పిటిషన్ దాఖలు చేశారు. పాక్ సంతతి ముస్లిం గనుక తనను చిత్రహింసలకు గురి చేస్తారని ఆరోపించారు.

వంటనూనె తగ్గించండి వ్యాయామం చేయండి

ఊబకాయానికి చెక్ పెట్టండి • ప్రధాని మోదీ పిలుపు

సిల్వాస్సా: దేశంలో ఊబకాయ సమస్య నానాటికీ తీవ్రరూపం దాలుస్తుండడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులుగా మారుతారని అధ్యయనాలు చెబుతున్నాయని గుర్తుచేశారు. ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయంతో అవస్థలు పడే ప్రమాదం ఉందన్నారు. ఇది నిజంగా ప్రమాదకరమైన, దిగ్భ్రాంతి కలిగించే సంఖ్య అని చెప్పారు. ఒబేసిటీ అతిపెద్ద సవాలుగా మారిందని అన్నారు. ఊబకాయ సమస్యను అధిగమించడానికి వంట నూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకోవాలని మరోసారి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. వంట నూనెల వినియోగం తగ్గించుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. నిత్యం వ్యాయామం చేయాలని, శరీరంలో అవసరానికి మించి ఉన్న కొవ్వు శాతాన్ని తగ్గించుకోవాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు తక్కువ ధరకే ఔషధాలు అందించడానికి దేశవ్యాప్తంగా 25 వేల జన ఔషధి కేంద్రాలు ప్రారంభించబోతున్నామని తెలియజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెడికల్ షాపుల్లో ఔషధాలు కొనుగోలు చేయడం వల్ల మధ్య తరగతి ప్రజలు, పేదలకు ఇప్పటికే రూ.30,000 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. ప్రధాని మోదీ శుక్రవారం కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీలో పర్యటించారు. సిల్వాస్సా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.2,587 కోట్ల విలువైన పలు అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.460 కోట్లతో నిర్మించిన 'నమో హాస్పిటల్'ను ప్రారంభించారు.

11 నుంచి మోదీ మారిషస్ పర్యటన

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 11వ తేదీ నుంచి మారిషస్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన రెండు రోజులపాటు కొనసాగుతుందని విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. మారిషస్ ప్రధానమంత్రి నవీన్ రామ్‌గూలం ఆహ్వానం మేరకు మారిషస్ జాతీయ దినోత్సవంలో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేసింది.



రూ. 32 లక్షల కోట్లలో ఎన్ని సున్నాలో లెక్కించలేరు

కాంగ్రెస్‌ను ఎద్దేవా చేసిన ప్రధాని మోదీ

సూరత్: చట్టసభల్లో సున్నా సీట్లు ఉన్న రాజకీయ పార్టీలు రూ.32 లక్షల కోట్లలో ఎన్ని సున్నాలు ఉంటాయో లెక్కించలేవని ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేశారు. 'ప్రధానమంత్రి ముద్రా యోజన' కింద పేదలకు ఇప్పటిదాకా రూ.32 లక్షల కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులకు లబ్ధి చేకూర్చడానికి ఆదాయపు పన్ను మినహాయింపును రూ.12 లక్షల వరకు పెంచామని అన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని సూరత్‌లో 'సంతృప్తస్థాయిలో ఆహార భద్రత' అనే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఇతర జిల్లాలకు సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన సోషల్ మీడియా ఖాతాలను శనివారం పూర్తిగా మహిళలకే అప్పగించబోతున్నానని ప్రధానమంత్రి స్పష్టంచేశారు.

కేంద్రం కుట్రలపై పోరాడుదాం

- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిద్దాం
- 22న జేఏసీ తొలి భేటీలో పాల్గొనండి
- ఏడు రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎంలకు స్టాలిన్ లేఖ

సాక్షి, చెన్నై: జనాభా ఆధారంగా చేపట్టే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పిలుపునిచ్చారు. ఏడు రాష్ట్రాలకు చెందిన ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రులకు శుక్రవారం లేఖ రాశారు. ఈ నెల 22వ తేదీన చెన్నైలో నిర్వహించనున్న జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రారంభ సమావేశంలో పాల్గొనాలని కోరారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరిగిన పక్షంలో తమిళనాడులో స్థానాల సంఖ్య 39 నుంచి 31కు తగ్గే ప్రమాదం ఉందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే పరిస్థితి మిగిలిన రాష్ట్రాల్లోనూ నెలకొనే ప్రమాదం ఉందని ఆయన చెబుతున్నారు. గత నెల 5వ తేదీన చెన్నైలో తమిళనాడులోని 50కి పైగా పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల ఎంపీలు, నేతలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జేఏసీలో భాగస్వామిగా చేరాలని పిలుపునిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు స్టాలిన్ లేఖ రాశారు. అలాగే ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలకు సైతం లేఖలు పంపించారు. జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతుండడం వెనుక పెద్ద కుట్ర ఉందని స్టాలిన్ ఆరోపించారు.

సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తాం

డూప్లికేట్ ఓటర్ ఐడీ నంబర్లపై ఈసీ

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డ్(ఎపిక్) సంఖ్యలు పునరావృతం కావడం వివాదాస్పదమైన నేపథ్యంలో ఎన్నికల కమిషన్(ఈసీ)మరోసారి స్పష్టత ఇచ్చింది. 2000వ సంవత్సరం నుంచి కొనసాగుతున్న ఈ వ్యవహారానికి వచ్చే మూడు నెలల్లో ముగింపు పలుకుతామని శుక్రవారం తెలిపింది. ఓటరు జాబితాలో పేరున్న వ్యక్తి ఎపిక్ సంఖ్యతో నిమిత్తం లేకుండా సంబంధిత పోలింగ్ కేంద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశముంటుందని, ఇతర పోలింగ్ బూత్‌లలో ఓటేసే అవకాశం ఆ వ్యక్తికి ఉండదని కూడా ఈసీ స్పష్టతనిచ్చింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వేర్వేరుగా ఓటరు జాబితాను తయారు చేస్తుండటం వల్లే ఇలా నంబర్లు పునరావృతమయ్యాయని వివరించింది. నమోదైన 99 కోట్లకు పైగా ఓటర్లతో భారత ఓటర్ల జాబితా ప్రపంచంలోనే అతిపెద్ద డేటాబేస్ అని ఒక ప్రకటనలో ఈసీ పేర్కొంది. రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సాంకేతిక నిపుణుల సాయంతో దశాబ్దాల నాటి ఈ అంశంపై మూడు నెలల్లో స్పష్టత తెస్తామంది. ప్రస్తుత ఓటర్లకు యూనిక్ నేషనల్ ఎపిక్ నంబర్‌ను కేటాయిస్తామని, కొత్తగా నమోదయ్యే వారికి సైతం ఈ విధానాన్ని వర్తింపజేస్తామని వివరించింది. దీనివల్ల నంబర్లు పునరావృతమయ్యే అవకాశం ఉండదని తెలిపింది.

సిరియాలో ఘర్షణలు.. 70 మంది మృతి

అసద్ అనుచరులు, పోలీసులకు మధ్య హింస

డమాస్కస్: సిరియా తీర ప్రాంతంలో గురువారం అల్లర్లు చెలరేగాయి. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ అనుచరులు దాడి చేయడంతో ఘర్షణ జరిగింది. 70 మందికి పైగా మరణించారు. గత డిసెంబరులో అసద్ గద్దె దిగాక సిరియాలో జరిగిన అత్యంత దారుణమైన హింస ఇదేనని అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎస్ఓహెచ్ఆర్) తెలిపింది. మృతుల్లో 35 మంది ప్రభుత్వ సిబ్బంది, 32 మంది అసద్ విధేయులు, నలుగురు పౌరులున్నట్టు పేర్కొంది. ఘర్షణలు చెలరేగిన ఓడరేవు నగరాలు హోమ్స్, టార్టోస్, లటాకియాల్లో కర్ఫ్యూ విధించారు. కొత్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'కోస్టల్ షీల్డ్ రెజిమెంట్' అనే ప్రతిఘటన బృందం ఏర్పడిందని అసద్ కాలపు కమాండర్ చెప్పారు. దాడి అనంతరం ఈ మేరకు వీడియో విడుదల చేశారు.

పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్

ప్రయోగించిన కాసేపటికే కూలిన వైనం • బహమాస్, ఫ్లోరిడాల్లో శకలాలు

టెక్సాస్: స్పేస్‌ఎక్స్ సంస్థకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ అతి పెద్ద రాకెట్ స్టార్‌షిప్ ప్రయోగ సమయంలోనే పేలింది. గురువారం రాత్రి అమెరికాలో టెక్సాస్‌లోని బొకాచికా నుంచి ప్రయోగించిన రాకెట్ కొద్ది నిమిషాలకే బహమాస్ ప్రాంతంలో కూలి పోయింది. దాని శకలాలు ఫ్లోరిడా, బహమాస్‌లో పడిపోయాయి. శకలాలు తారాజువ్వల్లా ఆకాశంలో దూసుకెళ్తుండటాన్ని పలువురు వీడియోల్లో బంధించారు. స్టార్‌షిప్ స్పేస్‌ఎక్స్ ఇప్పటిదాకా నిర్మించిన అతి పెద్ద, అత్యంత శక్తివంతమైన రాకెట్ ఇదే. మార్స్ మీద కాలనీ ఏర్పాటు చేయాలనుకుంటున్న మస్క్ లక్ష్యాలకు ఇది కీలకమైనది కూడా. గంట ప్రయాణం తర్వాత ఈ వ్యోమనౌక హిందూ మహాసముద్రం మీదుగా భూ కక్ష్యలోకి తిరిగి ప్రవేశించాల్సి ఉంది. రాకెట్‌ను విడిచి పెట్టడానికి సాయపడిన సూపర్ హెవీ బూస్టర్ విజయవంతంగా లాంచ్ ప్యాడ్‌కు తిరిగి వచ్చింది. కానీ రాకెట్ కూలిపోయింది. స్పేస్‌ఎక్స్‌కు ఇది ఎనిమిదో రాకెట్ టెస్టింగ్ మిషన్. కాగా వరుసగా రెండో వైఫల్యం. జనవరిలో ప్రయోగించిన స్టార్‌షిప్ కరీబియన్ దీవులపై పేలి పోయింది. ఆ శిథిలాలు టర్క్స్, కైకోస్ దీవులపై పడ్డాయి. దాంతో సమస్యల పరిష్కారానికి స్పేస్‌ఎక్స్ పలు మార్పులు చేసింది. ఆ పేలుడుపై దర్యాప్తు ముగియకముందే తాజా ప్రయోగాన్ని నిర్వహించింది. ఈ ప్రమాదం వల్ల మియామి, ఓర్లాండో సహా పలు విమానాశ్రయాల్లో చాలా సేపటిదాకా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.

అథెనా కథ ముగిసింది

కేప్ కనవెరాల్: ఇంట్యూటివ్ మెషీన్స్ రెండో మిషన్ కూడా ఫెయిలయ్యింది. చంద్రుడిపైకి పంపిన ల్యాండర్ అథెనా పనిచేయకుండా పోయింది. టెక్సాస్‌కు చెందిన ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థ స్పేస్ ఎక్స్ రాకెట్ ద్వారా ఫిబ్రవరి 26న అథెనాను పంపించింది. ఇందులో 11 పేలోడ్లు, సైంటిఫిక్ పరికరాలు ఉన్నాయి. చంద్రుని దక్షిణ ధ్రువానికి 160 కిలోమీటర్ల దూరంలోని నిర్దేశిత ప్రదేశంలో ఇది ల్యాండవ్వాల్సి ఉంది. కానీ, 250 మీటర్ల దూరంలో అతికష్టమ్మీద, అదీ ఇరుకైన గుంతలో దిగింది. తను దిగిన ప్రదేశాన్ని, పొజిషన్‌ను తెలపడంతోపాటు కొన్ని ప్రయోగాలకు సంబంధించిన పరికరాలను సైతం యాక్టివేట్ చేసినట్లు ఫొటోలను పంపించింది. వీటిని బట్టి చూస్తే ఇది ఇరుకైన గుంతలో పక్కకు ఒరిగి ఉన్నట్లు నాసా శాస్త్రవేత్తలు శుక్రవారం తేల్చారు. ల్యాండర్‌కు ఉన్న సౌర ఫలకాలున్న తీరు, గుంతలోని అతి శీతల పరిస్థితులను బట్టి చూస్తే, అథెనా బ్యాటరీలను రీఛార్జి చేయడం అసంభవమని గుర్తించారు. దీంతో, అథెనా పనిచేసే అవకాశాలు లేవని ప్రకటించారు. మిషన్ పూర్తయినట్లు ప్రకటించిన అధికారులు అది పంపించిన చిత్రాలను విశ్లేషించి పనిలో పడ్డారని ఇంట్యూటివ్ మెషీన్స్ తెలిపింది. అథెనా ఇంట్యూటివ్ రెండో మిషన్ కాగా, ఈ సంస్థ ఏడాది క్రితం పంపిన ఒడిస్సియస్ కూడా విఫలమైంది.

ట్రూడో కంటతడి

- ప్రధానిగా మీడియా సమావేశంలో భావోద్వేగం
- మరింత కఠిన పరిస్థితులుంటాయని హెచ్చరిక



ఒట్టావా: ప్రధాని హోదాలో చివరి మీడియా సమావేశంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కన్నీటి పర్యంతమయ్యారు. తొమ్మిదేళ్ల పదవీకాలాన్ని గుర్తు తెచ్చుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ''ప్రధానిగా ప్రతి రోజూ కెనడియన్లకే తొలి స్థానమిచ్చా. ప్రజలే నాకు వెన్నుముకగా నిలిచారు. మీకందరికీ కృతజ్ఞతలు. మీవల్లే ఇక్కడున్నా'' అన్నారు. కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన భారీ సుంకాలు, విలీన ప్రకటనల నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత కఠిన పరిస్థితులు తప్పవన్నారు. సంక్షోభ సమయంలో కెనడియన్లు ఐక్యంగా ఉండాలన్నారు. ''నా పదవీకాలంలో ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ట్రంప్ పాలన, కరోనా, ద్రవ్యోల్బణం, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో అసాధారణ క్లిష్ట పరిస్థితులు... ఇవి సంక్లిష్టమైన సమయాలే. వీటన్నింటి నడుమా ప్రధానిగా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాను. ఈ పోరాట పటిమను చివరి క్షణం వరకు కొనసాగిస్తా'' అన్నారు. ప్రజాదరణ పడిపోవడంతో జనవరిలో ట్రూడో రాజీనామా ప్రకటించడం తెలిసిందే. అధికార లిబరల్ పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకునే దాకా పదవిలో కొనసాగనున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 8 । మార్చి । 2025

వేసవి ప్రభావం

ఎండాకాలం ప్రభావంతో అడవులు పల్చబడ్డాయి. చామరాజనగర జిల్లాలో పచ్చదనం కరువైన నాగరహోళె అరణ్యం. చెట్లు మోడులయ్యాయి



న్యూస్‌రీల్



బెంగళూరు విజయనగరలో కూజాలు విక్రయిస్తున్న బాలిక

పంచ గ్యారెంటీలకు రూ.51,034 కోట్లు

శివాజీనగర: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలకు బడ్జెట్‌లో రూ.51,034 కోట్ల నిధులు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.52,000 కోట్లు కేటాయించగా ఈ పర్యాయం కోత వేశారు. శక్తి పథకానికి రూ.5,300 కోట్లు, గృహలక్ష్మి పథకానికి రూ. 28,608 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.10,100 కోట్లు కేటాయించారు. అన్న భాగ్య పథకం కింద 5 కేజీ. ఆహార ధాన్యానికి బదులుగా ఇస్తున్న సహాయ ధనం స్థానంలో 5 కేజీ. బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం రూ.6,500 కోట్లు కేటాయించారు. యువనిధి పథకం కింద 2.59 లక్షల మంది యువత పేర్లు నమోదు చేసుకోగా రూ.286 కోట్లు నగదు బదిలీ చేయనున్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వటానికి ఈ యువతకు ఇండస్ట్రీ లింకేజ్ సెల్ కింద నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తానికి గ్యారెంటీలకు నిధులను కోత పెట్టడం విమర్శలకు దారితీసింది.

భార్య వేధింపులు, వకీలు ఆత్మహత్య

యశవంతపుర: భార్య పెట్టే వేధింపులను తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబురగిలో జరిగింది. పట్టణంలోని మాణికేశ్వరి కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది బసవరాజ బిరాదార (47) మృతుడు. అతని సోదరుని ఫిర్యాదు మేరకు భార్య గీతాపై ఆర్‌జీ నగర పోలీసులు కేసు నమోదు చేశారు. అత్తమామలు ఇదే ఇంట్లో ఉండరాదని గీతా తరచూ గొడవపడేది. దీంతో విడాకుల కోసం ఇటీవల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయినప్పటికీ భార్య పెట్టే హింసను భరించలేక బసవరాజు ఉరి వేసుకున్నాడు.

వేశ్యావాటికపై దాడి

కలబురగి పట్టణంలోని వీరేంద్రపాటీల్ లేఔట్‌లో ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసి పోలీసులు దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసి, ఇద్దరు మహిళలను రక్షించారు.

బెంగళూరు వర్సిటీకి మన్మోహన్ పేరు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు సిటీ యూనివర్సిటీకి మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ పేరును నామకరణం చేస్తున్నట్లు సీఎం సిద్ధరామయ్య తెలిపారు. విధానసౌధలో బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయం తెలిపారు.

యాంటీ నక్సల్ పోలీసు దళం రద్దు

రాష్ట్రంలో నక్సలైట్లు పూర్తిగా అంతమయ్యారని, అందువల్ల యాంటీ నక్సలైటు పోలీసు దళాన్ని రద్దు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. మావోయిస్టుల పునర్వసతి కోసం రూ.10 కోట్లు కేటాయించామన్నారు. తమ ప్రభుత్వంలో ఆరుమంది నక్సల్స్ లొంగిపోయారని తెలిపారు. నక్సల్స్ పీడిత ప్రదేశాల్లో సదుపాయాల కల్పనకు రూ.19 కోట్లు కేటాయించామన్నారు.

సిద్ధరామయ్య పద్దు రూ. 4.09 లక్షల కోట్లు

- అభివృద్ధి, సంక్షేమ మంత్రం
- రూ. 19 వేల కోట్ల రెవెన్యూ లోటు



సీఎం సిద్ధరామయ్య బడ్జెట్ ప్రసంగం



సాక్షి, బెంగళూరు: అందరూ ఎదురుచూసిన రాష్ట్ర 2025–26 ఆర్థిక ఏడాది బడ్జెట్‌ను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. రూ. 4.09 లక్షల కోట్ల రికార్డు మొత్తంతో బడ్జెట్ తయారైంది. అభివృద్ధి కార్యక్రమాలకు, అన్ని వర్గాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. సీఎం బడ్జెట్‌ను తీసుకుని రాగానే అసెంబ్లీలో కోలాహలం నెలకొంది. ఎమ్మెల్యేలు, మంత్రులు స్వాగతం పలికి ఫోటోలు తీసుకున్నారు. సిద్ధరామయ్య అసెంబ్లీలో సుమారు గంటన్నరపాటు పద్దును చదివి వినిపించారు.

ఈ అంశాలకు పెద్దపీట

- బడ్జెట్‌లో రూ. 3,11,739 కోట్ల మేర రెవెన్యూ ఖర్చులు కాగా, రూ. 71,336 కోట్లు పెట్టుబడి ఖర్చులు, రూ. 26,474 కోట్లు రుణాల చెల్లింపులు ఉన్నాయి. రూ. 19,262 కోట్ల మేర ఆదాయ లోటు ఉన్నట్లు అంచనా వేశారు.
- సంక్షేమ కార్యక్రమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి అంశం, అభివృద్ధి ఆధారిత, నగరాభివృద్ధికి ప్రాధాన్యం, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, సుపరిపాలన అనే ఆరు ప్రముఖ అంశాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు.



అసెంబ్లీలో బడ్జెట్ ప్రతుల తరలింపు

- ఈ ఏడాది రాష్ట్ర ఆర్థికాభివృద్ధి దేశ ఆర్థికాభివృద్ధి రేటు కంటే అధికంగా ఉందన్నారు. దేశ జీడీపీలో కర్ణాటక 8.4 శాతం మేర భాగస్వామ్యం ఉందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి 6.4 శాతంగా ఉంటే కర్ణాటక ఆర్థికాభివృద్ధి 7.4 శాతంగా ఉందని చెప్పారు.

ఐటీ, బీటీ, టూరిజానికి కొత్త విధానం

ఉద్యోగాల కల్పనలో ఆసరాగా ఉన్న చిన్నతరహా పరిశ్రమలు, పర్యాటకం, ఐటీ బీటీ రంగాల కోసం కొత్త విధి విధానాలను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలోకి పెట్టుబడులు పెరుగుతాయని బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. సుపరిపాలనలో సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ విధానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

12 వేల బోరుబావులు

వ్యవసాయ భాగ్య పథకం కింద 12 వేల బోరు బావులను మంజూరు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లింగ్ విభాగాల కోసం రూ. 440 కోట్ల సహాయ ధనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విజయపుర జిల్లా ముద్దేబిహాలలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, బెళగావి జిల్లా అథణిలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మైసూరులో ఫిల్మ్ సిటీ

జర్నలిస్టుల పెన్షన్‌ను 12 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. మైసూరులో ప్రభుత్వమే రూ. 500 కోట్లతో ఫిల్మ్ సిటీ నిర్మాణం చేపట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలోని మల్టిప్లెక్స్, అన్ని థియేటర్లలో టికెట్ ధరలు ఒకేరీతిలో ఉండేలా, రూ. 200 కు మించకుండా ఉండేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరలు ఒకేలా ఉంటాయి.

విద్యాశాఖకు అధికం

- వ్యవసాయానికి స్వల్పం

బనశంకరి: 2025– 26వ బడ్జెట్ సైజు రూ.4,09,549 కోట్లు. గత ఏడాది బడ్జెట్ రూ.3,71,383 కోట్లుగా ఉండింది. ప్రతి ఏటా బడ్జెట్ పరిమాణం పెరుగుతూ వస్తోంది. యథా ప్రకారం విద్యాశాఖకు అధిక కేటాయింపులు జరిగాయి. రైతాంగాన్ని నిరుత్సాహపరుస్తూ తక్కువ కేటాయింపులు చేయడం గమనార్హం. రైతుల కోసం గణనీయమైన పథకాలను ఏవీ ప్రకటించలేదు.

వివిధ శాఖలకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

- విద్యా శాఖ రూ.45,286
- మహిళ, శిశు సంక్షేమ శాఖ రూ.34,955
- విద్యుత్ రూ.26,896
- గ్రామీణాభివృద్ధి శాఖ రూ.26,735
- నీరావరి నీటిపారుదల శాఖ రూ.22181
- నగరాభివృద్ధి, వసతి శాఖ రూ.21,405
- పరిపాలన, రవాణా శాఖ రూ.20,625
- ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రూ.17,473
- రెవెన్యూ శాఖ రూ.17,201
- సాంఘిక సంక్షేమ శాఖ రూ.16,955
- ప్రజాపనుల శాఖ రూ.11,841
- ఆహారశాఖ రూ.8,275
- వ్యవసాయ ఉద్యానవనశాఖ రూ.7,145
- పశు సంవర్ధక, మత్స్యశాఖ రూ.3,977
- ఇతరత్రా.. రూ.1,49,857

రూపాయి రాక -పోక

బనశంకరి: బడ్జెట్‌లో ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడ నుంచి వస్తుంది, ఏరంగానికి ఎంత ఖర్చు అనేది చూస్తే..

రూపాయి రాక

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం 52 పైసలు, రుణం కింద 27 పైసలు, కేంద్ర పన్నుల కింద 13 పైసలు, కేంద్ర ప్రభుత్వం సహాయ ధనం 4 పైసలు, పన్నేతర ఆదాయంతో 4 పైసలు సమకూరుతుంది.

రూపాయి వ్యయం

- రుణాల చెల్లింపులకు 18 పైసలు, ఇతర సామాన్య సేవలు 18 పైసలు, సాంఘిక సంక్షేమం 15 పైసలు, ఇతర ఆర్థిక సేవలు 14 పైసలు, వ్యవసాయం, నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి 14 పైసలు, విద్య 10 పైసలు, ఆరోగ్యం 5 పైసలు ఇతర సామాజికసేవలు 3 పైసలు, నీటి సరఫరా , పరిశుభ్రతకు 3 పైసలు ఖర్చవుతుంది.



రైతు వ్యతిరేక బడ్జెట్ ఇది

- యడియూరప్ప ధ్వజం

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌పై బీజేపీ నేత, మాజీ సీఎం యడియూరప్ప తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్ర అభివృద్ధికి వ్యతిరేకంగా ఉంది, కేవలం మైనారిటీలను మచ్చిక చేసుకోవడానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌గా అనిపిస్తోందని ఎక్స్‌లో ఆరోపించారు. ముస్లిం కాంట్రాక్టర్లకు మతం ఆధారంగా అవకాశాలు కల్పించడం రాజ్యాంగం ఆశయాలకు వ్యతిరేకమన్నారు. కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి ఇచ్చింది శూన్యమన్నారు. గత బడ్జెట్‌లో పేర్కొన్న పనులు, పథకాల అమలుపై మౌనం ఎందుకన్నారు. గ్యారంటీల పేరుతో అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. బెంగళూరు మీద దృష్టి పెట్టలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 2వేలమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతులకు మొండి చేయి చూపించారని ధ్వజమెత్తారు.

సిద్ధరామయ్య 16వ బడ్జెట్

శివాజీనగర: దేశంలో అత్యధికసార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రకటించిన ఆర్థికమంత్రి/ సీఎంలలో ఒకరుగా సిద్ధరామయ్య రికార్డు సృష్టించారు. తాజా బడ్జెట్ ఆయనకు 16వ పద్దు కావడం విశేషం. గుజరాత్ గత ఆర్థిక మంత్రి వజుభాయివాలా ఏకంగా 18 సార్లు బడ్జెట్లు ప్రవేశపెట్టి అరుదైన కీర్తిని పొందారు. మాజీ సీఎం రామకృష్ణ హెగ్డే 13 బడ్జెట్లు ప్రవేశపెట్టారు. 1994లో తొలిసారిగా జనతాదళ్ సర్కారులో ఆర్థిక మంత్రిగా ఉన్న సిద్ధరామయ్య తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

మరో బాలింత మృత్యుఒడికి

యశవంతపుర: ఉత్తర కర్ణాటకలో బాలింతల మరణాలు తగ్గడం లేదు. అప్పుడే పుట్టిన పసిబిడ్డలు శాశ్వతంగా అమ్మ ప్రేమకు దూరమవుతున్నారు. బెళగావిలోని బిమ్స్ ఆస్పత్రిలో బాలింత గురువారం రాత్రి చనిపోయింది. జిల్లాలోని గోకాక్ తాలూకా లగమేశ్వర గ్రామానికి చెందిన కీర్తి నేసరగి తుమ్మరగుడ్డి (23) మృతురాలు. మంగళవారం వైద్యులు సిజేరియన్ చేసి ప్రసవం చేశారు. అయితే కీర్తి తీవ్రమైన రక్తస్రావం జరిగి మరణించిందని వైద్యులు చెబుతున్నారు. రక్తస్రావం అవుతున్నా వైద్యులు సరైన చికిత్సలు అందించలేదని కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. బెళగావి ఎపిఎంసీ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో 4 కేజీల బంగారం సీజ్

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు 4 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుని వద్ద ఈ బంగారం పట్టుబడింది. ప్రయాణికుడు అంగీ లోపలి భాగంలో బంగారం దాచుకుని వెళ్తుండగా తనిఖీలలో దొరికిపోయాడు. ఈ బంగారం విలువ రూ.3.44 కోట్లుగా కస్టమ్స్ అధికారులు తెలిపారు. ప్రయాణికున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రన్య రావుకు కస్టడీ

సంచలనాత్మక బంగారం స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్య రావుకు బెంగళూరు కోర్టు మరో 3 రోజుల పాటు డీఆర్‌ఐ కస్టడీకి అనుమతించింది. సోమవారం రాత్రి ఆమె బెంగళూరు విమానాశ్రయంలో 14 కేజీలకు పైగా బంగారంతో దొరికిపోవడం తెలిసిందే. అప్పటినుంచి డీఆర్‌ఐ ప్రశ్నిస్తోంది. రన్యరావు దుబాయ్, మధ్య ఆసియా, యూరప్ దేశాలకు తరచూ ప్రయాణించేదని గుర్తించారు. ఎందుకు ఆ టూర్లు అనేది ఆరా తీస్తున్నారు. మరోవైపు విచారణలో ఉన్న ఆమె ఫోటో ఒకటి బయటకు వచ్చింది. ఆమె స్వల్పంగా గాయపడినట్లు అందులో ఉండడం కలకలం రేపుతోంది. గోల్డ్ స్మగ్లింగ్‌లో తనను ఇరికించారని చెప్పినట్లు తెలిసింది.



జీతాలు పెంచాలని బెంగళూరు స్వతంత్ర పార్కులో అంగన్‌వాడిల ధర్నా

సీఎం సతీమణికి ఉపశమనం



- ఈడీ సమన్లు రద్దు చేసిన హైకోర్టు
- ముడా ప్లాట్ల కేసులో మలుపు

బనశంకరి: మైసూరు నగరంలో అక్రమంగా ముడా స్థలాలను తీసుకున్నారనే కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి కి ఈడీ జారీచేసిన సమన్లను హైకోర్టు రద్దుచేసింది. దీంతో సిద్ధరామయ్య కుటుంబానికి పెద్ద ఊరట కలిగింది. విచారణకు రావాలన్న సమన్లను రద్దు చేయాలని పార్వతి, మంత్రి బైరతి సురేశ్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. శుక్రవారం విచారించిన హైకోర్టు న్యాయమూర్తి ఎం .నాగప్రసన్న.. ఈడీ సమన్లను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు. ముడా నుంచి తీసుకున్న 14 స్థలాలను 2024 అక్టోబరు 1న పార్వతి వెనక్కి ఇచ్చేశారని, కాబట్టి ఈడీ విచారణ పరిధిలోకి రారని, అక్రమంగా సంపాదిస్తే మాత్రమే ఈడీ తనిఖీ చేయవచ్చునని ఆమె తరపు న్యాయవాది వాదించారు. ఈ కేసుతో మంత్రి బైరతి సురేశ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తరపు వకీళ్లు వాదించారు.



సీఎం సిద్ధరామయ్య సతీమణి పార్వతి (ఫైల్)

బి రిపోర్టుపై కృష్ణ సవాల్

ముడా స్కాంలో సీఎం సిద్ధరామయ్య కుటుంబానికి క్లీన్‌చిట్ ఇస్తూ లోకాయుక్త సమర్పించిన దర్యాప్తు నివేదిక మీద ఫిర్యాదుదారు స్నేహమయికృష్ణ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో అభ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ముడా కేసుతో సంబంధం లేదని సీఎం దంపతులు, బావమరిది, మరో ముగ్గురికి లోకాయుక్త ఇటీవల క్లీన్‌చిట్ ఇవ్వడం తెలిసిందే. నేరారోపణలకు సరైన సాక్ష్యాలు లేవంటూ కోర్టులో బీ రిపోర్ట్‌ను సమర్పించింది. ఇప్పుడు కృష్ణ అభ్యంతరం చెబుతూ బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యే కోర్టులో 39 పేజీల అర్జీ వేశారు.

నీటికుంటలో మృత్యుఘోష



నీటి కుంటలో నుంచి మృతదేహాల వెలికితీత

- కరెంటు వైర్లు తగిలి ముగ్గురు యువ రైతుల మృతి
- మిస్టరీగా సంఘటన

చింతామణి: ఓ పొలంలోని నీటి కుంటలో ముగ్గురు యువ రైతులు ప్రాణాలు కోల్పోయారు. కరెంటు వైర్లు తగిలి వీరు మరణించారు. ఎలా జరిగిందనేది మిస్టరీగా ఉంది. ఈ దారుణం చింతామణి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ముంతకదిరేనహళ్లి గ్రామ శివార్లలో శుక్రవారం జరిగింది. మృతులు ముత్తకదిరేనహళ్లికి చెందిన లోకేష్ (32), రమేష్ (28) శ్రీకాంత్ (26). వివరాలు.. లోకేష్ ఇతరుల పొలాన్ని గుత్తకు తీసుకొని వ్యవసాయం చేసుకొనేవాడు. పంటల కోసం సంపు తవ్వుకుని నీటిని నింపాడు. పక్కన కరెంటు బాక్స్, మోటారు ఉన్నాయి. ఆ నీటిలోకి లోకేష్ దిగినప్పుడు వైర్లు తగలడంతో షాక్‌తో అక్కడే మరణించాడు.

అదే మాదిరిగా ఇద్దరు...

ఏం జరిగిందోనని పక్క తోటలో పని చేస్తున్న రమేష్, శ్రీకాంత్‌లు వచ్చి చూడగా వారికి కూడా షాక్ కొట్టి నీటి కుంటలో పడిపోయారు. సాయంత్రమైనా ఇళ్లకు రాకపోవడంతో వారి కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది కలిసి కుంటలో వెతకడంతో ముగ్గురి శవాలు బయటపడ్డాయి. కుటుంబ సభ్యులు రోదనలు ఆకాశానికంటాయి. డీఎస్పీ మురళీదర్, సీఐ శివకుమార తదితరులు పరిశీలించారు. జరిగిన ఘటనను చూసినవారెవరూ లేకపోవడంతో, ప్రమాదం జరిగిన తీరుపై అనేక సందేహాలు వస్తున్నాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



విలపిస్తున్న బంధువులు

బెంగళూరుకు నిధుల వరద

- ఏటా ఇచ్చే నిధులు రూ.7 వేల కోట్లకు పెంపు
- సొరంగ మార్గానికి రూ.19 వేల కోట్ల గ్యారంటీ
- మెట్రో రైలు విస్తరణ పథకాలు
- మరిన్ని ప్రాంతాలకు కావేరి జలాలు
- బడ్జెట్‌లో కేటాయింపులు



సొరంగ మార్గం మీద సర్కారు దృష్టి



బెంగళూరులో సిగ్నల్ రహిత రహదారుల అభివృద్ధి

బనశంకరి: సీఎం సిద్ధరామయ్య బడ్జెట్‌లో రాజధాని బెంగళూరు నగరానికి దండిగానే నిధులు కేటాయించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి గుండెకాయలాంటి బెంగళూరులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ప్రకటించారు. ప్రతి ఏటా నగరానికి అందించే రూ.3 వేల కోట్ల నిధులను ఈ ఏడాది రూ.7 వేల కోట్లకు పెంచారు. ఈ నిధులతో బీబీఎంపీ పరిధిలో అభివృద్ధి పనులు ప్రాధాన్యత ప్రకారం చేపట్టడానికి కొత్తగా ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు.

- బీబీఎంపీ కి రూ.40 వేల కోట్ల వ్యయంతో ఉత్తర-దక్షిణ, తూర్పు-పశ్చిమ సొరంగ మార్గం కారిడార్లను చేపట్టడానికి అనుకూలమయ్యేలా రూ.19 వేల కోట్ల గ్యారంటీని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.
- ట్రాఫిక్ రద్దీ నివారణ, సజావుగా రాకపోకల కోసం నగరంలోని ప్రధాన రోడ్లను సిగ్నల్ రహితం చేసేలా చర్యలు
- నమ్మమెట్రో మూడో దశ-3లో రూ.8,916 కోట్ల వ్యయంతో 40-50 కిలోమీటర్ల మేర మార్గాల నిర్మాణం. రానున్న రెండేళ్లలో మొత్తం 98.60 కిలోమీటర్లు అదనపు మార్గాలను నిర్మించడం లక్ష్యం. మెట్రోను దేవనహళ్లికి విస్తరణ.
- రాజకాలువల మిగులు స్థలాలను ఉపయోగించుకుని రూ.3 వేల కోట్ల వ్యయంతో 300 కిలోమీటర్లు అదనపు రోడ్లను అభివృద్ధి చేయడం
- నగరంలో 460 కిలోమీటర్ల ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లను రూ.660 కోట్ల వ్యయంతో అభివృద్ధి
- 120 కిలోమీటర్ల పొడవుతో ఫ్లై ఓవర్, గ్రేడ్ సెపరేటర్‌ల నిర్మాణం. బ్రాండ్ బెంగళూరు పథకాలకు రూ.1,800 కోట్లు. ఆరోగ్య బెంగళూరు కోసం రానున్న మూడేళ్లలో రూ.413 కోట్లతో పథకాలు
- వరద ముంపు తప్పించడానికి భూగర్భ డ్రైనేజీ, ఎస్‌టీపీలను నిర్మించడానికి బీబీఎంపీ, బీడబ్ల్యూఎస్ఎస్‌బీ కి రూ.3 వేల కోట్ల ఆర్థిక సాయం
- కావేరి 5 వ స్టేజ్ ద్వారా బెంగళూరు చుట్టుపక్కల 110 గ్రామాల్లో నివసించే 50 లక్షల నివాసులకు జలం అందించడం
- బ్రాండ్ బెంగళూరు -హసిరు బెంగళూరు కింద రూ.35 కోట్ల వ్యయంతో 14 చెరువుల ప్రగతి. రూ 234 కోట్లతో వర్తూరు, బెల్లందూరు చెరువులు పునరుజ్జీవనం.
- ఇక బెంగళూరులో ఆస్తిపన్ను వసూలులో నూతన చర్యల ద్వారా వసూళ్లు గణనీయంగా పెరిగాయి. ఆన్‌లైన్ ద్వారా ఈ-ఖాతా వ్యవస్థకు మంచి స్పందన వస్తోంది. 2024-25లో రూ.4,556 కోట్ల ఆస్తి పన్ను వసూలు. ఏడాదికి రూ.7500 కోట్ల ఆస్తి పన్నును రాబట్టాలని అంచనా వేస్తున్నట్లు సీఎం తెలిపారు.



నగరానికి మరిన్ని కావేరి జలాలు

క్లుప్తంగా

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి



అర్జీలు స్వీకరిస్తున్న లోకాయుక్త అధికారులు

చింతామణి: ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు లంచం అడిగితే తక్షణమే లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలని లోకాయుక్త డీఎస్పీ వీరేంద్రకుమార్ ప్రజలకు సూచించారు. పట్టణంలోని ప్రవాసిమందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఒక లోకాయుక్త కార్యాలయం ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు. అనంతరం తాలూకా కార్యాలయానికి సంబంధించి 18, తాలూకా పంచాయతీకి సంబంధించి 14, నగరసభకు సంబంధించి 41 అర్జీలను ప్రజలు లోకాయుక్త డీఎస్పీకి అందజేశారు.లోకాయుక్త ఎస్పీ ఆంటోని జాన్, తహసీల్దార్ సుదర్శన్ యాదవ,ఈఓ ఆనంద్ పాల్గొన్నారు.

మసిపూసి నిరసన

యశవంతపుర: కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి నుంచి సస్పెన్షన్‌కు గురైన సభ్యుడు నరసింహరాజు.. కన్నడపోరాటదారుడు వాటాల్ నాగరాజు, సారా గోవిందుపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. దీనికీ ప్రతిగా కర్ణాటక రక్షణ వేదిక అభిమానులు, కార్యకర్తలు నరసింహరాజుకు మసి పూసి ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ నెల 22న కర్ణాటక బంద్‌కు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయటానికి వాణిజ్య మండలి సభ్యులు బెంగళూరులోని హైగ్రౌండ్ పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. అక్కడ నరసింహరాజు మాట్లాడుతూ వాటాల్, సారా గోవిందుకు వేరే పని ఏమీ లేదు, ఇద్దరూ అవివేకులని విమర్శించారు. దీంతో కర్ణాటక రక్షణ వేదిక అభిమానులు శుక్రవారం ఫిల్మ్ చాంబర్ ఎదురుగా నరసింహరాజుకు మసి పూసి అవమానించారు.

మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ



డ్రైవింగ్ లైసెన్సు, ఎలక్ట్రిక్ ఆటోను అందజేస్తున్న మమతామదిరెడ్డి

బనశంకరి: ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు హెచ్ఎస్‌బీసీ ఇండియా, కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆటో రిక్షా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎలక్ట్రిక్ ఆటోలను హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ సర్వీస్ సెంటర్స్ చీఫ్ మమతామదిరెడ్డి, కవితాషా అందజేశారు. బెంగళూరు నగరంలో వాయు, శబ్ద కాలుష్యం నివారించి పర్యావరణాన్ని కాపాడటంతోపాటు మహిళలకు సరికొత్తగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఒక దేశం.. ఒకే ఎన్నికతో వనరులు ఆదా

శివాజీనగర: ఒక దేశం ఒకే ఎన్నిక అంశంపై విధానపరిషత్ ప్రతిపక్ష నాయకుడు చలవాది నారాయణస్వామి ఆధ్వర్యంలో విధానసౌధ కార్యాలయంలో శుక్రవారం చర్చాగోష్టి జరిగింది. ఎమ్మెల్సీ కే.ఎస్.నవీన్ మాట్లాడుతూ ఒక దేశం ఒక ఎన్నిక నేటి అనివార్యత అని తెలిపారు. అనవసర ఆర్థిక ఖర్చులను అరికట్టవచ్చన్నారు. విదేశాల్లో ఇలాంటి విధానం అమలులో ఉందన్నారు. కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో ఈ అంశంపై సదస్సులు జరపాల్సిన అవసరం ఉందన్నారు. విధానపరిషత్ సభ్యుడు, చీఫ్ విప్ ఎన్.రవికుమార్, సీనియర్ సభ్యుడు, మాజీ మంత్రి సీ.టీ.రవి, పార్టీ సభ్యులు, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

చెరువులో కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ మృతదేహం

మైసూరు : కారును ఢీకొట్టి అదృశ్యమైన కేఎస్ ఆర్టీసీ బస్ డ్రైవర్ చెరువులో శవమై తేలాడు. ఈఘటన తాలూకాలోని వరుణలో జరిగింది. వివరాలు.. మైసూరులోని సాతగళ్లి కేఎస్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేంద్ర విధుల్లో భాగంగా ఈనెల 1న మలెమహదేశ్వర కొండపైకి బస్సును తీసుకెళ్లాడు. తిరిగి వస్తుండగా జీ.ఎం.దొడ్డి బైరాపుర గేట వద్ద ఎదురుగా వచ్చిన కారును బస్సు ఢీకొంది. గాయపడిన కారు డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటినుంచి రాజేంద్ర అదృశ్యం అయ్యాడు.

శుక్రవారం వరుణ చెరువులో వ్యక్తి మృతదేహం కనిపించగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా మృతుడిని రాజేంద్రగా గుర్తించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

అశ్లీల ఫోటోల అప్‌లోడ్‌పై ఫిర్యాదు

హుబ్లీ: సోషల్ మీడియాలో అశ్లీల ఫోటోలను అప్‌లోడ్ చేసిన ఆరోపణలపై ఓ వ్యక్తికి వ్యతిరేకంగా కేసు దాఖలైంది. పాత హుబ్లీకి చెందిన మహమ్మద్ సాదిక్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

ఉత్తర కర్ణాటకకు నిరాశాదాయక బడ్జెట్

- ఒక్క భారీ పరిశ్రమనూ ప్రకటించలేదు
- కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

హుబ్లీ: పేదల పెన్నిధి, సమాజ్‌వాది నేతగా ఈసారి రికార్డు స్థాయిలో 16వ సారి రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను ప్రతిపాదించిన సీఎం సిద్ధరామయ్య బడ్జెట్‌పై ఉత్తర కర్ణాటక ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకోగా, ఈసారి నిరాశాదాయక బడ్జెట్ సమర్పించారని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎస్ఎఫ్ సంశిమఠ తెలిపారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర కర్ణాటకకు ఒక్క ఫ్యాక్టరీ, భారీ పరిశ్రమను కూడా ప్రకటించలేదన్నారు. ఈ బడ్జెట్ కేవలం బెంగళూరు, మైసూరు, తుమకూరులకు మాత్రమే పరిమితమైందన్నారు. ఉత్తర కర్ణాటకకు ఏమీ ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

బెంగళూరుకు మాత్రమే పరిమితమైంది

కార్యదర్శి రవీంద్ర బళిగార మాట్లాడుతూ రూ.4 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినా కేవలం బెంగళూరుకు మాత్రమే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో



బడ్జెట్‌పై మాట్లాడుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

రెండో అతి పెద్ద జంట నగరాలైనా హుబ్లీ– ధార్వాడ ప్రజలను అసలు పట్టించుకోలేదని అసంతృప్తిని వెళ్లగక్కారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా పరిశ్రమల పరికరాల ఫ్యాక్టరీ, ఐటీబీటీ క్లస్టర్, పర్యాటక శాఖలకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరామన్నారు. అలాగే హుబ్లీ, ధార్వాడ ప్రత్యేక పాలికెలకు విడివిడిగా నిధులు కేటాయిస్తారని ఆశించామన్నారు. అయితే అలా ఇవ్వలేదన్నారు. కనీసం ప్రభుత్వ ఉద్యోగుల పన్నులు కూడా పెంచలేదన్నారు. మొత్తానికి ఈ బడ్జెట్ ఉత్తర కర్ణాటకకు నిరాశదాయక బడ్జెట్ అన్నారు.

మిగులు బడ్జెట్ ప్రతిపాదన హర్షణీయం

సంయుక్త కార్యదర్శి మహేంద్రసింగి మాట్లాడుతూ సిద్దూ గ్యారెంటీ పథకాలను కొనసాగిస్తూ మిగులు బడ్జెట్ ప్రతిపాదించడం హర్షనీయమన్నారు. ముస్లింలతో పాటు జైనులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు, మైనార్టీలకు రిజర్వేషన్లకు బదులుగా కేవలం ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్లను కేటాయించారన్నారు. ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ చెన్నవీర ముంగరవాడి మాట్లాడుతూ సిద్దరామయ్య అన్ని వర్గాల మేలు కోసం కృషి చేశారన్నారు. చాలినంత నిధులను ఉచిత పథకాలకు కేటాయించారన్నారు. మిగిలిన వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రయత్నించారన్నారు. సాధారణంగా చూస్తే ఇది మంచి బడ్జెట్. అయితే హుబ్లీ, ధార్వాడ విషయానికి వస్తే, ఉత్తర కర్ణాటకు కూడా ఏ కొత్త కార్యక్రమాన్ని ప్రకటించకపోవడంతో అభివృద్ధి ఆనవాలు లేకుండా చేయడం ఉత్తర కర్ణాటకకు బడ్జెట్‌లో నిరాశను కలిగించిందన్నారు.

సాధనతో రైతు బిడ్డ ఉన్నత శిఖరాలు

- ప్రిన్సిపాల్‌గా, పరిశోధకురాలిగా రాణిస్తున్న డాక్టర్ శైలజ
- ఉత్తమ సేవలకు వరించిన అవార్డులు



కర్ణాటక రాజ్య మహిళా రత్న అవార్డుతో డాక్టర్ శైలజను సత్కరిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన మహిళ ఎంతో పట్టుదలతో ఉన్నత విద్యాభ్యాసం చేసి వేలాది మందికి విద్యాబోధన చేసి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. బోధకురాలిగా, రచయితగా, పరిశోధకురాలిగా, ఉపన్యాసకురాలిగా రాణిస్తూ అనేక అవార్డులు అందుకున్నారు. తుమకూరు జిల్లా అమృతగిరి గ్రామంలో మల్బరీ సాగు చేసే రైతు బసవరాజు, పద్మా దంపతుల రెండవ కుమార్తెగా జన్మించిన శైలజ.. కన్నడ భాషలో ఎం.ఎ, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పిహెచ్‌డీ, బీఎడ్, డిప్లొమొ ఇన్ ఎపిగ్రఫీ కోర్సులు చేశారు. ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల తుమకూరు, బెంగళూరు వాసవీ ఇంటర్నేషనల్ కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో కదళి మహిళా వేదిక అధ్యక్షురాలిగా, కేంద్ర కన్నడ సాహిత్య వేదిక జిల్లా కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. చిత్రదుర్గం మరుఘామఠం నుంచి శిక్షక శ్రీ (ఉత్తమ ఉపాధ్యాయురాలు) ప్రశస్తి, సింధి మహావిద్యాలయం నుంచి దిబెస్ట్ టీచర్ అవార్డు, మైసూరు దుర్గా ఫౌండేషన్ నుంచి కర్ణాటక మహిళా రత్న అవార్డు అందుకున్నారు. సాదర సముదాయంపై పీహెచ్‌డీ చేశారు. హంపీ విశ్వవిద్యాలయం నుంచి 2016లో డాక్టరేట్ అందుకున్నారు. గౌరిబిదనూరులోని స్టెల్లా కాన్వెంటు పాఠశాల అధ్యక్షులు సప్తగిరిని వివాహం చేసుకొని జీవితంలో స్థిరపడ్డారు.

ఘరానా దొంగ అరెస్టు

- రూ.11.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

హొసపేటె: చోరీ కేసులో నిందితుని బంధించి అతని వద్ద ఉన్న రూ.11.25 లక్షల విలువైన ఆభరణాలను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతనెల 25న నగరంలోని జాలేరా వీధిలోని ఓ ఇంటిలో సుమారు రూ.11.25 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాల చోరీ జరిగినట్లు తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని చోరీకి పాల్పడ్డ నిందితున్ని పట్టుకొనేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టారన్నారు. దొంగతనానికి పాల్పడ్డ నిందితుడు నగర శివార్లలో జంబునాథ రహదారి ఏరియాలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పకడ్బందీగా నిందితుడిని పట్టుకొన్నట్లు తెలిపారు. హుబ్లీకి చెందిన మహమ్మద్ అలీ నాలబంది ఈ చోరీకి పాల్పడినట్లు ఆయన తెలిపారు. అదనపు జిల్లా ఎస్పీ సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.



జప్తు చేసిన ఆభరణాలు, సెల్‌ఫోన్లతో పోలీసులు

కోల్పోయిన మొబైళ్ల అప్పగింత

రూ.20.74 లక్షల విలువైన సుమారు 123 మొబైళ్లను గుర్తించి జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వారసులకు అప్పగించారు. హొసపేటె సబ్ డివిజన్ పరిధిలో మొబైల్ ఫోన్ల చోరీకి గురైన వారు పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై మొబైల్ ఫోన్లను గుర్తించేందుకు ఎస్పీ శ్రీహరిబాబు మార్గదర్శకత్వంలో అడిషనల్ ఎస్పీ సలీంపాషా సలహా సూచనల మేరకు డీఎస్పీ డాక్టర్ టి.మంజునాథ్ ఆధ్వర్యంలో వివిధ పోలీస్ స్టేషన్లలో మొబైళ్ల చోరీలపై కేసు నమోదు చేశారు.

జనాభాకు అనుగుణంగా ఉద్యోగాలు భర్తీ చేయాలి

చిక్కబళ్లాపురం: రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెంచాలని ప్రభుత్వ నౌకర్ల సంఘం రాష్ట్రాధ్యక్షుడు సీఎస్ షడక్షరి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పాలకమండలి కార్యాలయంలో శుక్రవారం జరిగిన నూతన పదాధికారులతో ప్రమాణ స్వీకారం చేయించి సన్మానం అందుకొని మాట్లాడారు. ఉద్యోగులు సంఘటితమైతే కేంద్రం తరహాలో వేతనాలు పొందవచ్చన్నారు. రాష్ట్రంలో 6.5 కోట్ల జనాభా ఉండగా 5.12 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. ఈ సంఖ్య పెరగాలని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ. కోటి పరిహారం అందిస్తామన్నారు. కలెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిగౌడ, ఏడీసీ భాస్కర్, శివరుద్రయ్య బసవరాజ్, డీహెచ్ఓ మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మైసూరు: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర జిల్లా మసగాపుర గ్రామంలో జరిగింది. గ్రామ నివాసికీర్తి కుమార్(37) కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏ కారణం చేతనలో తన ఇంటి వెనుక చెట్టుకు శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజలు ఆశించింది కొండంత..దక్కింది గోరంత

- బడ్జెట్‌లో కోలారు జిల్లాకు దక్కని లబ్ధి ప్రజల ఆశలు అడియాశలు
- పీపీపీ ఆధారిత మెడికల్ కళాశాలతో కొంత ఊరట

కోలారు : సీఎం సిద్దరామయ్య శుక్రవారం విధాన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కోలారుకు పెద్దగా ప్రయోజనం దక్కలేదు. ఆశించింది కొండంత అయితే దక్కింది గోరంత మాత్రమే అని ప్రజలు చర్చించుకుంటున్నారు. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కలిగిన జిల్లాకు బడ్జెట్‌లో సింహ పాలు దొరుకుతుందదని అందరు భావించారు. ముఖ్యంగా ఏపీఎంసీ మార్కెట్ యార్డుకు స్థలం కేటాయింపు, మామిడి, టమాట మార్కెట్ల సంస్కరణ యూనిట్ ఏర్పాటు, కోలారు నగరసభ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్, గౌనిపల్లి, నంగలి గ్రామ పంచాయతీలను పట్టణ పంచాయతీలుగా అప్‌గ్రేడ్, కోలారులో రింగ్ రోడ్డు నిర్మాణం, ముళబాగిలు, శ్రీనివాసపురంలో పరిశ్రమల ఏర్పాటుకు స్థలం, ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు, కేసీ వ్యాలీ నీటిని మూడు దశలలో శుద్ధీకరణ, ఎత్తిన హొళె పథకం ద్వారా జిల్లాకు తాగునీరు అందించడం వంటి డిమాండ్లకు బడ్జెట్‌లో చోటు లభించలేదు. ఈ జిల్లాకు సీఎం అధిక ప్రాదాన్యత నిస్తారని ఆశించిన ప్రజల ఆశలు అడియాశల య్యాయి. బడ్జెట్ సమావేశాలకు ముందే సీఎం రాజకీయ కార్యదర్శి నజీర్ అహ్మద్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొత్తూరు మంజునాథ్, కేవై నంజేగౌడ, రూపా శశిధర్, ఎస్ఎన్ నారాయణస్వామి , ఎమ్మెల్సీ ఎం ఎల్ అనిల్ కుమార్‌లు జిల్లా ప్రజల డిమాండ్లను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. అయితే పీపీపీ ఆధారిత మెడికల్ కళాశాల, మాలూరు తాలూకా శివారు పట్టణంలో బహువలయ సుస్థిరత పారిశ్రామిక హబ్, కెజీఎఫ్‌లో ఆధునిక వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు వంటి వాటికి మాత్రమే బడ్జెట్‌లో చోటు దక్కింది.

మౌలిక వసతుల కల్పనకు వినతి

హొసపేటె: కొట్టూరు పట్టణంలోని కొన్ని వార్డుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆల్ ఇండియా దళిత హక్కుల ఉద్యమ సంస్థ(ఏఐడీఆర్ఎం) విజయనగర జిల్లా అధ్యక్షుడు కే.కొట్రేష్ పేర్కొన్నారు. పట్టణ పంచాయతీ కార్యాలయంలో చీఫ్ ఎ.నసరుల్లాకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బీ.ఆర్.అంబేడ్కర్ కాలనీలో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, జే.పీ.నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల్లోని వార్డుల్లో మౌలిక వసతులు లేవన్నారు. ఇళ్ల పైకప్పు లేని వారికి పైకప్పులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు నిర్ణీత గ్రాంట్‌ను మంజూరు చేయాలన్నారు. గతంలో అందజేసిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మరికొన్ని రోజుల్లో పట్టణ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరవధిక నిరసన చేపడుతామని హెచ్చరించారు. వినతిపత్రం స్వీకరించిన ప్రధాన కార్యవర్గ మండలి సమావేశంలో తమ డిమాండ్లను అందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాలూకా యూనిట్ అధ్యక్షుడు తెగ్గినకేరి కొట్రేష్, సీపీఎం రాష్ట్ర మహిళా సమాఖ్య కార్యదర్శి కే.రేణుకమ్మ, ఏఐడీఆర్ఎం సభ్యులు ఎస్.ప్రకాష్, ఐ.గోపీనాథ్, జీ.కార్తీక్, మణికంఠ, అరుణ్, సాగర్, గోపీనాథ్, కే.నాగరాజ్, అరుణ్, ఝులన్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

రేపు ధార్వాడలో భారీ ఉద్యోగ మేళా

హుబ్లీ: ప్రభుత్వ సూచనల మేరకు ఆదివారం ధార్వాడ కేసీడీ ఆవరణలో కౌసల్య రోజ్‌గార్ ఉద్యోగ మేళాను ఏర్పాటు చేశారు. ఈవిషయంలో వివిధ సన్నాహాలను జిల్లాధికారిణి దివ్యప్రభు శుక్రవారం స్వయంగా ఆ ఆవరణకు వెళ్లి పరిశీలించారు. కాగా గత నెల 25 నుంచి నిరుద్యోగుల నుంచి నమోదు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైంది. ఈనెల 7 వరకు కొనసాగింది. అంతేగాక ఆదివారం రోజు కూడా నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొనే అవకాశం ఉందన్నారు. 65 పరిశ్రమలు, 25 మానవ వనరుల సంస్థల ప్రతినిధులు ఈ మేళాలో తమకు కావాల్సిన ఉద్యోగార్థులను నియామకం చేసుకొంటారు. ఇందుకు సంబంధించి వచ్చే వారందరికీ అన్ని ఏర్పాట్లను కేసీడీ పర్యాటక విభాగం, డాక్టర్ గోకాక్ గ్రంథాలయ భవనంలో ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు చేశారు. వంద మంది స్వచ్ఛంద కార్యకర్తలను నియమించారు. తాగునీరు, మరుగుదొడ్లు, వెయిటింగ్ రూంలను ఏర్పాటు చేశారు. ప్రక్రియ అంతా క్రమశిక్షణతో జరిగేలా అసిస్టెంట్ కమిషనర్‌ను నోడల్ అధికారిగా నియమించారు. జెడ్పీ సీఈఓ భువనేష్ పాటిల్ మాట్లాడుతూ మేళాలో సంస్థ సమాచారం తెలియజేస్తూ మైకుల ద్వారా ఆ రోజున ప్రచారం చేస్తామన్నారు. పోలీసు కమిషనర్ శశికుమార్ మేళాకు అవసరమైన భద్రత చర్యలు తీసుకొన్నారు.

రౌడీషీటర్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు శివు

యశవంతపుర: కలబురగిలో ఈనెల 4న జరిగిన రౌడీషీటర్ విరేశ్ సారథి హత్య కేసులో ప్రధాన నిందితుడు శివానంద అలియాస్ శివు కుంబారను కలబురగి ఉపనగర పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. రౌడీషీటర్ విరేశ్ సారథి, శివు ఆరోజు రాత్రి మద్యం తాగారు. ఆర్థిక లావాదేవీల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఓ దశలో విరేశ్‌పై శివు ఇనుప రాడ్లతో బాదాడు. దీంతో వీరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రూ.50 వేలు ఇవ్వాలని వేధించటంతో హత్య చేసినట్లు శివు వెల్లడించాడని పోలీసులు త తెలిపారు.

పాసింగ్ ఔట్ పెరేడ్

సాక్షి బెంగళూరు: 62 వారాల శిక్షణ ముగించుకున్న వైమానిక దళ సాంకేతిక అధికారుల పాసింగ్ ఔట్ పెరేడ్ శుక్రవారం జరిగింది. బెంగళూరు ఎయిర్ ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో నిర్వహించిన పెరేడ్‌లో 104వ ఏరోనాటికల్ ఇంజనీర్స్ కోర్సు పూర్తి చేసిన మొత్తం 47 మంది ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఎయిర్ కమాండర్ చీఫ్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయిర్ డెవిల్స్ బృందం ద్వారా పలు విన్యాసాలు, సాహసకృత్యాలు అబ్బురపరిచాయి. పలువురు అధికారులకును సత్కరించారు.

కోలారు వార్తలు...

చైతన్యంతోనే ఎస్సీ, ఎస్టీ సముదాయాల అభివృద్ధి



జాగృతిజాతా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు : ఎస్సీ, ఎస్టీ సముదాయం చైతన్యవంతులైనప్పుడే అభివృద్ధి సాధ్య పడుతుందని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివకుమార్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అమలు చేసే పథకాలు, దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు అమలులో ఉన్న చట్టాలు, దళితుల అభ్యున్నతికి అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించేందుకు సిరి జానపద కళాబృందం ఆధ్వర్యంలో తాలూకాలోని దిన్నహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జాగృతి జాతాను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ శాఖ వసతి పాఠశాలలో ఉచిత ప్రవేశం, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, ఎస్ఎస్‌పి ద్వారా విద్యార్థి వేతనం, ఉన్నత విద్యాభ్యాసానికి ధన సహాయం, అంబేడ్కర్, వాల్మీకి భవనాల నిర్మాణాలు, దౌర్జన్యానికి గురైన వ్యక్తులకు సహాయ ధనం ఇవ్వడం తదితర సౌలభ్యాల గురించి వివరంగా తెలియజేశారు. జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసన్, ఈఓ కృష్ణప్ప, సిఐ సునీల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఆర్.రవి

కోలారు : మహిళలు, బాలలకు కోలారు జిల్లా సురక్షితం అనే నమ్మకం ప్రజల్లో ఏర్పడేలా అధికారులు శ్రమించాలని కలెక్టర్ ఎం.ఆర్.రవి సూచించారు. బాల్య వివాహాల నివారణకు కలెక్టర్ కార్యాలయ సభాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశం, స్త్రీ శిశు సంక్షేమ పథకాల అమలుపై జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 85 బాల్య వివాహ కేసులు నమోదయ్యాయన్నారు. 72 వివాహాలను అరికట్టి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నామన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ పంచాయతీ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాల గురించి సమాచారం అందించిన వారికి ప్రభుత్వం నుంచి రూ. 25 వేల పారితోషికం అందిస్తామన్నారు. జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్.హొసమని, జెడ్పీ సీఈఓ డాక్టర్ ప్రవీణ్ పి.బాగవాడి, అదనపు ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.

5కే రన్‌ను విజయవంతం చేయండి

కెజీఎఫ్ : మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా రాష్ట్ర పోలీస్ శాఖ సువర్ణ మహోత్సవం సందర్భంగా ఈ నెల 9న కేజీఎఫ్ నగరంలో నిర్వహించే 5 కే రన్‌ను విజయవంతం చేయాలని కేజీఎఫ్ ఎస్పీ కేఎం శాంతారం విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 6 గంటలకు రాబర్ట్‌సన్ పేట నగరసభ మైదానం నుంచి పరుగు ప్రారంభమై సూరజ్‌ముల్ సర్కిల్, డాక్టర్ అంబేడ్కర్ రహదారి, ఉరిగాం, డబ్ల్యూ టీ బ్లాక్, చాంపియన్స్ రీఫ్, హైగ్రౌండ్స్, కల్లరై మూలె, డాక్టన్ పల్దానా సర్కిల్‌కు చేరుకొని తిరిగి నగర సభ మైదానినికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు క్యూ ఆర్ కోడ్ ఉపయోగించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ



కారును సోదా చేస్తున్న పోలీసులు

కేజీఎఫ్ : నేరస్తులపై నిఘా పెట్టి దోపిడీలు తదితర నేరాలను అరికట్టడం కోసం పోలీసులు నగరంతో పాటు తాలూకాలోని వివిధ ప్రాంతాలలో తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా నగరంలోని మెయిన్ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. కేజీఎఫ్ పోలీస్ జిల్లాలో 9 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు రెండు లేదా మూడు రోజుల కోమారు స్థలాన్ని మార్చడం జరుగుతుందని తెలిపారు.

9న మహిళా సమావేశం



మాట్లాడుతున్న ఇందిరారెడ్డి

కోలారు : కోలారు నగరంలోని స్కౌట్స్ భవనంలో ఈ నెల 9వతేదీన కేఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇందిరా రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మంది మహిళా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సాధకులు, మహిళా క్రీడాకారులను సన్మానిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి పుష్ప, వివిధ విభాగాల పదాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతరోత్సవం



దేవుళ్లను ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: పావగడ తాలూకా సమీప సరిహద్దులోని బెస్తరపల్లిలో వెలసిన కర్ణాటక కాడు గొల్లల ఆరాధ్య దైవాలైన క్యాతలింగేశ్వర, బొమ్మలింగేశ్వర, చిత్రలింగేశ్వర, ఈరణ్ణ స్వామి, కాటమలింగేశ్వర, యల్లమ్మ దేవి, మారమ్మ దేవతల దొడ్డ (పెద్ద) జాతరోత్సవం ఘనంగా జరిగింది. 95 సంవత్సరాల అనంతరం నిర్వహించిన ఈ మహోత్సవంలో తుమకూరు, బళ్లారి, చిత్రదుర్గం, అనంతపురం ప్రాంతాల నుంచి సుమారు 80 దేవుళ్లను ఊరేగింపుగా బెస్తరపల్లి గ్రామానికి తరలించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక వనకల్లు మల్లేశ్వర మఠం పీఠాధ్యక్షుడు బసవ రమానంద మహా స్వామి మాట్లాడుతూ... బుడకట్టు సంప్రదాయంలో మరదైవ (వృక్ష దైవం), కల్లుదైవ (రాతి దైవం), పంచలోహ దైవాలకు పూజలు చేస్తామన్నారు. అన్ని సామాజిక వర్గాల వారు దేవుళ్లను పూజిస్తారన్నారు.

ఘనంగా విమాన గోపుర ప్రతిష్ఠాపన



కోదండరామస్వామి మూలవిరాట్‌కు అలంకరణ

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో జీర్ణోద్ధరణ పూర్తి చేసుకున్న కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రఘునాథ ఆచార్యుల నేతృత్వంలో విమాన గోపుర ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. తర్వాత శ్రీరామచంద్ర ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ ప్రముఖ వీధులలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

చకచకా తేరు నిర్మాణం



హోసూరు: హోసూరు తేరుపేటలో వెలసిన చారిత్రక ప్రసిద్ధ మరకతాంభ సమేత శ్రీ చంద్ర చూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవానికి తేరునిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆలయ కమిటీ, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ సంయుక్తంగా నిర్వహించడం ఆనవాయితీ. మార్చి 14వ వైభవంగా తేరు వేడుకలు జరగబోతున్నాయి. తేరుపేటలోని చిన్న తేరు, పెద్ద తేరు నిర్మాణం సాగుతోంది.

క్లుప్తంగా

ఒత్తిడి లేని జీవితం గడపాలి



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: వృద్ధాప్యంలో ఒత్తిడిలేని ప్రశాంత జీవనానికి అవకాశాలు కల్పించుకోవడం చాలా ముఖ్యమని తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దస్తగిరిసాబ్ సూచించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘానికి చేయూత ఇస్తున్న దాతలను గురువారం ఘనంగా సన్మానించారు. దస్తగిరి సాబ్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ప్రశాంతంగా జీవించేందుకు కొత్తకొత్త అభిరుచుల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. గోపాలకృష్ణ, తిమ్మయ్య, గంగాధరయ్య, శ్రీనివాసరావ్, చిక్కనారాయణప్ప ,సుబ్బారెడ్డి, వెంకటాచలయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో జీపీ సభ్యుడి మృతి

యశవంతపుర: గుండెపోటుతో గ్రామ పంచాయతీ సభ్యుడు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లాలో చోటు చేసుకొంది. ఉళ్లాల కత్తారు మదనినగరకు చెందిన మున్నూరు గ్రామ పంచాయతీ సభ్యుడు అబ్దుల్ అజీజ్ ఆర్‌కేసి(42) పనిపై ఢిల్లీ వెళ్లారు. రైలులో తిరుగు ప్రయాణంలో ఉన్న ఆయనకు ఉత్తరకన్నడ అంకోలా సమీపంలో ఛాతిలో నొప్పి వచ్చింది. కుమటా రైల్వేస్టేషన్‌లో రైలు నిలిపి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

నవధాన్యాలతో అలంకరణ



మారెమ్మదేవి మూలవిరాట్

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరం బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో కొలువైన గ్రామ దేవత మారెమ్మదేవికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వినయ్‌కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం నవధాన్యాలు, పూలతో అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రూ.23 లక్షల సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు, వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

తుమకూరు: తుమకూరు జిల్లాలో 11 చోరీ కేసులను ఛేదించిన పోలీసులు 10 మందికి పైగా దొంగలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 17,65,000 విలువైన బంగారు నగలు సహా మొత్తం రూ. 23,01,000 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ అశోక కే.వి. శుక్రవారం వివరాలు వెల్లడించారు. అమృతూరు, పట్టనాయనకనహళ్లి, జయనగర, శిరా నగర, తురువెకెర పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

బాలల హక్కుల రక్షణలో పోలీసుల సేవలు భేష్



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామి

తుమకూరు: బాలల హక్కుల రక్షణకు పోలీసులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. తుమకూరులోని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన తుమకూరు జిల్లా బాలల రక్షణ పోలీసు విభాగం ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో మరింత ప్రగతి సాధించాలని సూచించారు. బాలల న్యాయ చట్టం సెక్షన్ 107 ప్రకారం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో బాలల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రాధికార ఏర్పాటుపై హర్షం

గౌరిబిదనూరు: తాలూకాలో హోసూరు గ్రామంలో వున్న ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు హెచ్ నరసింహయ్య సైన్స్‌సెంటర్, హెచ్ఎన్ కళాభవనం, విదురాశ్వత్థంలోని స్వతంత్ర సమర యోదుల స్థూపం, వీరసౌధ తదితరాలను కలిపి హెచ్ఎన్ ప్రాధికార ఏర్పాటుకు సీఎం అంగీకరించారు. గతంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం,పాఠశాల అభివృద్ధి సమితి, గ్రామ ప్రజల తరపున మాజీ జడ్పీ అధ్యక్షుడు హోసూరు మంజునాథ్, పూర్వ విద్యార్థులు డా శశిధర్, వెంకటేశ్ తదితరులు సీఎం సిద్దరామయ్యకు వినతి పత్రమిచ్చారు. వినతి పత్రానికి స్పందించిన ముఖ్యమంత్రి బడ్జెట్‌లో ప్రాధికార ఏర్పాటుకు అవకాశం కల్పించినందుకు గ్రామ ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

వెడ్డింగ్ షూట్‌కు చలో హొన్నావర



హొన్నావర తీరంతో వెడ్డింగ్ షూట్‌లో ఏర్పాటు చేసిన లవ్ సింబల్స్



వెడ్డింగ్ షూట్ దృశ్యం



శరావతి ప్రకృతి అందాల మధ్య బోటుపై జంట వెడ్డింగ్ షూట్

- అప్సరస కొండ, మ్యాంగ్రోవాక్ బీచ్‌ల్లో పెళ్లిళ్లు
- సీజన్‌లో కనీసం 5 వేలకు పైగా ఫొటోషూట్‌లు
- శరావతి పోటు జలాల్లో 700 అలంకరణ బోట్లు
- గంటకు ఫీజు రూ.1000–రూ.1500 మాత్రమే

బనశంకరి: నేటి ఆధునిక యుగంలో వెడ్డింగ్ ఫొటో షూటింగ్స్ హవా అధికంగా ఉంది. వివాహానికి ముందు కాబోయే వధూవరులు ప్రేమికుల తరహాలో ఫొటోషూట్ చేయడంలో యువత ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఇలాంటి వారికి ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర వెడ్డింగ్ షూట్ హాట్‌స్పాట్‌గా మారింది. అప్సరస కొండ బీచ్, మ్యాంగ్రోవాక్, శరావతి పోటు జలాల్లో వెడ్డింగ్ షూట్‌లకు ప్రేమికులతో సందడిగా నిలుస్తుంది. అప్సరస కొండ తీర ప్రాంతానికి వెళ్లి చూస్తే మిరుమిట్లు గొలిపే చెట్లు, ఎద్దులబండి, చక్రాలు, ల్యాంబ్రెటా, హృదయాకార వెదురు ఆకృతులు, మంటపాలు అక్కడక్కడ చేతులు పట్టుకుని ప్రేమికులు ఫొటోలకు ఫోజులిచ్చే ఆకృతులు, శరావతి పోటు జలాల్లో సుమారు 700 అలంకరణ బోట్లు, కొబ్బరిచెట్లు, దట్టంగా పెరిగిన మ్యాంగ్రో అడవుల మధ్య బోటింగ్‌లో ఫొటో షూట్‌లు జరుగుతున్నాయి. ఇక్కడ పర్యాటక రంగంతో పాటు ఫొటో షూట్ బిజినెస్ అధికమైంది.

ఒక రోజులో 88 జంటల ఫొటోషూట్ రికార్డ్


అప్సరస కొండ తీరంలో ఒక రోజుకు 88 జంటలు వెడ్డింగ్ ఫొటో షూట్ చేయడంతో రికార్డు సృష్టించారు. శరావతి పోటు జలాల్లో ఒకరోజులో వందకు పైగా జంటల ఫొటో షూట్ జరుగుతుంది. ఈ రెండు స్థలాల్లో పెళ్లిళ్ల సీజన్‌లో 5 వేలకు పైగా ఫొటో షూట్స్ జరుగుతుండటం విశేషం. కేవలం కర్ణాటక మాత్రమే కాదు కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి వెడ్డింగ్ ఫొటోషూట్‌కు ఇక్కడకు విచ్చేస్తారు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో కూడా బీచ్‌లు ఉన్నాయి. కానీ అక్కడ నుంచి హొన్నావరకు రావడం ఇక్కడ ఇది సరికొత్త ప్రదేశం. మూడు నాలుగేళ్ల నుంచి హొన్నావర వైపు యువత తరలి వస్తున్నారు. అప్సరస కొండ బీచ్‌లో ఫొటోషూట్ చేసేవారికి సెట్టింగ్ రెడీ చేయడంలో స్థానికులు నిమగ్నమౌతారు. ఇష్టమైన సెట్టింగ్‌ను తక్షణం రూపొందించడంలో స్థానికులు నైపుణ్యం కలిగి ఉన్నారు. శరావతి పోటు జలాల్లో బోట్లకు డిమాండ్‌కు అనుగుణంగా అలంకరిస్తారు. ప్రతి గంటకు రూ.1000–రూ.1500 ఫీజు తీసుకుంటారు. దీంతో స్థానికులకు సహాయంతో పాటు పరోక్షంగా ఉద్యోగ కల్పన లభిస్తోంది.



కొబ్బరి చెట్ల మధ్య ప్రవహిస్తున్న హొన్నావర నది



తీర ప్రాంతంలో సూర్యోదయం దృశ్యం



హొన్నావర వంతెన నయన మనోహర దృశ్యం

లైంగిక వేధింపు కేసులో మూడేళ్ల జైలు శిక్ష

మైసూరు: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకొని లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ చామరాజనగర ఆదనపు జిల్లా న్యాయాలయం, పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. చామరాజనగర జిల్లా కొళ్లెగాల తాలూకా చిక్కమాలాపుర గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(22) ఓ బాలిక వెంట పడి ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు. పెళ్లి చేసుకుంటానని మభ్య పెట్టి మరో ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తప్పించుకొని కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. దీంతో వారు కొళ్లెగాల పోలీసలకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడు మనోజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించారు. ఈకేసు శుక్రవారం విచారణకు వచ్చింది. నిందితుడి నేరం నిరూపితం కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎస్.జె.కృష్ణ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ. 15 వేలుచెల్లించాలని ఆదేశించారు.

విధానసౌధ ఎదుట జేడీఎస్, బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు

దొడ్డబళ్లాపురం: సీఎం సిద్ధరామయ్య శుక్రవారం శాసనసభలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు విధానసౌధ ముందు ధర్నా చేపట్టారు. తమ నియోజకవర్గాలకు అ. దికార పార్టీ నిధులు ఇవ్వడం లేదని, ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని ధర్నా నేతృత్వం వహించిన ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ ఆరోపించారు. తమ నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు.

అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు బీఎంటీసీ కండక్టర్లు

యశవంతపుర: ఖతార్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు జరగనున్న అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు బస్సు కండక్టర్లు ఎంపికైనట్లు బీఎంటీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంపికైన క్రీడాకారులు వినయకుమార్, వైడీ శశిధర్‌ను రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, సంస్థ ఎండీ రామచంద్రన్‌లు అభినందించారు.

బడ్జెట్‌పై అశోక్ అవగాహన పెంచుకోవాలి

బనశంకరి: విపక్షనేత ఆర్.అశోక్ బడ్జెట్ నిర్వహణపై సరైన అవగాహన చేసుకోవాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. 16వ పర్యాయం రికార్డు స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అప్పులు అధికమైనట్లు విపక్షనేత ఆర్.అశోక్ చేసిన వ్యాఖ్యలపై సిద్దరామయ్య మాట్లాడుతూ ఈ సారి రూ.4,09,549 బడ్జెట్ ప్రవేశపెట్టామని గత ఏడాది కంటే ఈసారి బడ్జెట్ పరిమాణం పెరిగిందన్నారు. ఈసారి 2,92,476 కోట్లు రాజ్య స్వరూపం కాగా రాజస్వ రూపం రూ.3,11,738 కోట్లు అయిందన్నారు. అప్పులు పెరిగాయని విపక్షనేతలు పేర్కొనడం సరికాదన్నారు. ఫిజికల్ రెస్పాన్సిబిలిటి మేనేజ్‌మెంట్ యాక్ట్ ప్రకారం 24.91 శాతం ప్రమాణంలో రుణం చేశామని తెలిపారు. ఆర్.అశోక్ కు ఇదంతా తెలియదా అని సీఎం ప్రశ్నించారు ఆర్థికశాఖ, బడ్జెట్ నిర్వహణ గురించి చదువుకొని అనంతరం మాట్లాడాలన్నారు.

'ఇది జనరంజక బడ్జెట్ కాదు'

దొడ్డబళ్లాపురం: సీఎం సిద్ధరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాకుండా ముస్లింల రుణం తీర్చుకోవడానికి ప్రవేశపెట్టినట్లు ఉందని ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీల కాలనీల అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు కేటాయించారన్నారు. మైనార్టీల విదేశీ పర్యటనలకు ఇచ్చే మొత్తాన్ని రూ.20 లక్షల నుంచి రూ. 30 లక్షలకు పెంచారన్నారు. బెంగళూరులో ఏ రోడ్డు చూసినా గుంతలమయం అయ్యిందని, అయినా బెంగళూరు అభివృద్ధికి తగినంత నిధులు కేటాయించలేదన్నారు. సాగునీటి పథకాలకు కూడా నిధులు కేటాయించలేదన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధతో ఓ వ్యక్తి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన హుణసూరు చోటు చేసుకుంది. హుణసూరు తాలూకా కిరిజాజి గ్రామానికి చెందిన గిరీష్(54) తన కుటుంబ అవసరాల కోసం ఎస్‌బీఐ బ్యాంకులో రూ.3 లక్షల మేర అప్పులు చేశాడు. ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ. 10 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు దారి కనిపించక మనో వేదనకు గురై హుణసూరు సమీపంలోని లక్ష్మణ తీర్థ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు గిరీష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

'బడ్జెట్ కొందరికి తీపి.. అనేక మందికి చేదు'

దొడ్డబళ్లాపురం: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేంద్రమంత్రి కుమారస్వామి రెండు వాక్యాల్లో తన అభిప్రాయం తెలిపారు. కొంతమందికి తీపి.. అనేక మందికి చేదు అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మైనారిటీలకు తీపి పంచి అధిక సంఖ్యలో ఉన్న మిగతా వారికి చేదు పంచారానే అర్థం వచ్చేలా ఆయన పేర్కొన్నారు.

మాజీ మంత్రి ఆనందసింగ్‌కు భారీ ఊరట

- ఖనిజం తరలింపు కేసు కొట్టివేత

యశవంతపుర: మాజీమంత్రి ఆనందసింగ్‌కు భారీ ఊరట లభించింది. ఇనుప ఖనిజం అక్రమ తరలింపునకు సంబంధించి ఆయనపై నమోదైన కేసును కోర్టు కొట్టివేసింది. బళ్లారి వ్యాసనకెరె నుంచి 16,876 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించినట్లు అనందసింగ్, ప్రస్తుత గోవా మంత్రి రోషన్ కొంటిగులపై 2015లో కేసు నమోదైంది. దీనిపై బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో విచారణ జరుగుతోంది. సీపీసీ నివేదిక ఆధారంగా విచారించాలని సుప్రీంకోర్టు అదేశాలు జారీ చేసింది. ఇదే కేసును లోకాయుక్త విచారించి కోర్టుకు చార్జిషీట్‌ను దాఖాలు చేయగా వారిద్దరిపై నమోదైన కేసును కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన భట్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆనందసింగ్‌కు పెద్ద రిలీఫ్ దక్కింది.

ఎమ్మెల్యే మునిరత్నకు చుక్కెదురు

దొడ్డబళ్లాపురం: బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు హైకోర్టులో చుక్కెదురైంది. బీబీఎంపీ కాంట్రాక్టర్ చెలువరాజును బెదిరించి కులం పేరుతో దూషించిన వ్యవహారంలో నమోదైన కేసును కొట్టివేయాలని మునిరత్న పెట్టుకున్న పిటిషన్‌ను విచారించిన కోర్టు.. ఆ కేసు కొట్టేయడానికి వీలుకాదని తేల్చిచెప్పింది. గత ఏడాది సెప్టెంబర్ 24న బాధితుడు చెలువరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మునిరత్నను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై ఉన్నారు. ఇదే కేసులో మునిరత్న పీఏ విజయ్‌కుమార్, సెక్యూరిటీ గార్డ్ అభిషేక్‌లను కూడా అరెస్టు చేశారు.

బడ్జెట్ నిరాశాజనకం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

దొడ్డబళ్లాపురం: సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర అన్నారు. ఈమేరకు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. కేవలం ముస్లింలను ప్రసన్నం చేసుకోవడానికి, ఎన్నికల్లో గెలిపించినందుకు వారి రుణం తీర్చుకోవడానికి మాత్రమే బడ్జెట్‌ను వాడుకున్నట్లు ఉందన్నారు. వ్యవసాయ రంగానికి చేయూత లేదన్నారు. ఇది పూర్తిగా రైతు వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. ఓబీసీ వర్గాలను పూర్తిగా విస్మరించారన్నారు.

నలుగురు యువకుల దుర్మరణం



మృతి చెందిన యువకులు (ఫైల్), ప్రమాదానికి గురైన బైక్‌లు

- వేగంగా ఢీకొన్న రెండు బైక్‌లు
- కలబురగి జిల్లా సేడం వద్ద ఘోరం

యశవంతపుర: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘోర ప్రమాదం కలబురగి జిల్లా సేడం తాలూకాలో తెల్లూరు–హాబాళ రోడ్డు మార్గంలో శుక్రవారం ఉదయం జరిగింది. తాలూకా హాబాళ (టి) గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మల్లికార్జున రేవణ్ణ సిద్ధప్ప (20), కిషన్ గుడిసి (25) అక్కడికక్కడే చనిపోయారు. ప్రకాశ తిప్పణ్ణ (19), సురేశ్ పుండరెడ్డి (20)లకు తీవ్రంగా గాయాలు కావటంతో స్థానికులు సేడం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమంగా ఉండటంతో కలబురగి జిల్లా ఆస్పత్రికి తరలించగా గంటసేపట్లోనే మృత్యువాత పడ్డారు.

వేగంగా వస్తూ ఢీ

మృతులందరూ ఒకే గ్రామానికి చెందినవారు. ఒక్కో బైక్‌పై ఇద్దరు యువకులు అత్యంత వేగంగా ప్రయాణిస్తూ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. ప్రమాదంలో బైకులు రెండు నుజ్జునుజ్జయ్యాయి. బైకు చక్రాలు, విడిభాగాలు దూరంగా ఎగిరి పడ్డాయి. దుర్ఘటన తీవ్రతను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సేడం పోలీసులు ఘటన స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. నలుగురు యువకుల మృతదేహాలకు సేడం, కలబురగి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులు, బంధుమిత్రుల రోదనలకు అంతు లేదు. కుటుంబాలకు ఆసరాగా ఉంటారనుకున్న కొడుకులు అకాల మృత్యువుకు గురికావడంతో తల్లిదండ్రులు శోకతప్తులయ్యారు. కాగా రీల్స్ చేయబోయి ప్రమాదం బారిన పడ్డారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

హోసూరు వార్తలు..

అగ్గిపెట్టెల లారీ దగ్ధం



హోసూరు: తూత్తుకుడి నుంచి హరియానా రాష్ట్రానికి అగ్గిపెట్టెలు తరలిస్తున్న లారీ క్రిష్ణగిరి సమీపంలో బోల్తాపడి నిప్పంటుకుంది. రూ.15 లక్షల విలువైన అగ్గిపెట్టెలు ఆహుతైనట్లు లారీ డ్రైవర్ తెలిపారు. బర్గూరు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

సంతకాల సేకరణ

కెలమంగలం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిభాషా సూత్రానికి మద్దతు తెలుపుతూ బీజేపీ నేతలు శుక్రవారం కెలమంగలం పట్టణ పంచాయతీలో సంతకాల సేకరణను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు వి. నారాయణన్, ఎం.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. త్రిభాషా సూత్రం వల్ల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని, మైనార్టీ భాషల అభివృద్ధికి ప్రజలు మద్దతు తెలియజేయాలని కోరారు.

గుడిసె బూడిద

హోసూరు: హోసూరు సమీపంలో సిలిండర్ పేలడంతో గుడిసె బూడిదైంది. వివరాల మేరకు బేరికె సమీపంలోని కరియసంద్రం గ్రామానికి చెందిన వ్యాపారి రంజిత్‌కుమార్(30) కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నాడు, దీంతో పక్కనే గుడిసె ఏర్పాటు చేసుకొని నివాసముంటున్నాడు. గురువారం సాయంత్రం గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ అకస్మాత్తుగా పేలడంతో మంటలు వ్యాపించాయి. గుడిసె, అందులో ఉన్న రూ. 35 వేల నగదు, ఇతర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు విలపించాడు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

త్వరలో పాల ధర పెంపు

శివాజీనగర: బడ్జెట్ సమావేశాల అనంతరం నందిని పాల విక్రయ ధర పెంచుతామని కేఎంఎఫ్ అధ్యక్షుడు భీమా నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెంచిన ధరకు సంబంధించిన మొత్తాన్ని పాడి రైతుల సంక్షేమానికి ఖర్చు చేస్తామని తెలిపారు. సమావేశాల మధ్యలో, లేదా సమావేశాలు ముగిసిన తరువాత ధర పెంచుతామన్నారు.

ప్రాణాలు తీసిన అక్రమ సంబంధం

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి సమీపంలో డ్రైవర్ హత్య కేసులో మహిళను, మరొకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు క్రిష్ణగిర తాలూకా మహారాజగడ సమీపంలోని పెరియతక్కేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ కార్తీక్ (30), వడ్డీ వ్యాపారంతో పాటు, మేకలను పోషిస్తున్నాడు. ఇతనికి భార్య ప్రియ, ఇద్దరు పిల్లలున్నారు. కార్తీక్ ప్రతి రోజూ రాత్రి బోదినాయకనపల్లి వద్దనున్న మేకల కొట్టానికి కాపలా వెళ్లేవాడు. 1వ తేదీ రాత్రి కాపలా వెళ్లిన అతడు మరుసటి రోజు కాలిన స్థితిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకొన్న మహారాజగడ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపగా క్రిష్ణగిరి సమీపంలోని పళయూరు గ్రామానికి చెందిన భువనేశ్వరి (22)తో ఆతనికి వివాహేతర సంబంధం ఉండేదని తెలిసింది. అయితే భువనేశ్వరి ధర్మపురి జిల్లాకు చెందిన దినేష్‌కుమార్ (25)ను ప్రేమించడంతో గొడవలు వచ్చాయి. భువనేశ్వరి, దినేష్‌కుమార్‌లు కలిసి కార్తీక్‌ను హత్య చేసి పెట్రోలు పోసి అంటించారని పోలీసులు తెలిపారు. వారిద్దరినీ అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

మృతుల కుటుంబాలకు సాయం పంపిణీ



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని కాళహస్తీపురం పంచాయతీ ఎలువపల్లి గ్రామంలో గత 5వ తేదీ నీటి కుంటలో పడి మృతి చెందిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మూడవ తరగతి బాలుని కుటుంబాలకు శుక్రవారం హోసూరు సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యేలు సంతాపం తెలియజేసి ఆర్థిక సాయం అందజేశారు. బాలుడు నందీష్‌కుమార్ (8) నీటికుంటలో పడిపోగా కాపాడబోయి హెచ్ఎం గౌరీశంకర్ (53) కూడా నీటమునిగి ఇద్దరూ చనిపోవడం తెలిసిందే. ప్రభుత్వం తలా రూ. 3 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయగా, సబ్ కలెక్టర్ ప్రియాంక, ఎమ్మెల్యే వై. ప్రకాష్‌లు వారి కుటుంబాలను కలిసి సహాయం అందజేశారు.

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చుతాం

- మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

శివాజీనగర: అంగన్ వాడీ కార్యకర్తల డిమాండ్‌లను నెరవేర్చటం తమ ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం ఆమె మాట్లాడారు. వ్యక్తిగతంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎప్పటికీ అండగా ఉంటామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల గౌరవ వేతనాన్ని బడ్జెట్‌లో పెంచినట్లు తెలిపారు. ముస్ముందు మళ్లీ గౌరవ వేతనాన్ని పెంచే అవకాశముందన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినాచరణ సమయంలో గ్ర్యాచుటీ పంపిణీ చేస్తామన్నారు. 17వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక తరగతులను ఆరంభించాలనే యోచన ఉందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, కార్యాధ్యక్షురాలు శాంతా ఎస్.ఘంటి, ప్రధాన కార్యదర్శి హెచ్.ఎస్.సునందా, కోశాధికారి కమలా తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభించిన అమిత్‌షా

దొడ్డబళ్లాపురం: బెంగళూరులోని శ్రీకృష్ణ సేవాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో మారతహళ్లిలో నిర్మించిన శ్రీ విశ్వేశతీర్థ మెమోరియల్ ఆస్పత్రిని శుక్రవారం కేంద్రమంత్రి అమిత్‌షా ఉద్ఘాటించారు. మాజీ సీఎం యడియూరప్ప, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఎమ్మెల్యే బీవై విజయేంద్ర, తదితరులు హాజరయ్యారు.



ఉద్ఘాటనా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్‌షా

చలో అసెంబ్లీ

శుక్రవారం విధానసౌధ ముందు పాఠశాల బాలల రద్దీ. అసెంబ్లీ సమావేశాలను చూడాలని నిత్యం పలు జిల్లాల నుంచి విద్యార్థులు వస్తున్నారు



మా వీలునుబట్టి 'సూపర్ సిక్స్' ఇస్తాం

- రాష్ట్రానికి వచ్చే ఆదాయం జీతాలకే సరిపోతుంది
- బడ్జెట్‌పై శాసన మండలిలో ఆర్థిక మంత్రి కేశవ్

సాక్షి, అమరావతి: తమ వీలునుబట్టి 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. బడ్జెట్‌పై శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చలో మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం జీతాలు చెల్లించేందుకే సరిపోతుందని ఆయన చెప్పారు. మిగిలిన పథకాలు అమలు చేయాలంటే అప్పులు చేయక తప్పదన్నారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రానికి అప్పు పుట్టే పరిస్థితి లేదన్నారు. ఆదాయానికి మించి అప్పులు కడుతున్నామని తెలిపారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.52 వేల కోట్లు ఉంటే తాము చెల్లించాల్సిన అప్పులు, వడ్డీలు కలిపి రూ.65 వేల కోట్లు ఉన్నాయన్నారు. స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెంచడం ద్వారా ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి పెరిగి ఎక్కువ అప్పులు వస్తాయని, అలా తెచ్చిన అప్పులను పెట్టుబడులుగా పెట్టి సంపద సృష్టికి బాటలు వేస్తామని చెప్పారు. ప్రస్తుతం డబ్బుల్లేక శాసన సభ్యుల ప్రతిపాదనలను కూడా తిప్పి పంపుతున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం ఇసుక, మద్యం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని పక్కదారి పట్టించిందని విమర్శించారు. తమ హయాంలో మద్యం తగ్గగా.. ఆదాయం పెరిగిందని చెప్పారు. బలమైన కూటమిని చూసి ప్రతిపక్షాలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసిందని, వాటిని చర్చల ద్వారా తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సాస్కి పథకంలో 50 ఏళ్ల తర్వాత అసలు చెల్లించేలా ఆర్థిక సాయం చేస్తోందని, దానిపై ఏకంగా రూ.7,200 కోట్లు తెచ్చామని చెప్పారు. రూ.9,407 కోట్లతో 73 లక్షల మంది చిన్నారులకు తల్లికి వందనం అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన దానికంటే అధికంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయింపులు చేశామని చెప్పారు. అంతకు ముందు అధికారపక్ష సభ్యుల తీరుతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఆ తర్వాత ప్రతిపక్షం లేకుండానే మంత్రి సమాధానమివ్వడం గమనార్హం.

అప్పులపై కూటమి పార్టీలది వ్యవస్థీకృత నేరం

- అప్పులపై చంద్రబాబు, పవన్, పురందేశ్వరి దుర్మార్గంగా మాట్లాడారు
- టీడీపీ కూటమి పాలనలోనే నిజమైన ఆర్థిక విధ్వంసం
- 9 నెలల్లో అప్పులు రూ.1.40 లక్షల కోట్లు
- మాజీమంత్రి సాకె శైలజానాథ్ మండిపాటు



సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పులపై టీడీపీ కూటమి పార్టీలు చేసిన తప్పుడు ప్రచారం పూర్తిగా ఓ వ్యవస్థీకృత నేరమని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత సాకె శైలజానాథ్ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ ఇప్పటివరకు నానాయాగీ చేసిన వారి బండారం శుక్రవారం అసెంబ్లీ సాక్షిగా బట్టబయలైందన్నారు. ఎన్నికలకు ముందు అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన ఈ పార్టీలు అధికారంలోకి వచ్చాక కూడా వాటినే కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం శైలజానాథ్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరుగుతోంది.. ఏపీ అప్పుల కుప్పగా మిగిలిపోతోంది.. శ్రీలంకలా దివాళా తీస్తోందంటూ విష ప్రచారం చేశారు. ఏపీ ఆర్థిక పరిస్థితిపై దుర్మార్గంగా మాట్లాడారు. చంద్రబాబు అయితే.. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు అప్పుచేసిందని ఒకసారి.. రూ.12.8 లక్షల కోట్లని మరోసారి.. కాదు కాదు.. రూ.14 లక్షల కోట్లని నోటికొచ్చినట్లు మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక కూడా టీడీపీ కూటమి పార్టీలు అవే అబద్ధాలు కొనసాగిస్తున్నాయి. చివరికి గవర్నర్‌తో కూడా అసత్యాలు వల్లెవేయించాయి. అనుకూల మీడియాలో కూడా ఇష్టమొచ్చినట్లు రాయించారు. కానీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, అమర్‌నాథ్‌రెడ్డి, విశ్వేశ్వరరాజులు శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా అప్పులపై పంపిన ప్రశ్నకు ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానంలో అసలు వాస్తవాలు వెలుగుచూశాయి. దీంతో ఇప్పటివరకు అప్పుల పేరుతో టీడీపీ కూటమి పార్టీల కుట్రలు బట్టబయలయ్యాయి. ఇక అసెంబ్లీలో ప్రభుత్వం వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అంటే మార్చి 2024 వరకు ప్రభుత్వ అప్పులు రూ.4,91,734.11 కోట్లు. అలాగే, ప్రభుత్వ గ్యారెంటీ అప్పులు రూ.1,54,797.11 కోట్లు. అంటే.. మొత్తం రూ.6,46,531 కోట్ల అప్పులు ఉన్నాయని అధికారికంగా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అంటే.. రూ.14 లక్షల కోట్ల అప్పులంటూ ఇప్పటివరకు చేసిన యాగీ అంతా పచ్చి అబద్ధాలేనని తేలిపోయింది.

రూ.1.40లక్షల కోట్ల అప్పు ఏం చేశారు?

ఇదిలా ఉంటే.. జగన్ అప్పులు తీసుకొచ్చి వివిధ సంక్షేమ పథకాల కోసం డీబీటీ ద్వారా ప్రజలకు రూ.2,73,756 కోట్లు పంపిణీ చేశారు. కానీ, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ తొమ్మిది నెలల్లోనే రూ.1.40 లక్షల కోట్లు అప్పులు చేసింది. ఈ సొమ్మంతా ఏమైంది? ఎవరికి ఖర్చు చేశారు? ఎంతమంది లబ్ధిదారులకు ఇచ్చారో సమాధానం చెప్పాలి. ఇది కాదా ఆర్థిక విధ్వంసం అంటే? నిజానికి.. 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న అప్పులు రూ.3,06,951 కోట్లు. అంటే.. వైఎస్సార్‌సీపీ దిగిపోయే నాటికి ఉన్న అప్పుల నుంచి ఈ అప్పులను తీసేస్తే నికరంగా ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన అప్పు కేవలం రూ.3,39,580 కోట్లు మాత్రమే.

22,776 ఖాళీలకుగాను 16,347 పోస్టుల భర్తీ

- ఈ నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్ : మంత్రి లోకేశ్ వెల్లడి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 22,776 ఉపాధ్యాయ ఖాళీలకుగాను 16,347 పోస్టుల భర్తీకి ఈ నెలలో నోటిఫికేషన్ ఇస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో శుక్రవారం ఆయన పలు అంశాలపై లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. టెట్ పరీక్ష నిర్వహణ అనంతరం వన్‌మెన్ కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియ కొంత ఆలస్యమైందన్నారు. నోటిఫికేషన్ జారీకి ముందే న్యాయ పరమైన చిక్కులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించామని చెప్పారు. సీనియారిటీ లిస్టులో తప్పులు ఉంటే డీఈవో వద్ద వాటిని సరిచేసుకునే వెసులుబాటును ఉపాధ్యాయులకు కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో ఎప్పుడైనా టీచర్ల బదిలీలు పూర్తి పారదర్శకంగా చేపట్టేలా వచ్చే మంత్రివర్గ సమావేశానికి టీచర్స్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకురాబోతున్నామని తెలిపారు. సీబీఎస్‌ఈ మోడల్ పరీక్ష విధానాన్ని మూడేళ్లపాటు వాయిదా వేసి.. ఉపాధ్యాయులను, పిల్లలను సంసిద్ధులను చేశాకే ఆ ప్రక్రియకు వెళదామని అధికారులకు సూచించామన్నారు. రాష్ట్రంలో అన్ని కేటగిరీలు కలిపి 22,776 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయన్నారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదన లేదు

శాసన మండలిలో మంత్రి అనగాని



సాక్షి, అమరావతి : జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రతిపాదన, పరిశీలనలో లేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లె మూడు రెవెన్యూ డివిజన్లను సవరించి అద్దంకి డివిజన్, అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను రెవెన్యూ డివిజన్లుగా మార్పునకు ఆయా జిల్లా కలెక్టర్ల నుంచి నివేదికలు అందాయన్నారు. ఎమ్మిగనూరు, ఉదయగిరి కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మార్చాలని స్థానిక ఎమ్మెల్యే నుంచి డిమాండ్ ఉందన్నారు. శాసన మండలిలో శుక్రవారం జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు బదులిచ్చారు.

- అప్పులపై కట్టుకథలు..

అసెంబ్లీలో బట్టబయలు

జగన్‌పై పచ్చమీడియా చల్లిందంతా బురదే • రూ.14 లక్షల కోట్లు.. రూ.10 లక్షల కోట్ల అప్పులంటూ తప్పుడు ప్రచారం

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పులపై ఎన్నికల ముందు పచ్చి అబద్ధాలే చెప్పామని అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వం శుక్రవారం అంగీకరించింది. ఒకసారి రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారని, మరోసారి రూ.10 లక్షల కోట్లంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిందంటూ అసెంబ్లీలో, బయట నిస్సిగ్గుగా అవాస్తవాలు చెబుతున్నారు. అయితే శుక్రవారం అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ సభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మత్స్యరాస విశ్వేశ్వర రాజు రాష్ట్ర అప్పులపై అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లిఖిత పూర్వకంగా సమాధానం చెబుతూ 2023–24 మార్చి నాటికి బడ్జెట్ అప్పులు, గ్యారెంటీ అప్పులు కలిపి మొత్తం రూ.6.46 లక్షల కోట్లు మాత్రమేనని వెల్లడించారు. ఇదే అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానం చెబుతూ సీఎం చంద్రబాబు రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారంటూ అబద్ధాలు చెప్పారు. ఇప్పుడు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. రాష్ట్ర అప్పులు 2023–24 మార్చి నాటికి బడ్జెట్‌లో రూ.4.91 లక్షల కోట్లు, గ్యారెంటీ అప్పులు రూ.1.54 లక్షల కోట్లు.. మొత్తంగా రూ.6.46 లక్షల కోట్లేనని స్పష్టం చేశారు. తద్వారా సీఎం చంద్రబాబు ఇంకా రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారంటూ చెబుతున్న మాటలన్నీ అవాస్తవాలేనని అర్థమైందని ఆర్థిక శాఖ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.

దుష్ప్రచారమే లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఈ ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో 2024 డిసెంబర్ నాటికే ఏకంగా రూ.71 వేల కోట్లకు పైగా అప్పు చేసినట్లు ఆర్థిక మంత్రి కేశవ్ వెల్లడించారు. 2023–24 మార్చి నాటికి బడ్జెట్ అప్పులు రూ.4,91,734.11 కోట్లు ఉండగా, ఈ ఆర్థిక ఏడాది డిసెంబర్ నాటికి బడ్జెట్ అప్పులు రూ.5,63,376.96 కోట్లకు పెరిగినట్లు తెలిపారు. రాష్ట్రం విడిపోయిన నాటి నుంచి 2024 డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వని ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన అప్పులు రూ.91,252.58 కోట్లు ఉన్నాయన్నారు. అన్నీ కలుపుకుంటే కూడా మొత్తం అప్పులు రూ.10 లక్షల కోట్లు లేవని తేలింది. అయినా సరే సీఎం చంద్రబాబు పదే పదే రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని చెబుతుండటం వెనుక గత దుష్ప్రచారమే కారణం. అప్పుడు అలా చెప్పినందున, ఇప్పుడు మరో రకంగా చెబితే బాగోదనే ఇలా మాట్లాడుతున్నారని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. రాష్ట్ర అప్పులు రూ.6.46 కోట్లేనని అప్పటి సీఎం వైఎస్ జగన్‌తోపాటు, కాగ్, ఆర్‌బీఐ నివేదికలు వెల్లడించాయి. ఇప్పుడు మంత్రి కేశవ్ కూడా ఇదే చెప్పారు. ఇదంతా ప్రజలను నమ్మించాలనే మోసపూరిత వ్యవహారం తప్ప మరొకటి కాదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

2023-24లో ప్రభుత్వ అప్పు రూ.4,91,734 కోట్లు

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన లెక్క ఇదీ..

Outstanding Debt by the Government and Public Sector Undertakings

Rs. in crore

Year	Government Debt Outstanding as per AG accounts	Outstanding Debt of PSUs with Govt. Guarantees as per AG accounts	Outstanding Debt of PSUs without Govt. Guarantees
as on 2nd June, 2014, allocated	97,176.82	10,875.50	
2014-15	1,48,743.40	10,875.10	
2015-16	1,80,458.08	7,058.53	
2016-17	1,96,842.16	9,664.94	
2017-18	2,23,745.96	35,964.06	
2018-19	2,57,910.90	40,442.58	
2019-20	3,01,802.97	67,171.48	
2020-21	3,50,556.83	91,330.36	
2021-22	3,78,046.63	1,18,603.12	
2022-23	4,28,525.74	1,38,874.75	
2023-24	4,91,734.11	1,54,797.11	
as on 12 June, 2024	5,19,192.00	150617.80*	90,019.27*
as on 31 Dec 2024	5,63,376.96	1,53,434.63	91,252.58**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పులపై దుష్ప్రచారం చేస్తూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు మాట్లాడిన వీడియోల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు

2024 బడ్జెట్ పత్రాల్లో కూటమి ప్రభుత్వం చెప్పిందీ అదే లెక్క

₹ in Crore

Year	Open Market Loans	Loans from Central Govt.	Loans from Other Institutions	Small Savings	Provident Fund	Deposits and Reserve Funds	Total	% of GSDP
ACCTS. 2018-19	1,55,376.48	10,323.01	15,393.26	12,504.27	16,583.28	47,425.57	2,57,509.87	28.02
ACCTS. 2019-20	1,88,820.01	10,942.54	16,318.52	11,331.32	16,745.44	57,644.54	3,01,802.37	31.02
ACCTS. 2020-21	2,29,317.60	14,171.01	16,612.87	10,158.37	23,275.97	57,021.50	3,50,556.92	35.53
ACCTS. 2021-22	2,65,420.98	17,672.48	17,566.83	8,985.42	26,990.25	61,473.05	3,78,086.61	31.46
Accounts 2022-23	311234.98	24508.31	19482.13	7812.47	28277.47	39210.37	429525.72	32.60
2023-24 RE	366564.51	28138.34	19858.87	6639.52	29791.68	40741.18	491734.11	33.71
2024-25 BE	416462.11	45068.60	20808.51	5506.06	31176.81	*40772.17	560094.25	34.14

* Outstanding debt includes un-apportioned amount of Rs.4422.59 crores.

₹ in Crore

Item	Accts. 2018-19	Accts. 2019-20	Accts. 2020-21	Accts. 2021-22	RE 2022-23	BE 2023-24
Power	7,138.29	15,708.69	26,418.49	27,217.41	38,472.93	48,638.59
Other	48,370.17	62,074.07	82,517.81	92,718.59	1,00,401.82	1,06,158.52
Total	55,508.46	77,782.76	1,08,936.30	1,19,936.00	1,38,874.75	1,54,797.11
Power of Total Revenue Receipts of last preceding Year	48.41	70.05	93.00	79.66	88.02	89.08

చంద్రబాబు అండ్ కో చల్లిన బురద ఇలా..



ఊరూరా బెల్ట్ షాపులే

మద్యం అక్రమ అమ్మకాలపై అట్టుడికిన మండలి

- ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు
- 'బెల్ట్' తీస్తానన్న సీఎం చంద్రబాబు మాటలు ఉత్తుత్తివేనని ఎద్దేవా

సాక్షి, అమరావతి : 'రాష్ట్రంలో ఎక్కడైనా బెల్ట్ షాప్ పెడితే బెల్ట్ తీస్తా' అని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనలు ఉత్తుత్తివేనని వైఎస్సార్‌సీపీ ఎండగట్టింది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బెల్ట్ షాప్‌లు దర్శనం ఇస్తుండటమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేసింది. బెల్ట్ షాపులు ఎందుకు తొలగించడం లేదని ప్రభుత్వాన్ని నిలదీసింది. ఏకంగా బెల్ట్ షాప్‌ల కోసం బహిరంగంగా వేలం పాటలు నిర్వహిస్తున్న దుస్థితి రాష్ట్రంలో దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంతో పోలిస్తే రాష్ట్రంలో మద్యం, బీర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయని, తాగించి తాగించి ప్రజల ఆరోగ్యాలను ప్రభుత్వమే గుల్ల చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మద్యం అక్రమ అమ్మకాలపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పండుల రవీంద్ర బాబు, నర్తు రామారావు అడిగిన ప్రశ్న శుక్రవారం శాసన మండలిలో చర్చకు వచ్చింది. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సుదీర్ఘ మాటల యుద్ధం నడిచింది. ఈ నేపథ్యంలో మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. గతంలో ఏబీసీడీఈఎఫ్ ఇలా ఏవో బ్రాండ్‌లు ఉన్నాయని విమర్శిస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు ఆ బ్రాండ్‌లు లేకుండా చేసిందా? అని నిలదీశారు. అవే



బ్రాండ్‌లు ఇప్పుడు కూడా అందుబాటులో ఉన్నాయని ఎద్దేవా చేశారు. మద్య నిషేధం గురించి మంత్రులు మాట్లాడుతున్నారని, మాజీ సీఎం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన మద్య నిషేధానికి తూట్లు పొడిచిందెవరో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసన్నారు. అనవసరంగా చరిత్ర గురించి మాట్లాడొద్దని సూచించారు. బెల్టు షాప్‌లు, మద్యం దుకాణాల్లో నిబంధనల ఉల్లంఘన ఎక్కడ జరిగిందో చెప్పాలని మంత్రులు అడుగుతున్నారని, తమ వద్ద వంద ఉదాహరణలు ఉన్నాయన్నారు.

బెల్ట్ షాపులు, ఓపెన్ బార్‌లు

విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామంలోని బెల్ట్ షాప్‌లో రోజు రాత్రి 10 నుంచి ఉదయం 9 గంటల వరకు మద్యం అమ్మకాలు చేపట్టడానికి రూ.50 లక్షలకు వేలం పాట పాడుకున్నారని బొత్స తెలిపారు. కావాలంటే వెరిఫై చేసుకోవచ్చని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. జిల్లాల్లో బెల్టు షాప్‌ల కోసం బహిరంగంగా వేలం పాటలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రుల నియోజకవర్గాల్లోనూ బెల్ట్ షాపులు, ఓపెన్ బార్‌లు నడుస్తున్నాయన్నారు. 2023 డిసెంబర్‌లో మద్యం అమ్మకాలు 25.83 లక్షల కేసులు, బీర్‌లు 6.40 లక్షల కేసులు అమ్మకాలవ్వగా, 2024 డిసెంబర్‌లో మద్యం 30.46 లక్షల కేసులు, బీర్‌లు 9.11 లక్షల కేసులు అమ్ముడు పోయాయని వివరించారు. ఈ క్రమంలో ఈ ప్రభుత్వంలో లిక్కర్ 18 శాతం, బీర్ 40 శాతం అమ్మకాలు పెరిగాయన్నారు. పాఠశాలలు, దేవాలయాలు ఇలా తేడా లేకుండా అన్ని చోట్ల బెల్ట్ షాపులు దర్శనం ఇస్తున్నాయని చెప్పారు. ఛైర్మన్ మోషేన్ రాజు స్పందిస్తూ ఆధారాలను ప్రభుత్వానికి అందించాలని సూచించగా, అందజేస్తామని కళ్యాణి స్పష్టం చేశారు.

ఇదేమైనా చిట్‌ఫండ్ కంపెనీనా!

రాష్ట్ర వృద్ధి రేటు అమాంతం రెట్టింపు అవడానికి ఇదేమైనా చిట్‌ఫండ్ కంపెనీనా? లేక ప్రభుత్వం దగ్గర పాతాళ భైరవి మంత్రం ఏమైనా ఉందా అని బొత్స నిలదీశారు. బడ్జెట్‌పై శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. 'విజన్ 2047 డాక్యుమెంట్‌లో డాలర్లు, బిలియన్స్, ట్రిలియన్స్‌లో లెక్కలు చెప్పారు. ఏపీ స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.14.2 లక్షల కోట్ల నుంచి 2047 నాటికి ఏకంగా రూ.200 లక్షల కోట్లకు తీసుకెళ్తారట. తలసరి ఆదాయం రూ.2.60 లక్షల నుంచి రూ.34 లక్షలకు పెంచుతారట. ఏటా 15 శాతం జీఎస్‌డీపీ ఉంటేనే ఇది సాధ్యం. ఇప్పుడు ఏపీ జీఎస్‌డీపీ 5 శాతం. కేంద్ర జీడీపీ 6 శాతం మాత్రమే. ఈ ఏడాది బడ్జెట్‌లో 12.6 శాతం వృద్ధిని చూపిస్తున్నారు. ఇదేమైనా చిట్‌ఫండ్ కంపెనీనా వెంటనే రెట్టింపు అవడానికి' అని ప్రశ్నించారు. రాబడులు లేనప్పుడు, వ్యాపారాలు సన్నగిల్లి జీఎస్టీ తగ్గిపోయిన సందర్భంలో రెండంకెల వృద్ధిని చూపించడంలో ఆంతర్యం ఏమిటని మండిపడ్డారు. బడ్జెట్ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, వాస్తవాలకు విరుద్ధంగా ఉందని, భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించలేపోయిందని అన్నారు.

'కుట్టు' స్కీమ్.. గుట్టుగా స్కామ్!

మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వలేదుగానీ నిధులిచ్చేశారు..

సాక్షి, అమరావతి: స్కీముల పేరుతో స్కామ్‌లకు కూటమి ప్రభుత్వం తెర తీసింది. అసలు ఇంతవరకు లబ్ధిదారుల ఎంపికే జరగలేదు. కానీ శిక్షణ పూర్తైనట్లు రూ.60 లక్షలు నిధులు మాత్రం విడుదల చేసేశారు. కుట్టు పనుల్లో శిక్షణ (టైలరింగ్), మిషన్ల పంపిణీ పేరుతో రూ.255 కోట్లతో చేపట్టిన స్కీమ్‌లో రూ.వంద కోట్లకుపైగా కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. వాటాలు కుదరడంతో నిబంధనలకు విరుద్ధంగా టెండర్ ఖరారు చేశారు. అసలు శిక్షణ ప్రక్రియే చేపట్టకుండా 1.02 లక్షల మంది మహిళలకు సీఎం చంద్రబాబు నేడు కుట్టు మిషన్లు పంపిణీకి సిద్ధమయ్యారు. బీసీ సంక్షేమ శాఖలో అవినీతి బాగోతం ఇదీ!

మూడేళ్లలో రూ.300 కోట్లు!

మార్కెట్‌లో కుట్టు మిషన్లు రూ.5 వేల నుంచి రూ.13 వేల లోపే దొరుకుతున్నాయి. నాణ్యమైన మిషన్ అందచేసినా రూ.13 వేలు లెక్కన రాష్ట్రంలో 1,02,832 మంది మహిళా లబ్ధిదారులకు అందించాలంటే రూ.1,33,68,16,000 వ్యయం అవుతుంది. కానీ ప్రభుత్వం ఖరారు చేసిన టెండర్ లెక్కలో మాత్రం మిషన్ల కొనుగోలుకు రూ.224,05,03,616 ఖర్చు చూపించారు. అంటే రూ.133.68 కోట్లు వ్యయం అయ్యే వాటిని ప్రభుత్వం రూ.224.05 కోట్లకు కట్టబెట్టింది. ఈ స్కామ్‌లో ఈ ఏడాది దాదాపు రూ.వంద కోట్లు స్వాహా చేసేలా పథకం రూపొందించారు. మూడేళ్లలో రూ.300 కోట్లకుపైగా ప్రజా ధనాన్ని కాజేసేందుకు ప్లాన్ వేశారు.

వ్యయం పెంచేసి..

నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) అనే విభాగం ఉంది. దాన్ని కాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సహకార ఆర్థిక సంస్థ (ఏపీబీసీసీఎఫ్‌సీఎల్) ద్వారా కుట్టు మిషన్ల స్కామ్‌కు శ్రీకారం చుట్టారు. మొదట రూ.వంద కోట్లతో చేసిన ప్రతిపాదనలను కొనుగోలు, శిక్షణ, పంపిణీ పేరుతో రూ.255 కోట్లకు పెంచారు. మొత్తం 46,044 మంది బీసీ మహిళలు, 45,772 మంది ఈడబ్ల్యూఎస్, 11,016 మంది కాపు మహిళా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చాక ఉచితంగా కుట్టు మిషన్ అందించాల్సి ఉంటుంది.



ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్‌లలో అతి తక్కువ ధరకే లభ్యమవుతున్న కుట్టు మిషన్‌లు

ముందస్తు ఒప్పందంతోనే టెండర్ ఖరారు..

ఏ టెండర్ పిలిచినా తక్కువ మొత్తానికి కోట్ చేసిన సంస్థకు ఖరారు చేయాలి. బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీకి గతేడాది డిసెంబర్ 18న ఆన్‌లైన్ బిడ్‌లను పిలిచారు. అదే నెల 31న టెక్నికల్ బిడ్‌లను తెరిచి మూడు సంస్థలకు అర్హత ఉన్నట్లు ఖరారు చేశారు. తాజాగా ఆ మూడు సంస్థలకు ఫైనాన్షియల్ బిడ్‌లలో టెండర్ కట్టబెడుతూ ఆమోద ముద్ర వేశారు. యూనిట్ (ఒక్కో కుట్టు మిషన్) రూ.21,788 చొప్పున సరఫరాకు శ్రీటెక్నాలజీ ఇండియా (ఎల్‌ఎల్‌పీ, హైదరాబాద్) ముందుకు రాగా సోషల్ ఏజెన్సీ ఫర్ పీపుల్ ఎంపవర్‌మెంట్ రూ.23,400 చొప్పున సమకూర్చనున్నట్లు తెలిపింది. సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రూ.23,500 చొప్పున సరఫరా చేస్తామని బిడ్‌లు దాఖలు చేసింది. ఈ మూడు సంస్థలకు ఎంపానల్‌మెంట్ చేస్తూ ప్రభుత్వం టెండర్ ఖరారు చేయడం గమనార్హం. తక్కువ ధరకే కుట్టు మిషన్ సరఫరా చేస్తామని బిడ్ వేసిన సంస్థకు టెండర్ ఇవ్వాల్సి ఉండగా, ఎక్కువ ధర కోట్ చేసిన మరో రెండు సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడం వెనుక ఏం జరిగిందనేది బహిరంగ రహస్యమే! మరో చిత్రం ఏమిటంటే ఎక్కువ మొత్తానికి బిడ్స్ వేసిన రెండు సంస్థలు ఒకే సిండికేట్ కావడం గమనార్హం.

శిక్షణ ఇవ్వలేదుగానీ నిధులిచ్చేశారు..

ప్రభుత్వం టెండర్‌లో పొందుపరిచిన ప్రమాణాలను పరిగణలోకి తీసుకుంటే ఒక్కో కుట్టుమిషన్ కేవలం రూ.5 వేల నుంచి రూ.13వేల లోపు మాత్రమే పలుకుతోంది. కుట్టు మిషన్‌తోపాటు శిక్షణ కూడా అందించేలా ఒక్కో యూనిట్‌కు రూ.25 వేలు చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. ఇక ఎక్కడైనా సరే టెండర్ దక్కించుకున్నవారు పనులు మొదలుపెట్టి తరువాత బిల్లులు సమర్పిస్తారు. కానీ ఇక్కడ మాత్రం టెండర్ ఖరారు కాగానే ఆర్డర్ ఇవ్వకముందే మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో రూ.60 కోట్లు (టెండర్ మొత్తంలో 25 శాతం) ఇచ్చేలా ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లోనే ఆగమేఘాలపై ఫైల్ కదిలింది. లబ్ధిదారుల ఎంపిక, శిక్షణ కార్యక్రమాలను చేపట్టకుండానే ఎంటర్‌ప్రైజర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈడీపీ) పేరుతో ఏకంగా రూ.60 లక్షలను సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సంస్థకు ఇచ్చేయడం అనుమానాలకు తావిస్తోంది. టెండర్ ఖరారయ్యాక జిల్లాల వారీగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి శిక్షణ పూర్తయ్యాక ఇవ్వాల్సిన నిధులను ముందుగానే విడుదల చేయడంతో అవి ఎవరి జేబులోకి చేరాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల సమ్మె నోటీస్

- రూ.3,500 కోట్లు బిల్లులు పెండింగ్
- వచ్చే నెల 7 నుంచి సేవలు నిలిపేస్తామని అల్టిమేటం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రూ.3,500 బిల్లులు బకాయి పెట్టడంతో ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మెకు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే వచ్చేనెల 7వ తేదీ నుంచి సేవలను పూర్తిగా నిలిపివేస్తామని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓకు ఆశ ప్రతినిధులు లేఖ రాశారు. 2025–26 బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీ పథకం కోసం కేటాయించిన నిధులు ప్రస్తుత పెండింగ్ నిధులకు సమానంగా ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. పెద్దఎత్తున బిల్లులు బకాయి ఉండటంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందని, ప్రస్తుతం తాము ఉన్న పరిస్థితుల్లో సేవలు నిలిపివేయడం తప్ప వేరే గత్యంతరం లేదని స్పష్టం చేశారు. తమ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు అధికారులతో చర్చించినా బిల్లు చెల్లింపులపై స్పష్టమైన హామీ మాత్రం అందడం లేదన్నారు. దీనికి తోడు కొత్తగా ప్రవేశ పెట్టే బీమా పథకంపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. కొత్త పథకం నిర్మాణం, కార్యాచరణ, ప్యాకేజీ రేట్లకు సంబంధించి సేవలు అందించాల్సిన తమకు సమాచారం ఇవ్వకపోవడం అనిశ్చితికి తావిస్తోందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టకపోతే ఏప్రిల్ 7 వ తేదీ నుంచి నగదు రహిత వైద్యసేవలు పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు.

పథకాల కోసం హౌస్‌హోల్డ్ జాబితాలో నమోదు తప్పనిసరి

ప్రభుత్వం ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వం నుంచి పౌరసేవలతో పాటు సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు గ్రామ, వార్డు సచివాలయాల కుటుంబాల(హౌస్‌హోల్డ్) జాబితాలో లేదంటే ఆర్‌టీజీఎస్ డేటా బేస్‌లో వివరాల నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ శుక్రవారం జీవో జారీచేశారు. ఆయా పథకాల అమలు, వినతుల పరిష్కార సమయంలో కుటుంబ జాబితాలోని వివరాలు సరిపోల్చుకున్న అనంతరమే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

15న అమరావతిలోని శ్రీవారి ఆలయంలో శ్రీనివాస కల్యాణోత్సవం

సాక్షి, అమరావతి : అమరావతిలోని శ్రీవారి ఆలయంలో మార్చి 15న శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన అమరావతిలో టీటీడీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. శ్రీవారి కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరవుతారని, కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని తెలిపారు.

తుర్లపాటి రాజేశ్వరికి సాహిత్య అకాడెమీ అవార్డు

న్యూఢిల్లీ: 2024 సంవత్సరానికి గాను అనువాదంలో ప్రసిద్ధులైన 21 మందికి సాహిత్య అకాడెమీ అవార్డులను ప్రకటించింది. ఇంగ్లిష్‌లో అనిసుర్ రహ్మాన్, హిందీలో మదన్ సోనీకి దక్కగా తెలుగులో తుర్లపాటి రాజేశ్వరి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. 'హజారో ఖ్వాహిసే'ఐసీ అనే ఉర్దూ కవితల సంకలనాన్ని 'వండర్ ఫుల్ వరల్డ్ ఆఫ్ ఉర్దూ గజల్స్'పేరుతో అనిసుర్ ఇంగ్లిషులోకి అనువదించారు. అదేవిధంగా, యశోధరా దాల్మియా ఇంగ్లిష్‌లో రాసిన కళాకారుడు సయ్యద్ హైదర్ రజా ఆత్మకథను సోనీ హిందీలోకి తర్జుమా చేశారు. ఇంకా, తమిళం, మరాఠీ, పంజాబీ, ఒడియా, కన్నడ, రాజస్తానీ తదితర భాషల అనువాదకులను సైతం అవార్డుకు ఎంపిక చేశారు. సాహిత్య అకాడెమీ అధ్యక్షుడు మదన్ కౌశిక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో సమావేశమైన బోర్డు ఈ విషయం ప్రకటించింది. సంబంధిత భాషల్లో ముగ్గురు సభ్యుల జ్యూరీ అందజేసిన ప్రతిపాదనలు, నియమ నిబంధనలకు లోబడి ఎంపిక చేసినట్లు వివరించింది. త్వరలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరికి రూ.50 వేల నగదుతోపాటు తామ్ర పత్రం అందజేయనున్నామంది.



జాతీయ మహిళా దినోత్సవం

గాన కోకిల జయంతి

మనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉన్నట్లే 'జాతీయ మహిళా దినోత్సవం' కూడా ఉంది. ఫిబ్రవరి 13 స్వాతంత్ర్య సమరయోధురాలు, బాల మేధావి, కవయిత్రి సరోజినీ నాయుడు జయంతి. స్వాతంత్ర్యోద్యమంలో సరోజిని నాయుడు పోషించిన ముఖ్యమైన పాత్ర, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన కృషికి గుర్తింపుగా జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సమతుల్యత సాధించాలి

- డాక్టర్ సంగీతారెడ్డి,
అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్



ప్రతిభ, అభివృద్ధికి దోహదపడే వాతావరణాన్ని సృష్టించడం నిరంతరం కృషి ద్వారానే సాధ్యం' అంటున్నారు అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి. మహిళా దినోత్సవ సందర్భంగా డాక్టర్ సంగీతారెడ్డి మహిళా నాయకత్వం, సామర్థ్యాల గురించి వివరించారు..

''ఏ రంగంలోనైనా నాయకత్వం వహించడానికి దూరదృష్టి, కొత్త ఆవిష్కరణలపై అవిశ్రాంత కృషి అవసరం. సాంకేతికతంగా వస్తున్న మార్పులను అమలు చేయడంలో, టీమ్ వర్క్‌ను బలోపేతం చేయడంలో ముందుండాలి. బలమైన నాయకులుగా ఉండాలంటే పనిలో నైపుణ్యాలతో పాటు వైవిధ్యాన్నీ పెంపొందించాలి. సక్సెస్ ఉద్దేశం ఒక్కరమే ఎదగడం కాదు, అర్థవంతమైన మార్పుతో మనతోపాటు ఉన్నవారితో కలిసి నడవడం.

సమతుల్యం చేయడంలోనే సవాళ్లు

వైద్య రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ నిత్యం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. వృత్తిపరంగా ఎదగడంలోనూ, వ్యక్తిగత బాధ్యతలతో బాలెన్స్ చేయడం అనేది అతిపెద్ద అడ్డంకిగా మారింది. కెరీర్–ఇల్లు రెండింటినీ సమర్థంగా నిర్వహించడానికి సమాజం ఇప్పటికీ మహిళలపై చెప్పలేనన్ని అంచనాలను ఉంచుతోంది. రెండుచోట్లా మహిళలు అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే వాతావరణం ఉండాలి. అలా లేకపోవడంతో 'ఆమె సమర్థత'కు ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. మన సమాజంలో మరొక సవాల్ లోతుగా పాతుకుపోయిన లింగ వివక్ష. నాయకత్వ అవకాశాలను పరిమితం చేసేది ఇదే.

నాయకత్వం జెండర్‌తో కాదు సామర్థ్యం వల్లే సాధ్యం అని నిరూపించడానికి మహిళ మరింత కష్టపడి పనిచేయాలి. మహిళల అభివృద్ధి నుండి మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి మరింత చురుగ్గా వ్యవహరించాలి. డెసిషన్ మేకర్స్ జాబితాలో ఎక్కువ మంది మహిళలకు స్థానం ఉండేలా చూసుకోవాలి. మిగతావాటికన్నా వైద్యరంగం భిన్నమైనది, లోతైనది కూడా. ఎందుకంటే ఇక్కడ ప్రాణాలను కాపాడటం, ఆరోగ్య ఫలితాలలో మంచి మార్పులు తీసుకురావడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, సరిహద్దులను దాటి ఆలోచించడం, యథాతథ స్థితి కొనసాగేలా టీమ్స్‌ను ప్రోత్సహించడం... వంటివి వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలో మనల్ని ముందు ఉంచుతుంది.

మార్పులు తప్పనిసరి

రోల్ మోడల్స్ మార్గదర్శకత్వంతో పాటు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలి. వ్యవస్థాగత అడ్డంకులను పరిష్కరించాలి. పనిప్రదేశంలో సమాన వేతనం, నిష్పాక్షికమైన కెరీర్ పురోగతికి మద్దతు ఇవ్వాలి. ముఖ్యంగా, మహిళల అభివృద్ధి నుండి మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి మారాలి. మహిళలు ఆరోగ్య సంరక్షణలో పాల్గొనేవారు మాత్రమే కాదు, భవిష్యత్తుకు చురుకైన రూపశిల్పులుగా మారాలి.

నెట్‌వర్క్‌ను నిర్మించుకోవాలి

సాధారణంగా మహిళలు రిస్క్ తీసుకొని, తమ స్థానాన్ని సాధించేందుకు వెనకాడతారు. మీ ముందు చూపును, అంతర్దృష్టిని నమ్మండి. బలమైన మద్దతునిచ్చే నెట్‌వర్క్‌ను నిర్మించుకోండి. విజయం ఎప్పుడూ ఒంటరి ప్రయాణం కాదు. మిమ్మల్ని సవాలు చేసేవారు, మార్గదర్శకులు, సహచరులు, టీమ్స్‌తో ముందుకు కదలాలి. నేర్చుకోవడాన్ని ఎప్పుడూ ఆపవద్దు. సవాళ్లను సోపానక్రమాలుగా స్వీకరించాలి. ప్రతి అడ్డంకిని నూతనంగా ఆవిష్కరించడానికి, అభివృద్ధి చెందడానికి ఒక అవకాశం అనుకోవాలి. మహిళా వ్యవస్థాపకులు పరిశ్రమలను రూపొందిస్తున్నారు, ఇది మన సమయం అని గుర్తించండి'' అంటూ మహిళాభ్యున్నతికి మార్గదర్శకం చేస్తున్నారు డాక్టర్ సంగీతారెడ్డి.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

శ్రమతోనే సక్సెస్

- పి.వి. సింధు, క్రీడాకారిణి

పూసర్ల వెంకట సింధు... ఒలింపిక్స్‌లో పతకాలు సాధించింది. కామన్‌వెల్త్... వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణాలు సొంతం చేసుకుంది. ప్రపంచవేదికల మీద దేశ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసింది. భారత మాత మెడలో పతకాల హారం వేసి బంగారు సింధు అయింది. ఈ ఏడాది మహిళాదినోత్సవాన్ని శ్రీమతి సింధుగా వేడుక చేసుకుంటోంది. సాధికారత దిశగా పయనిస్తున్న మహిళలకు అభినందనలు చెప్పింది.



ఈ తరంలో మహిళలు బిజినెస్, స్పోర్ట్స్‌తో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. కేవలం తమకు తాము నిలదొక్కుకోవడంతో సరిపెట్టడం లేదు, ఆ రంగంలో నంబర్ వన్‌గా నిలవడానికి శ్రమిస్తున్నారు. నంబర్ వన్ లక్ష్యాన్ని సాధిస్తున్నారు కూడా. ఈ స్ఫూర్తిని, ఇదే పంథాను కొనసాగించాలని అభిలషిస్తున్నాను.

సక్సెస్‌కు దారి!

ప్రతి ఒక్కరూ తమ కోసం తాము కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటిని చేరుకోవడానికి తగినంత శ్రమించాలి. సక్సెస్ అనే లక్ష్యాన్ని చేరడానికి ఉన్న ఏకైక దారి హార్డ్‌వర్క్. హార్డ్‌వర్క్‌తో మాత్రమే విజయానికి చేరువ కాగలుగుతాం. అది కూడా ఒక నెల శ్రమతోనో ఏడాది శ్రమతోనో శిఖరాన్ని చేరాలని ఆశించకూడదు. కొన్నేళ్ల కఠోరశ్రమ, అంకితభావంతో శ్రమించినప్పుడే సక్సెస్ మనదవుతుంది. అయితే కొందరికి సక్సెస్ కొంత త్వరగా రావచ్చు, మరికొందరికి ఆలస్యం కావచ్చు. మన మీద మనం నమ్మకాన్ని కోల్పోకూడదు. ఆశను వదులుకోకూడదు, నిరాశపడకూడదు. మనం మనవంతుగా శ్రమిస్తూ ఉండాలి. సక్సెస్ వచ్చినప్పటి నుంచి మరింత బాధ్యతగా పని చేయాలి. సక్సెస్ అనే శిఖరాన్ని చేరాం అని రిలాక్స్ కాకూడదు. నంబర్ వన్‌కి చేరడానికి నేనలాగే కష్టపడ్డాను, కష్టపడుతూనే ఉంటాను కూడా.

అమ్మానాన్న... భర్త!

ఇప్పటి వరకు నన్ను, నా ఆర్థిక వ్యవహారాలను అమ్మా నాన్న చూసుకునేవారు. టోర్నమెంట్‌కి తోడుగా నాన్న వచ్చేవారు. ఇప్పుడు మా వారు వస్తున్నారు. నా గురించి అన్నీ వాళ్లే చూసుకుంటారు. నా ఫోకస్ అంతా ఆట మీదనే కేంద్రీకరించడానికి తగిన వెసులుబాటునిస్తున్నారు.

పేరెంట్స్ నడిపించాలి!

దేశానికి కొత్తతరం క్రీడాకారులు తయారు కావాలి. క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పిల్లలకు స్పోర్ట్స్ మీద ఆసక్తి ఉన్నప్పటికీ తల్లిదండ్రుల సహకారం లేకపోతే క్రీడాకారులు తయారుకారు. పిల్లలను క్రీడల దిశగా నడిపించడం పేరెంట్స్ చేతిలోనే ఉంటుంది. ఆటలు, చదువు రెండూ కీలకమే. రెండింటినీ ఎలా బాలెన్స్ చేసుకోవాలో నేర్పించగలిగింది కూడా పేరెంట్సేనని నా అభిప్రాయం. పేరెంట్స్‌కి కోరిక ఉన్నప్పటికీ పిల్లలకు ఆడాలనే ఆసక్తి లేకపోతే ఆ పిల్లలు దీర్ఘకాలం కొనసాగడం కష్టం. అలాగే ఆటల పట్ల ఆసక్తి ఉన్న పిల్లలకు పేరెంట్స్ సహకారం లేకపోతే తొలి అడుగు కూడా పడదు. అందుకే తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యం.

సింధుగానే గుర్తించాలి!

సమాజం నన్ను సింధుగానే గుర్తించాలి. 'పీవీ సింధు' అనగానే చేతిలో రాకెట్‌తో నా రూపం కళ్ల ముందు మెదులుతుంది. అలా నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాను. దేశం కోసం ఆడగలిగే స్థాయికి చేరాను. దేశం కోసం ఆడాను. దేశానికి ఎన్నో పతకాలను సాధించాను. దేశానికి గౌరవాన్ని పెంచడంలో నా శ్రమ కూడా ఉందని సంతోషపడుతున్నాను. ఈ గుర్తింపు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హాస్యచతురత.. సమయస్ఫూర్తి అని గూగుల్ చేస్తే సుమ కనకాల అని వస్తుందేమో! అందుకే ఇన్నేళ్లయినా ఆమె యాంకరింగ్‌కి ఆదరణ తగ్గలేదు.. తన పేరుతోనే షోలకు ఫాలోయింగ్‌ని పెంచే స్థాయికి చేరుకుంది.. ఆ తరం నుంచి ఈ తరం దాకా అందరికీ అభిమాన హోస్ట్‌గా మారిపోయింది.. ఇంటర్నేషనల్ విమెన్స్ డే ఉత్సవాన ఆమె గురించి ఆమె మాటల్లోనే..



కష్టాన్నే నమ్ముకోవాలి

- సుమ, యాంకర్

'నేను పుట్టింది కేరళలోని పాలక్కాడ్‌లో. పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. అందుకే చిన్నప్పటి నుంచీ తెలుగు తెలుసు. మెట్టుగూడ రైల్వేక్వార్టర్స్‌లో ఉండేవాళ్లం. తార్నాకలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్లో చదివాను. రైల్వే డిగ్రీ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ చేశాను. తెలుగులో ఫ్లుయెన్సీ ఉండాలని మా అమ్మగారు పట్టుబట్టడం వల్ల స్కూల్లో తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకున్నాను. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత రైటర్స్, డైరెక్టర్స్ ద్వారా కొంత తెలుగు నేర్చుకున్నాను. తెలుగు మీద నాకు పూర్తి పట్టు రావడంలో నా భర్త రాజీవ్ హెల్ప్ కూడా ఉంది. పుట్టింట్లో ఉన్నప్పుడు మాత్రమే మలయాళం .. మిగతా అంతా తెలుగే!

దూరదర్శన్ మాత్రమే..

ఈ ఫీల్డ్‌లోకి చిత్రంగా వచ్చాను. నేను చేసిన ఓ డాన్స్ ప్రోగ్రామ్ నచ్చి, దూరదర్శన్ సీరియల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు గారు ఫోన్ చేశారు.. 'ప్రదీప్ గారి డైరెక్షన్‌లోని ఓ సీరియల్‌లో మమ్మల్ని కాస్ట్ చేయాలనుకుంటున్నాం.. మీకు ఇంట్రెస్ట్ ఉందా?' అంటూ! నాకు లేదు కానీ మా పేరెంట్స్ సరదాపడ్డారు. దాంతో ఓకే అన్నాను. అలా తెలుగు టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టాను. అప్పుడు దూరదర్శన్ చానల్ మాత్రమే ఉండేది. అందులో ఎక్కువగా సింగిల్ ఎపిసోడ్స్ ఉండేవి. అందుకనే నేను సింగిల్ ఎపిసోడ్స్‌లోనే ఎక్కువగా చేశాను. కొన్ని సినిమా బేస్డ్ ప్రోగ్రామ్స్‌కి యాంకరింగ్ కూడా చేశాను. శాటిలైట్ చానల్స్ స్టార్ట్ అవగానే పూర్తిగా యాంకరింగ్‌కి షిఫ్ట్ అయిపోయాను. 'అంత్యాక్షరి', 'వన్స్ మోర్' నుంచి 'అవాక్కయ్యారా', 'స్టార్ మహిళ' లాంటి ఎన్నో షోస్‌ని హోస్ట్ చేశాను. 'స్టార్ మహిళ' నేను మరచిపోలేని షో. దాదాపు 12 సంవత్సరాలపాటు అయిదు వేల షోస్ చేసి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాను. ఆ షోతో ఎంతో మంది మహిళలు తమ వ్యక్తిత్వాలతో నన్ను ఇన్‌స్పైర్ చేశారు. సొంత మనిషిలా ఆదరించారు. అవకాశముంటే మళ్లీ ఆ షో చేయాలనుకుంటున్నాను. తెలుగువారితో ఆ అనుబంధం రోజురోజుకీ బలపడుతోంది. జీన్స్, క్యాష్.. ఇప్పుడు 'సుమ అడ్డా' ప్రోగ్రామ్స్‌కి దొరుకుతున్న ఆదరణే అందుకు సాక్ష్యం.

బహుభాషలతో ప్రయోజనం

యాంకరింగ్ పర్సనల్ క్యారెక్టర్‌కి ప్రతిబింబం లాంటిది. ఈ విషయంలో నాకున్న జోవియల్ నేచర్, సమయస్ఫూర్తి చాలా హెల్ప్ అయ్యాయి. దాంతోపాటు నాకు బహుభాషలు తెలిసుండటమూ ప్లస్ పాయింట్ అయింది. మాతృభాష మలయాళం అవడం, తమిళ్, హిందీ కూడా వచ్చి ఉండటం, ఇంగ్లిష్‌లో ఫ్లుయెన్సీ వల్ల.. ఏవైనా అవార్డ్ ఫంక్షన్స్‌కి రెండు, మూడు భాషల వాళ్లు వచ్చినప్పుడు కమ్యూనికేట్ చేయడం, వాళ్ల సినిమాల గురించి మాట్లాడటం చాలా ఈజీ అయిపోతోంది. ప్రొఫెషన్‌లో ఎదురయ్యే సవాళ్లను సమయస్ఫూర్తితోనే నెగ్గుకొస్తాను. నావి ఎక్కువగా లైవ్ షోస్ కాబట్టి ఎడిటింగ్‌కి స్కోప్ ఉండదు. నాకు నేనే ఎడిటర్‌గా వ్యవహరించుకోవాలి. ఆచితూచి మాట్లాడాలి. నేను నటించిన సీరియల్స్, సినిమాలు నాకు చాలా నేర్పించాయి. ఈ ప్రొఫెషన్‌కు చక్కటి బాట వేశాయి. మా అత్తగారివైపు అందరూ ఇదే ఫీల్డ్‌కు చెందిన వాళ్లవడం నాకు కలిసొచ్చింది. వర్క్, లైఫ్ బ్యాలెన్స్ సాధ్యమైంది. మా ఇంట్లో నా షోస్‌కు బిగ్గెస్ట్ ఫ్యాన్స్.. మా అత్తగారు, మా అమ్మగారు.

ఇప్పుడు..

నా యూట్యూబ్ చానల్‌లో 'చాట్ షో'ని స్టార్ట్ చేశాను. అలాగే 'షెఫ్ మంత్ర' అనే కొత్త షో కూడా మొదలైంది, 'ప్రేమంటే' అనే ఒక సినిమాలో కీ రోల్ చేస్తున్నాను. దేవాలయాల మీద 'అవర్ టెంపుల్స్' అనే సిరీస్ చేయాలి అనుకుంటున్నాను. టాలెంట్‌కి ఆకాశమే హద్దు. ఒక రీల్ షూట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చాలు.. వైరల్ అయిపోవచ్చు. ఫోన్లలో రీల్స్‌తో ఎంటర్‌టైన్ అవుతున్న కాలం ఇది. కాబట్టి అందులో కూడా నా ఎంటర్‌టైన్‌మెంట్ పోర్షన్‌ను అందిస్తున్నాను. లీజర్‌టైమ్ దొరికితే.. వెబ్ సిరీస్, మూవీస్ చూస్తాను.

నాకు అత్యంత మెమరబుల్ మూమెంట్ నా పిల్లలే! ప్రొఫెషన్‌కి సంబంధించి అయితే .. నంది అవార్డ్ తీసుకోవడం! సామాజిక బాధ్యతనూ పంచుకునేందుకు మహిళల ఆరోగ్యం, సాధికారత, అలాగే ట్రాఫికింగ్ నుంచి బయటపడ్డ అమ్మాయిల స్వావలంబన, పిల్లల ఆరోగ్యం గురించి పనిచేసే 'ఫెస్టివల్స్ ఫర్ జాయ్' అనే ఎన్‌జీవోను మూడేళ్ల కిందట స్టార్ట్ చేశాను. భవిష్యత్‌లో మరికొన్ని ప్రాజెక్ట్స్ చేపట్టాలని ప్లాన్ చేస్తున్నాం. నేను నమ్మేదొక్కటే.. కష్టాన్ని నమ్ముకుంటే అవకాశాల తలుపులు తెరుచుకుంటాయి. అప్పుడు అందరూ అందరికీ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తారు' అంటూ ముగించారు సుమ కనకాల.

– శిరీష చల్లపల్లి

స్వాతి లక్రా.. ఐపీఎస్ ఆఫీసర్‌గా ఆమెది ప్రత్యేక ముద్ర! డిపార్ట్‌మెంట్‌లో ఆమె ఏ పోస్టింగ్‌కి వెళితే ఆ హోదాలో తొలి మహిళగా క్రెడిట్ పొందడమే కాదు.. ఆ బాధ్యతలనూ అంతే సమర్థంగా నిర్వహించి మహిళల శక్తిసామర్థ్యాలకూ గుర్తింపు తెచ్చారు. ఆర్గనైజేషన్, హోమ్‌గార్డ్స్ అండ్ కోఆర్డినేషన్‌కి అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్న ఆమె విమెన్స్ డే సందర్భంగా ఏం చెబుతున్నారంటే..

లీడర్‌షిప్ కావాలి

- స్వాతి లక్రా, ఐపీఎస్



నేను ఐపీఎస్ జాయిన్ అయినప్పుడు అంటే 1995లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో రెండు లేదా మూడు శాతం మాత్రమే మహిళలు ఉండేవారు. ఐపీఎస్ క్యాడర్‌లో ఇంకా తక్కువ.. ఎంతంటే నేను ఏ పోస్ట్‌కి వెళ్లినా ఆ పోస్ట్‌లో ఫస్ట్ ఉమన్‌ని నేనే అయ్యేంత! కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. మా బ్యాచ్‌లో పదమూడు మంది మహిళలం ఉంటే ఇప్పుడు 60 మంది వరకూ ఉంటున్నారు. ఇంతకుముందు పోలీసులు అంటే కేవలం పురుషులే అన్న ఇమేజ్ ఉండేది. ఇప్పుడది మారిపోయింది. డిపార్ట్‌మెంట్‌లోని అన్ని స్థాయిల్లోకి మహిళలు వస్తున్నారు. తెలంగాణలో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది ప్రభుత్వం. దాంతో మహిళల సంఖ్య పెరుగుతోంది. అందుకే ఇప్పుడు పోలీస్ అంటే మహిళలు కూడా అనే ఇమేజ్ స్థిరపడిపోయింది. పోలీస్ స్టేషన్స్‌లో సౌకర్యాలూ విమెన్ ఫ్రెండ్లీగా మారుతున్నాయి. తెలంగాణనే తీసుకుంటే.. ప్రతి స్టేషన్‌లో మహిళల కోసం సపరేట్ వాష్ రూమ్స్‌ని కట్టించాం. కొన్ని జిల్లాల్లో అయితే బేబీ కేర్ సెంటర్స్‌ని కూడా ఏర్పాటు చేశాం. ఈ మధ్య సైబరాబాద్ కమిషనరేట్‌లో కూడా బేబీ కేర్ సెంటర్‌ను పెట్టారు. ఇదివరకు బందోబస్త్‌లు, గణేశ్ నిమజ్జనానికి మహిళా పోలీస్‌లు డ్యూటీకి వెళితే వాష్‌రూమ్స్ ఉండక చాలా అవస్థపడాల్సి వచ్చేది. ఇప్పుడు మొబైల్ వాష్ రూమ్స్ సౌకర్యం వచ్చింది. ఎక్కడ బందోబస్త్ ఉంటే అక్కడికి ఈ మొబైల్ వాష్‌రూమ్‌ని పంపిస్తున్నారు. ఇలా మహిళలు చక్కగా పనిచేసుకోవడానికి అనుగుణమైన వసతులు ఏర్పాటవుతున్నాయంటే మహిళల పనికి గుర్తింపు, డిమాండ్ వచ్చినట్టే కదా!

దృష్టి పెడతారు..

ఏ రంగంలో అయినా ఎంతమంది మహిళలు వస్తే అంత వేగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ అవుతుంది. మొత్తం వ్యవస్థలోనే విమెన్ ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఏర్పడుతుంది. అంతేకాదు లీడర్‌షిప్ రోల్స్‌ని పొందే అవకాశం వస్తుంది. లీడర్‌షిప్ రోల్స్‌లో మహిళలు ఉంటే స్త్రీల అవసరాల మీద దృష్టిపెడతారు. సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి.

ఎలాంటి టాస్క్‌లకైనా సిద్ధమే!

ఏ రంగంలో అయినా మహిళలు శారీరక శ్రమలో కానీ.. బుద్ధికుశలతలో కానీ పురుషులతో సమంగా ఉంటున్నారు. అలాగే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కూడా! మహిళలు కదా అని తేలికపాటి టాస్క్‌లు ఇవ్వడం ఉండదు. కీలకమైన బాధ్యతలనూ అప్పగిస్తారు. నన్నే తీసుకుంటే నేను మావోయిస్ట్ ఏరియాల్లో కూడా పని చేశాను. కాబట్టి మహిళలకు సమాన అవకాశాలే ఉన్నాయి.. ఉంటాయి.. ఉండాలి కూడా!

చెప్పుకోదగ్గదే కానీ..

మహిళా సాధికారత సాధించాలంటే ముందు స్త్రీల హక్కుల గురించి స్త్రీలతోపాటు సమాజమూ తెలుసుకోవాలి. స్త్రీ సెకండ్ సిటిజన్ కాదు.. తోటి పౌరురాలే అన్న స్పృహ రావాలి. అది ఇంటినుంచే మొదలవ్వాలి. నన్ను మా బ్రదర్‌తో సమానంగా చదివిస్తేనే కదా నా ఐపీఎస్ కల సాధ్యమైంది. అలా కొడుకైనా కూతురైనా ఇద్దరూ సమానమే.. హక్కులు, అవకాశాలు ఇద్దరికీ సమానమే అనే భావన పేరెంటింగ్‌లో కనిపించాలి. తర్వాత స్కూల్లో టీచింగ్‌లోనూ భాగం కావాలి. అప్పుడే అది సమాజంలో రిఫ్లెక్ట్ అవుతుంది. స్త్రీల పట్ల గౌరవం పెరుగుతుంది. ఆడపిల్లలు చదువును నిర్లక్ష్యం చేయకూడదు. ఆర్థికస్వాతంత్ర్యానికి అదే మెట్టు! కాబట్టి అమ్మాయిలు అందరూ చదువు మీద దృష్టిపెట్టాలి.

– సరస్వతి రమ



''నిజ జీవితాన్ని, నా సినీ జీవితాన్ని పంచుకుని నాకు విజయం అందించిన నా హీరోయిన్స్ అందరికీ, యావన్మంది మహిళలకు చేతులెత్తి నమస్కరిస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు'' అంటూ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఈ ఫొటోను షేర్ చేసి, చిరంజీవి పేర్కొన్నారు

ధైర్యంగా బతకాలి... ప్రశాంతంగా ఉండాలి

– నదియా

"మీ విలువ మీరు తెలుసుకోండి... మీకు నచ్చినట్లు మీరు బతకండి" అంటున్నారు నదియా. హీరోయిన్గా 1980-1990లలో విజయవంతమైన కెరీర్ని చూసిన నదియా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని, అమెరికాలో సెటిలయ్యారు. 1994లో సినిమాలకు దూరమై, 2004లో క్యారెక్టర్ ఆర్టిస్ట్గా సిల్వర్ స్క్రీన్కి వచ్చారు. 'కారవాన్' వాహన సౌకర్యాలు లేని రోజులను, ఇప్పుడు ఆ సౌకర్యాలు ఉన్న రోజులనూ చూస్తున్నారు నదియా. 'మహిళా దినోత్సవం' సందర్భంగా 'సాక్షి'కి నదియా ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలోని విశేషాలు తెలుసుకుందాం.



నా జీవితం హ్యాపీ

నా జీవితం మొత్తం సాఫీ. హీరోయిన్గా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని, మా ఆయనతో అమెరికాలో సెటిలయ్యాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ లైఫ్ని పరిపూర్ణంగా ఆస్వాదించాను. చాలా గ్యాప్ తర్వాత సినిమాలకు చాన్స్ వచ్చింది. 'నటిగా నీ పూర్తి ప్రతిభని నువ్వు వినియోగించుకోలేదు.. సినిమాలు కంటిన్యూ చెయ్' అని మా ఆయన, 'మళ్లీ యాక్ట్ చెయ్ అమ్మా' అని పిల్లలు అన్నారు. వచ్చాను.. క్యారెక్టర్ ఆర్టిస్ట్గా బిజీగా ఉన్నాను.

● టీనేజ్లో హీరోయిన్ అయిన మీకు అప్పటి షూటింగ్ వాతావరణం, అంతమంది వ్యక్తులతో పని చేయడం వంటివి ఇబ్బందిగా అనిపించేదా?

మలయాళంలో నా తొలి సినిమా 'నోక్కెత్త దూరత్తు కన్నుమ్ నాట్టు' (1984). ఈ సినిమా తమిళంలో 'పూవే పూచ్చూడవా'గా రీమేక్ అయింది. తమిళంలోనూ నేనే నటించాను. తమిళంలో నాకు తొలి సినిమా. ఆల్రెడీ ఒక భాషలో చేసిన సినిమా కావడం ఒక ప్లస్. మలయాళం సినిమా డైరెక్టర్ ఫాజిల్ తమిళంలోనూ చేశారు. అలాగే నాకు తమిళ్ అస్సలు రాకపోవడంతో ఓ ట్యూటర్ను పెట్టి, నేర్పించారు. దాంతో ఈజీ అయింది. షూటింగ్ పరంగా ఎలాంటి చేదు అనుభవాలు ఎదురు కాలేదు. దాంతో భయపడాల్సిన అవసరం రాలేదు. అలాగే ఆ సినిమా హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసుకోనంతగా బిజీ అయ్యాను.

● సినిమా ఇండస్ట్రీలో అమ్మాయిలు నిలదొక్కుకోవాలంటే చాలా కష్టం అంటారు... ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందనే టాక్ కూడా వినిపిస్తుంటుంది...

నేను నా అనుభవాల గురించి మాట్లాడతాను. నాతో పాటు మా నాన్న షూటింగ్కి వచ్చేవారు. ఒక్క నిమిషం కూడా ఆయన నన్ను ఒంటరిగా వదిలిపెట్టేవారు కాదు. ఆయన అంతగా ప్రొటెక్ట్ చేయడంతో నాకు ప్రెజర్ ఉండేది కాదు. అలాగే వచ్చిన ప్రతి సినిమా కమిట్ చేయించేసి, నాతో ఓవర్ వర్క్ చేయించలేదు. వర్క్ని ఎంజాయ్ చెయ్ అన్నారు. నా పక్కన ఓ గైడింగ్ ఫోర్స్ (తండ్రిని ఉద్దేశించి) ఉండటంతో నాకెప్పుడూ 'అన్సేఫ్' అనిపించలేదు.

● షూటింగ్ స్పాట్లో స్టార్స్కి ఏర్పాటు చేసే 'కారవాన్' వాహన సౌకర్యం అప్పట్లో లేదు. పల్లెల్లో షూటింగ్స్ చేసినప్పుడు కాస్ట్యూమ్స్ మార్చుకోవడానికి, ఇతర వ్యక్తిగత విషయాలకూ పడిన ఇబ్బందుల గురించి?

మాకు బోలెడంత ప్రేమ దక్కేది. విలేజెస్లో ఎవరో ఒకరింట్లో కాస్ట్యూమ్స్ మార్చుకునేంత అభిమానం మా మీద ఉండేది. 'ఏం ఫర్వాలేదు. మీ ఇల్లులా అనుకోండి' అనేవాళ్లు. ఎలాంటి భయాలూ ఉండేవి కావు. ఇప్పుడున్నన్ని సౌకర్యాలు లేకపోయినా హ్యాపీగానే ఉండేది.

● అప్పట్లో సౌకర్యం లేకపోయినా హ్యాపీగానే గడిచిందన్నారు... సో.. ఇప్పుడు కారవాన్ తదితర సౌకర్యాలు పొందుతున్న నటీమణుల లైఫ్ ఇంకా హ్యాపీ అనుకోవచ్చా...

మాతో పోల్చుకుంటే ఇప్పటి అమ్మాయిలు హ్యాపీ కాదు. అన్ని సౌకర్యాలతో పాటు సమస్యలూ ఎక్కువే. ప్రతి క్షణం ఎవరో ఒకరు మనల్ని గమనిస్తున్న ఫీలింగ్. సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ వల్ల పబ్లిక్లోకి వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి. ఈ జనరేషన్కి ఆ ప్రెజర్ ఎక్కువ.

● మరి... ఈ ప్రెజర్ని ఎలా అధిగమించాలి?

ప్రపంచం మారిపోయింది. మనమూ అందుకు తగ్గట్టు మారాలి. పరిస్థితులు ఇలా ఉన్నాయేంటని భయపడకుండా మన జాగ్రత్తల్లో మనం ఉండటమే.

● నెగటివిటీ ఎక్కువ శాతం ఉన్న ఈ మోడ్రన్ వరల్డ్లో అమ్మాయిలు తమ లైఫ్ని ఎలా లీడ్ చేయాలంటారు?

ధైర్యంగా, గర్వంగా బతకాలి. ఎందుకంటే ఆ దేవుడు సృష్టించిన ప్రత్యేకమైనమనుషులం మనం. ఎక్కడ ఉన్నా మనం సౌకర్యంగా ఉండటం మనకు ముఖ్యం. సౌకర్యం అంటే లగ్జరీస్ కాదు. మనకు నచ్చినట్లుగా మనం ఉండటం. అలాగే మనం అనుకున్నది నిర్మొహమాటంగా చెప్పాలి. మన విలువని మనం తెలుసుకోవాలి. మనం మన గురించి ఏమనుకుంటున్నామో అదే మనం. తక్కువగా అనుకుంటే తక్కువగా... ఉన్నతంగా అనుకుంటే ఉన్నతంగా. అందుకే మన గురించి మనం ఉన్నతంగా అనుకోవాలి. ఆత్మవిశ్వాసంతో బతకాలి.

● ఇద్దరు అమ్మాయిల తల్లిగా మీ పిల్లలకు ఈ విషయాలు చెబుతుంటారా?

చెబుతాం. మా అమ్మాయిలకు బాగా స్వేచ్ఛ ఇస్తాం. వాళ్ల ఇష్టాలను కాదనం. వద్దని చెప్పాల్సి వస్తే ఎందుకు వద్దో చెబుతాం. ఎంత జాగ్రత్తగా ఉండాలో వివరిస్తాం. ఒకప్పుడు పెద్దలు చెప్పిన మాటలను పిల్లలు వినేవాళ్లు. ఇప్పుడు టెక్నాలజీ బాగా పెరిగిన ఈ కాలంలో పిల్లలు చెప్పేది కూడా పెద్దలు వినాలి. మేం మా పిల్లలతో బాగా కమ్యూనికేట్ అవుతాం. మా పిల్లలకే కాదు... ఎవరికైనా నేను చెప్పేదేంటంటే... ధైర్యంగా బతకాలి... ప్రశాంతంగా ఉండాలి.

– డి.జి. భవాని

అప్పుడే మహిళ ఎదిగినట్లు లెక్క!

– శ్రుతీహాసన్



"సమస్య ఎక్కడైనా ఉంటుంది. ఎలా ఎదుర్కొంటున్నామన్నదే ముఖ్యం. సమస్యలకు భయపడి పారిపోతే ఓడిపోతాం... ధైర్యంగా ఎదుర్కొంటే గెలుస్తాం" అంటున్నారు శ్రుతీహాసన్. తన తల్లి సారిక సినిమాలు చేసినప్పటి పరిస్థితులను, ఇప్పటి పరిస్థితులను పోల్చి కొన్ని విషయాలు చెప్పారు శ్రుతి. ఇంకా 'మహిళా దినోత్సవం' సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో శ్రుతీహాసన్ చెప్పిన విషయాలు తెలుసుకుందాం.

● మీ అమ్మగారి కెరీర్ని చూశారు... అప్పటి ఆమె కెరీర్ పరిస్థితులను ఇప్పటి మీ కెరీర్తో పోల్చుకున్నప్పుడు ఏమనిపిస్తోంది?

అప్పటి పరిస్థితుల గురించి అమ్మ నాతో చెప్పేవారు. 'ఈక్వాలిటీ' విషయంలో అప్పుడు ప్రాబ్లమ్ ఉండేదట. ఉమెన్కి చాలా తక్కువ ప్రాధాన్యం ఉండేదట. అలాగే అప్పట్లో 'పీరియడ్స్' గురించి బాహాటంగా మాట్లాడడానికి సిగ్గుపడేవాళ్లు. అసలు బయటకు చెప్పకూడదన్నట్లు ఉండేది. ఇబ్బందిగా ఉన్నా బయటకు చెప్పకుండా షూటింగ్ చేసేవాళ్లు. ఇప్పుడు పీరియడ్స్ ఇబ్బంది గురించి ఓపెన్గా చెప్పి, ఆ రోజు పని మానుకునే వీలు ఉంది.

● మరి... మీ జనరేషన్ హీరోయిన్లతో పోల్చితే అప్పటివారు ఏ విషయంలో హ్యాపీ?

మాటల విషయంలో... అప్పట్లో కాస్త ఓపెన్గా మాట్లాడగలిగేవాళ్లు. కానీ ఇప్పుడు ఏం మాట్లాడితే ఏం వస్తుందోనని మాటలకు కత్తెర పెట్టాల్సిన పరిస్థితి. అయితే నేనలా కాదు. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతాను. అది అందరికీ తెలిసిన విషయమే. సోషల్ మీడియా వల్ల ఏం మాట్లాడలేక పోతున్నారు. అన్ని కళ్లూ మనల్నే చూస్తున్న ఫీలింగ్. అంతెందుకు? పదిహేనేళ్ల క్రితం నేను కెరీర్ స్టార్ట్ చేసినప్పుడు ఇలా లేదు. రిలాక్సింగ్గా ఉండేది. ఇప్పుడు ఫొటోలు తీసేసి, సోషల్ మీడియాలో పెట్టేస్తున్నారు. ఆ ప్రెజర్ చాలా ఉంది. ఈ ఒత్తిడి వల్ల పబ్లిక్లోకి వచ్చినప్పుడు చాలామంది ఎక్కువ జాగ్రత్తగా ఉంటున్నారు. మా అమ్మ జనరేషన్లో ఉన్నంత కూల్గా ఉండలేని పరిస్థితి. ఇంకా చెప్పాలంటే స్కూల్ పిల్లలకు కూడా తిప్పలు తప్పడంలేదు. 'అలా ఉన్నావు... ఇలా ఉన్నావు' అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. ఇలా చిన్నప్పుడే ప్రెజర్ మొదలైపోతోంది. అయితే ఇప్పటి ఈ పరిస్థితిని నేను విమర్శించడంలేదు. మార్పుని స్వీకరించడమే.

● ఇండస్ట్రీలో 'క్యాస్టింగ్ కౌచ్' ఎదుర్కొన్న నటీమణులు చాలామంది ఉన్నారు... మీకు అలాంటివి?

నాకలాంటి చేదు అనుభవాలు లేవు. ఒకవేళ నాకు నచ్చని పరిస్థితి ఎదురైందంటే నిర్మొహమాటంగా చెప్పేస్తాను. నా పాలసీ ఒక్కటే. నేను ఎవరినైనా ఇష్టపడితే టూ హండ్రెడ్ పర్సెంట్ ఇష్టపడతాను... నాకు కంఫర్ట్గా ఉన్న చోట ఉంటాను. నాకు నచ్చని చోట ఉండను... నచ్చని మనుషులను నా లైఫ్లో నుంచి ఎగ్జిట్ చేసేస్తాను. ఇంకో విషయం ఏంటంటే... మనకు ఏదైనా నచ్చలేదనుకోండి గొడవ పడక్కర్లేదు... అరిచి చెప్పక్కర్లేదు. 'నాకు నచ్చలేదు' అని కూల్గా చెప్పి, సమస్యకు ఫుల్స్టాప్ పెట్టేయాలి.

● మీలా చాలామంది ధైర్యంగా ఉండలేరు... నిర్భయంగా మాట్లాడలేరు... వారికి మీరిచ్చే సలహా?

భయాలు వదలండి. దయచేసి మీ మనసులోని సమస్యలను బయటకు చెప్పండి. మనసులోనే ఉంచుకుంటే ఆరోగ్యం చెడిపోతుంది. మనకు ఫ్యామిలీ మెంబర్స్, ఫ్రెండ్స్ ఉంటారు. వాళ్లతో షేర్ చేసుకోవాలి. అయితే వారికన్నా కూడా ఒక మంచి కౌన్సెలర్ అవసరం. వాళ్లయితే మన మానసిక స్థితిని బాగా అర్థం చేసుకుని సలహాలు ఇవ్వగలుగుతారు. ఫిజికల్గా హెల్దీగా ఉండాలంటే 'మెంటల్ హెల్త్' చాలా ముఖ్యం.

● కమల్హాసన్గారి కూతురు కావడం వల్లే మీకు ఇండస్ట్రీలో ఇబ్బందులు ఎదురు కాలేదనుకోవచ్చా?

బ్యాక్గ్రౌండ్ అనేది ప్లస్సే... కాదనడం లేదు. నాన్నగారి పేరు నాకు హెల్ప్ అయింది. అయితే శ్రుతీహాసన్ అంటే కమల్హాసన్ కూతురు అనే విషయాన్ని మరచిపోయేలా చేయాలి. అప్పుడే నేను సక్సెస్ అయినట్లు. నా వర్క్తో నేను నిరూపించుకుని నాకంటూ పేరు తెచ్చుకున్నాను. పని పరమైన ఇబ్బందులు కామన్. అలాంటివి ఎప్పుడూ మా నాన్నగారికి చెప్పలేదు. నేనే సాల్వ్ చేసుకుంటుంటాను.

సినిమా ఇండస్ట్రీలో టెక్నికల్ డిపార్ట్మెంట్లో మహిళలు తక్కువగా ఉండటానికి కారణం?

ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు మహిళల శాతం ఎక్కువే ఉంది. లేడీ టెక్నీషియన్స్ ఇంకా పెరుగుతారు. అంతెందుకు? నేను ఈ మధ్య లీడ్ రోల్ చేసిన 'ది ఐ' మూవీకి డైరెక్టర్, ప్రొడ్యూసర్, ఇంకా ఇతర విభాగాల్లో మహిళలే ఎక్కువ. ఆ విధంగా ఈ సినిమా నాకు స్పెషల్.

● 'మహిళా దినోత్సవం' జరుపుకుంటారా?

నా ఫ్రెండ్స్తో 'అన్ని రోజులూ మనవే' అంటుంటాను. 'మేల్ డే' అని లేదు. మరి... 'ఉమెన్స్ డే' ఎందుకు? అంటే... ఇంకా స్త్రీ వెనకబడి ఉన్నట్లేనా? అలాగే 'ఉమెన్ ఓరియంటెడ్' సినిమా అంటారు. 'మేల్ ఓరియంటెడ్' మూవీ అనరు. ముందు ఈ తేడా పోవాలి. మహిళా దినోత్సవం అనేది ప్రత్యేకంగా లేని రోజున ఉమెన్ ఎదిగినట్లు లెక్క.



కార్పొరేట్ మహారాణులు

దేశంలోని కార్పొరేట్ కంపెనీల్లో మహిళల శాతం పెరుగుతోంది. ప్రత్యేకించి జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్లోని లిస్టయిన 2,458 కంపెనీల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా అతివలు రాణిస్తున్నారు. ఇక్కడ ఆసక్తికర అంశం ఏమిటంటే.. 2025 ఫిబ్రవరి 28 నాటికి మార్కెట్ క్యాపిటల్ ఎక్కువ ఉన్న కంపెనీల్లో కంటే తక్కువ ఉన్న చిన్న కంపెనీల్లోనే మహిళా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల (ఈడీ) శాతం ఎక్కువ ఉంది. మార్కెట్ విలువ పరంగా టాప్ 25 కంపెనీల్లోని వీరి శాతం కంటే... ఈ జాబితాలో అట్టడుగున ఉన్న 25 కంపెనీల్లో మహిళా ఈడీల శాతం దాదాపు రెట్టింపు ఉంది.

కంపెనీ విభాగం	మహిళా ఈడీల శాతం
టాప్ - 25 కంపెనీలు	7.9
తరవాతి 25	9.5
ఆ తరవాతి 25	12.4
ఆఖరి 25 కంపెనీలు	14.5

ఆధారం: ప్రైమ్ డేటాబేస్, క్యాపిటలైన్

మార్గదర్శి, రామోజీది 45 ఏళ్ల నయవంచన

వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందే

- తెలంగాణ హైకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి వాదనలు
- ఫైనాన్షియర్స్కు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల వత్తాసు
- సుప్రీంకోర్టు సూచన మేరకే ప్రతివాదిగా రిజర్వ్ బ్యాంక్
- మార్గదర్శి అక్రమాలకు పాల్పడిందని ఆర్బీఐ తేల్చింది
- క్రిమినల్ చర్యలకు హెచ్యూఎఫ్ సభ్యులూ బాధ్యులే
- కఠిన శిక్ష విధించకుంటే ఇలాగే ఫైనాన్షియర్లు పుట్టుకొస్తారు
- దేశమే ప్రమాదంలో పడిపోయే ప్రమాదం ఉంటుంది
- 'మార్గదర్శి' కేసులో వాదనలు వినిపించిన అరుణ్కుమార్
- అనుబంధ పిటిషన్పై తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం
- మార్గదర్శి ఫైనాన్షియర్ డబ్బులు ఎగ్గొట్టింది
- నా వాదనలు వినాలంటూ కోర్టును కోరిన న్యాయవాది లక్ష్మీనరసింహారావు
- లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశం

సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్యూఎఫ్) కర్త రామోజీరావుల అక్రమ డిపాజిట్ల వసూళ్ల వ్యవహారం 45 ఏళ్ల నయవంచన అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ శుక్రవారం తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. ఏపీలోని గత ప్రభుత్వం మార్గదర్శి అక్రమాలపై విచారణ కోసం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మార్గదర్శి ఫైనాన్షియర్స్ను కాపాడేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణ సర్కారు కూడా దీనికి తానతందాన అంటోందని తెలిపారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల వసూళ్లు అక్రమమేనని ఆర్బీఐ చాలా స్పష్టంగా ఈ కోర్టుకు చెప్పిందన్నారు. ఇప్పుడు కూడా మార్గదర్శిపై కఠిన చర్యలు చేపట్టకుంటే భవిష్యత్కు తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. రామోజీ అక్రమాలకు హెచ్యూఎఫ్ సభ్యులు కూడా బాధ్యులేనని చెప్పారు. హెచ్యూఎఫ్ కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్ కార్యకలాపాలు చేపట్టినందున కర్త రామోజీరావు మాత్రమే బాధ్యుడని, ఇతర కుటుంబ సభ్యులకు సంబంధం ఉండదంటూ ఆ సంస్థ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్పై అన్ని పక్షాల వాదనలు విన్న జస్టిస్ పి.శ్యాం కోషి, జస్టిస్ కలాసికం సుజనలతో కూడిన హైకోర్టు ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అంతకుముందు ఉండవల్లి తన వాదనలను కొనసాగించారు.

ఇష్టారాజ్యంగా వసూళ్లు..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఇలా వేటి అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ను నడిపించారని, ఇదేమని అడిగేవారు లేకుండా తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారని ఉండవల్లి పేర్కొన్నారు. ''రాష్ట్రంలోనే అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి రామోజీ కావడం, వెంట ఆయన మీడియా మాఫియా ఉండడంతో బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడారు. ఫిర్యాదు చేసినా రామోజీపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. 2004 తర్వాత బోగస్ బ్యాంక్ల బండారం బయటపడుతుండడంతో మార్గదర్శి అక్రమాలపై కూడా విచారణ జరపాలని నాటి సీఎం వైఎస్ రాజశేఖర్రెడ్డి నిర్ణయించారు. మార్గదర్శిపై విచారణ ప్రారంభమైన నాటి నుంచి వైఎస్సార్పై రామోజీరావు తన మీడియాలో అనుచిత వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే నా తల్లికి మార్గదర్శి నుంచి వచ్చిన చెక్, దానిపై ఉన్న సంతకాలను పరిశీలించగా అవకతవకలన్నీ బయటపడ్డాయి. దీంతో నేను ఫిర్యాదు చేసి, నిజం తేల్చేందుకు 18 ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నా'' అని ఉండవల్లి కోర్టుకు నివేదించారు.

ఐటీ శాఖ కనీసం పట్టించుకోలేదు..

''కర్త మరణించి, వ్యాపారం ఆగిపోతే ఎలా చర్యలు చేపట్టాలనేది ఆలోచించవచ్చు. రామోజీ చనిపోయినా హెచ్యూఎఫ్ వ్యాపారాన్ని వారసులు కొనసాగిస్తూ లబ్ధి పొందుతున్నారు. ఇదో హత్య కేసు లాంటిది. నిందితుడు చనిపోతే ఇక కేసు ఉండదని మార్గదర్శి న్యాయవాదులు చెప్పడం విడ్డూరం. దేశంలోని అన్ని హెచ్యూఎఫ్ల నుంచి ఆదాయపు పన్ను శాఖ పన్ను వసూలు చేస్తోంది. వాటి సిబిల్ స్కోరు, ఆదాయ వ్యయాలపై పరిశీలన చేస్తుంది. ఈనాడు, ఈటీవీ, ఫిలిం సిటీ.. ఇలా అన్నీ కలిపి దాదాపు రూ.1,359 నష్టాల్లో ఉన్నాయి. ఇవన్నీ సాంకేతిక నష్టాలని మార్గదర్శి చెబుతోంది. ఇంత జరిగినా ఆదాయ పన్ను శాఖ కనీసం హెచ్యూఎఫ్ వ్యాపారంపై స్టే కూడా కోరడం లేదు. టీడీఎస్ ప్రస్తావనే లేదు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీలో ఉన్న ప్రభుత్వాలకు మీడియా మాటున అక్రమాలు చెలాయిస్తున్న మార్గదర్శిపై ప్రత్యేక అభిమానం ఉంది'' అని ఉండవల్లి వాదించారు. ఈ కేసులో ఆర్బీఐని తాను ప్రతివాదిగా తొలుత చేర్చలేదని.. ఇది ఓ కుంభకోణంలా కనిపిస్తోందని, ఆర్బీఐని ప్రతివాదిగా చేర్చాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని వివరించారు. ''అక్రమాలు, అవకతవకలు జరిగాయా? లేదా? చట్టప్రకారమే జరిగిందా? తేల్చాల్సింది ఆర్బీఐ కదా అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి డిపాజిట్ల వసూలు అక్రమమేనని ఆర్బీఐ తేల్చింది'' అని ఉండవల్లి పేర్కొన్నారు.

బాధ్యత నుంచి పారిపోలేరు

రామోజీరావు మరణించినా.. అక్రమాల కారణంగా లబ్ధి పొందినవారు ఉన్నారు. ఆ లబ్ధిని అనుభవిస్తూ మాకేం సంబంధం లేదని వారు తప్పించుకోలేరు. ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ను ఉల్లంఘించారని ఆర్బీఐ స్పష్టంగా చెబుతోంది. తన కుటుంబ సభ్యుల కోసమే సేకరిస్తున్నా అన్నట్లు రామోజీరావు 22 మంది కుటుంబసభ్యుల పేర్లను కూడా హెచ్యూఎఫ్లో చేర్చారు. అలాంటప్పుడు వారు బాధ్యత నుంచి పారిపోలేరు.

తండ్రి లోన్ తీసుకుని చనిపోతే కుటుంబం బాధ్యులు కారా?

తండ్రి బ్యాంక్ లోన్ తీసుకుని మరణిస్తే.. కుటుంబసభ్యులను బాధ్యులను చేయరా? రామోజీ అక్రమాలకు కుటుంబసభ్యులు కచ్చితంగా బాధ్యులే. వారు శిక్ష అనుభవించాల్సిందే. కాదని.. ఇలానే ప్రోత్సహిస్తే.. దీన్ని అసరాగా తీసుకుని ఇలాంటి ఫైనాన్షియర్లు ఎన్నో పుట్టుకొస్తాయి. అప్పుడు ఈ దేశమే తీవ్ర ప్రమాదంలో పడిపోతుంది. భవిష్యత్లో ప్రజల డిపాజిట్లకు గ్యారెంటీ లేకుండా పోతుంది.

–మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్కుమార్



లూథ్రాను మందలించిన ధర్మాసనం

ఉండవల్లి వాదనలు వినిపిస్తుండగా, మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా పదేపదే అడ్డుపడ్డారు. సీనియర్ న్యాయవాది అయి ఉండి ఇలా కలుగజేసుకోవడం సరికాదని ఆయన్ని ధర్మాసనం మందలించింది. ఉండవల్లి వాదనలు ముగిసేవరకు ఆగాలని ఆదేశించింది. తర్వాత ఏపీ ప్రభుత్వ న్యాయవాది రాజేశ్వర్రెడ్డి వాదనలు వినిపించారు. ఉండవల్లి వాదనలను తోసిపుచ్చారు. హెచ్యూఎఫ్ వ్యక్తి కాదని, విచారణ సాధ్యం కాదని మార్గదర్శి న్యాయవాది నాగముత్తు చెప్పారు. కర్త అక్రమాలకు హెచ్యూఎఫ్ సభ్యులు బాధ్యత వహించరని పేర్కొన్నారు.

నాకు డబ్బులు చెల్లించలేదు...

అందరి వాదనలు పూర్తయిన తరువాత లక్ష్మీనరసింహారావు అనే న్యాయవాది జోక్యం చేసుకున్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తన డబ్బు తిరిగివ్వలేదని ఆర్బీఐకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనను కూడా ఈ పిటిషన్లలో ప్రతివాదిగా చేర్చుకుని, వాదనలు వినాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ, అప్పటికే తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించామని, వాదనలను లిఖితపూర్వకంగా అందజేయాలని ఆదేశించింది.

మహిళలకు భయం తప్ప భరోసా లేదు!

వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి శ్యామల ధ్వజం



సాక్షి,అమరావతి: రాష్ట్రంలోని మహిళలకు భయం తప్ప భరోసా లేదని వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి ఎ.శ్యామల ధ్వజమెత్తారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మహిళల రక్షణ, భద్రతకు పెద్దపీట వేస్తే ఈ ప్రభుత్వంలో కనీస రక్షణ కూడా కరువైందన్నారు. సమాన హక్కులు, అవకాశాలు, అధికారాల కోసం మహిళలంతా గొంతెత్తి ప్రశ్నిస్తున్న తరుణంలో ఏపీలో భద్రత కోసం మహిళలు దిక్కులు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

హైకోర్టులో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



మహిళా న్యాయమూర్తులను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు న్యాయవాదుల సంఘం, హైకోర్టు ఉద్యోగుల సంఘం, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టులో మహిళా న్యాయమూర్తులైన జస్టిస్ బీఎస్ భానుమతి, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ మండవ కిరణ్మయిలను న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షుడు ఎన్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి తదితరులు మహిళా కార్యవర్గ సభ్యులతో కలిసి న్యాయమూర్తులను సన్మానించారు. మరోవైపు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి, మహిళా న్యాయమూర్తులను సత్కరించారు.

అడుగడుగునా అవాంతరమా!?

శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స ఆగ్రహం

అధికార పక్ష సభ్యుల తీరుతో సభ నుంచి వాకౌట్



మండలి నుంచి వాకౌట్ చేసి వస్తున్న వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి : 'బడ్జెట్పై మాట్లాడేందుకు నాకు సభ ఇచ్చిన సమయంలో మీరు నా ప్రతి మాటకు అడ్డుతగులుతారా? వాస్తవ విరుద్ధమైన బడ్జెట్ను ప్రజలపై రుద్ది, ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయకుండా, మీరు చేస్తున్న మోసాలను ప్రజలకు చెబుతుంటే అడుగడుగునా అవాంతరం సృష్టిస్తారా? ఇదేం పద్ధతి? ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాన్ని వినలేరా? మేం మాట్లాడం, మీరే మాట్లాడుకోండి. వెళ్లిపోతున్నాం'.. అంటూ శాసన మండలిలో శుక్రవారం ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రులు, అధికార పక్ష సభ్యుల వింత వైఖరిని నిరసిస్తూ వాకౌట్ చేశారు. అంతకుముందు సభలో బొత్స సత్యనారాయణ బడ్జెట్పై ప్రభుత్వ విధానాన్ని, సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపులు చేయకపోవడాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ఈ క్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పదేపదే ప్రతిపక్ష నేత ప్రసంగానికి అంతరాయం కలిగిస్తూ మధ్యలో గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దీనిపై బొత్స అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి తనను అడ్డుకోవడంపై మండిపడ్డారు. టీడీపీ శాసన మండలి చీఫ్విప్ పంచుమర్తి అనురాధ సైతం టైం అయిపోయిందంటూ రన్నింగ్ కామెంట్రీ చేయగా.. 'నాకు సమయంతో పనిలేదు. మీ ఆర్థికమంత్రి మాట్లాడతానంటే నేను కూర్చుంటా' అంటూ కౌంటర్ ఇచ్చారు. దీనికి ఆర్థిక మంత్రి స్పందిస్తూ.. మీకు చైర్మన్ సమయం ఇస్తారని చెప్పగా, అలాంటప్పుడు చీఫ్విప్ నా సమయం గురించి మాట్లాడొచ్చా అని చురకలు అంటించారు. చివరికి.. చైర్మన్ పది నిమిషాల్లో ప్రసంగం ముగించాలని సూచించగా అధికార పక్ష సభ్యులు పదేపదే అడ్డుతగిలారు.

కరెంట్ చార్జీలు పెంచబోమంటూనే బాదుడు..

ఇక 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో విద్యుత్ రంగంలో రూ.56 వేల కోట్లు అప్పుచేస్తే, 2019–24లో రూ.36వేల కోట్లు మాత్రమే చేశామన్నారు. ఇప్పుడున్న రూ.1.22 లక్షల కోట్ల అప్పులో చంద్రబాబు వాటా కూడా కలిసే ఉందన్నారు. ఇక టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమని చెప్పి రూ.15వేల కోట్లు ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై వేయడం దారుణమన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలోనే టూఅప్ చార్జీల వేశారని, విద్యుత్ చార్జీలు పెంచారని ఆరోపించారు. ఇందుకు బొత్స కౌంటర్ ఇస్తూ.. 'డిస్కంలకు ఆర్థిక ఇబ్బందులు తొలగించడంలో రూ.15వేల కోట్లు ప్రభుత్వం ఇవ్వలేదా? ప్రజలపై భారం వేయడం ఎందుకు?'అని ప్రశ్నించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	8	74,333
నిఫ్టీ △	8	22,553

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,924	▽	145
డోజోన్స్	42,234	▽	345
ఎఫ్‌టీఎస్ఈ 100	8,680	▽	3
డాక్స్	23,009	▽	411
షాంఘై	3,373	▽	9
నికాయ్	36,887	▽	818

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,059	△	183
బంగారం (99.5 స్వచ్ఛత)	85,714	△	182
వెండి (కిలో)	96,724	△	264

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.70	87.72
£	బ్రిటన్ పౌండ్		111.00	113.85
€	యూరో		92.92	95.59
¥	జపాన్ ఎన్ (100)		58.38	59.88
AU$	ఆస్ట్రేలియా డాలర్		53.91	56.12
S$	సింగపూర్ డాలర్		62.97	67.66
SAR	సౌదీ రియాల్		27.27	23.82
UAE D	యూఏఈ దిర్హామ్		22.76	24.54
¥	చైనా యువాన్		11.13	12.96



మహిళలు.. ‘ఫండ్’ రాణులు!

మ్యూచువల్ ఫండ్ మేనేజర్లుగా సత్తా చాటుతున్న మగువలు

- 49కి ఎగబాకిన మహిళా ఫండ్ మేనేజర్ల సంఖ్య..
- వారి నిర్వహణలోని ఆస్తుల విలువ ఏడాదిలో రెట్టింపు..
- జనవరి నాటికి రూ.13.45 లక్షల కోట్లకు జంప్..

అన్ని రంగాల్లోనూ ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న మగువలు... స్టాక్ మార్కెట్లోనూ తగ్గేదేలే అంటూ ‘బుల్ రైడ్ చేస్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో ఇన్వెస్టర్ల నిధులను పక్కాగా నిర్వహిస్తూ ఫండ్ మేనేజర్లుగా సత్తా చాటుతున్నారు. తాము ఇంటినే కాదు.. అవకాశమిస్తే, ఫండ్ హౌస్‌లను కూడా మగాళ్లకు దీటుగా చక్కబెట్టగలమని నిరూపించుకుంటున్నారు. మహిళల నిర్వహణలో ఉన్న ఫండ్ ఆస్తులు ‘ఇంతింతై.. అన్నట్లుగా ఏడాది వ్యవధిలో రెట్టింపై రూ.13.45 లక్షల కోట్లకు ఎగబాకడం విశేషం!! అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఎఫ్ రంగంలో రాణిస్తున్న అతివలపై స్పెషల్ ఫోకస్...

– సాక్షి, బిజినెస్ డెస్క్

దేశంలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ దూకుడు లాగే.. మహిళా ఫండ్ మేనేజర్లు కూడా జోరు పెంచారు. ఈ ఏడాది జనవరి నాటికి వారి సంఖ్య 49కి పెరిగింది. ఏడాది క్రితం ఉన్న 42 మందితో పోలిస్తే కొత్తగా ఏడుగురు జతయ్యారు. ఇదే కాలంలో మగ ఫండ్ మేనేజర్లు ఇద్దరు మాత్రమే పెరగడం గమనార్హం. ఇక మగువల నిర్వహణలో ఉన్న ఫండ్ ఆస్తులు కూడా రూ.13.45 లక్షల కోట్లకు ఎగిశాయి. గతేడాది జనవరితో పోలిస్తే రెట్టింపైంది. దేశంలో ఎంఎఫ్ సంస్థల నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు (ఏయూఎం) రూ.67.25 లక్షల కోట్లు కాగా, ఇందులో మహిళా ఫండ్ మేనేజర్లు/కో–ఫండ్ మేనేజర్లు నిర్వహిస్తున్న అసెట్స్ విలువ 20 శాతానికి జంప్ చేసింది. అయితే, మొత్తం ఎంఎఫ్ ఫండ్ మేనేజర్లు 482 మందిలో మహిళల వాటా ఇంకా తక్కువగానే ఉన్నప్పటికీ, గత ఏడాది కాలంలో మగాళ్లతో పోలిస్తే మగువల సంఖ్య ఎక్కువగా పెరగడం ఈ రంగంలో వారి భవిష్యత్తుపై మరింత ఆశలు రేకెత్తిస్తోంది.

25 ఎంఎఫ్‌లు... 339 స్కీమ్‌లు

దేశవ్యాప్తంగా 25 మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో అతివలు ఫండ్ మేనేజర్లుగా రాణిస్తున్నారు. మొత్తం 339 ఫండ్ స్కీమ్‌లను మేనేజ్ చేస్తున్నారు. కాగా, 6 ఫండ్ సంస్థల్లో ముగ్గురు కంటే ఎక్కువ మహిళా ఫండ్ మేనేజర్లు ఉండగా, 6 ఫండ్ హౌస్‌లలో ఇద్దరు చొప్పున, 13 సంస్థల్లో కనీసం ఒకరు ఉన్నారు. అన్నింటికంటే ఎక్కువగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్‌లో ఏడుగురు మహిళా ఫండ్ మేనేజర్లు రూ.2.27 లక్షల కోట్ల విలువైన 66 స్కీమ్‌లను నిర్వహిస్తున్నారు. భారత్‌లో అతిపెద్ద ఫండ్ హౌస్‌గా నిలుస్తున్న ఎస్‌బీఐ ఎంఎఫ్‌లో ఐదుగురు మగువలు రూ.1.88 లక్షల కోట్ల ఆస్తులను (14 స్కీమ్‌లు) మేనేజ్ చేస్తున్నారు. ఇక నిప్పన్ ఇండియా ఎంఎఫ్‌లో ఇద్దరు అతివలు రూ.1.53 లక్షల కోట్ల అసెట్‌లను (26 స్కీమ్‌లు) నిర్వహిస్తున్నారు.

రూ.6.13 లక్షల కోట్లు ...

తాజా గణాంకాల ప్రకారం దేశంలోని 49 మహిళా ఫండ్ మేనేజర్లలో టాప్–5 మగువలు మేనేజ్ చేస్తున్న ఫండ్ అసెట్స్ రూ.6.13 లక్షల కోట్లు (45.55 శాతం)గా ఉంది. ఇందులో ఎస్‌బీఐ ఎంఎఫ్‌కు చెందిన మాన్సి సజేజా రూ.1.41 లక్షల కోట్ల అసెట్‌లను నిర్వహిస్తూ.. భారత్‌లో నంబర్ వన్ మహిళా ఫండ్ మేనేజర్‌గా నిలిచారు. నిప్పన్ ఇండియా ఎంఎఫ్ కింజల్ దేశాయ్ (రూ.1.37 లక్షల కోట్ల అసెట్స్), యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కృష్ణా ఎన్ (రూ.1.34 లక్షల కోట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. ఇక ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ అశ్విని షిండే 47 స్కీమ్‌లతో అత్యధిక స్కీమ్‌లను మేనేజ్ చేస్తున్న వారిలో టాప్‌లో ఉన్నారు. తర్వాత స్థానాల్లో మిరే అసెట్ ఇండియా ఎంఎఫ్ ఏక్తా గాలా (30 స్కీమ్‌లు), నిప్పన్ ఇండియా ఎంఎఫ్ కింజల్ దేశాయ్ (24 స్కీమ్‌లు) నిలిచారు. పురుషుల విషయానికొస్తే.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్‌కు చెందిన మనీష్ బాంతియా రూ.3.49 లక్షల కోట్ల అసెట్లను మేనేజ్ చేస్తూ.. దేశంలో టాప్ ఫండ్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు.

రూ.67.25 లక్షల కోట్లు	ఎంఎఫ్ సంస్థల నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు (ఏయూఎం)
20%	మొత్తం ఎంఎఫ్ ఏయూఎంలో మహిళా ఫండ్ మేనేజర్ల వాటా
18.8 కోట్లు	జనవరి నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య
22.92 కోట్లు	ప్రస్తుతం ఉన్న మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోల (ఖాతాల) సంఖ్య

టాప్ - 5 మహిళా ఫండ్ మేనేజర్లు

● ఫండ్ సంస్థ ● మేనేజ్ చేస్తున్న స్కీమ్‌లు ● నిర్వహణలోని అసెట్స్ (రూ. కోట్లలో)

పేరు	ఫండ్ సంస్థ	నిర్వహణలోని అసెట్స్ (రూ. కోట్లలో)	మేనేజ్ చేస్తున్న స్కీమ్‌లు
మాన్సి సజేజా	ఎస్‌బీఐ ఎంఎఫ్	1,40,747	6
కింజల్ దేశాయ్	నిప్పన్ ఇండియా	1,37,049	24
కృష్ణా ఎన్	యాక్సిస్ ఎంఎఫ్	1,35,378	22
అశ్విని షిండే	ఐసీఐసీఐ ప్రు ఎంఎఫ్	1,02,609	47
రోష్ని జైన్	హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్	97,068	3

ఇన్వెస్టర్లుగానూ...

ఇటీవల కాలంలో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంతో పాటు ట్రేడింగ్ చేస్తున్న అతివల సంఖ్య కూడా భారీగా పెరుగుతూ వస్తోంది. 2021 నుంచి చూస్తే ఏటా కొత్తగా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు జతవగా.. ప్రతి నలుగురు ఇన్వెస్టర్లలో ఇప్పుడు 1 మహిళా ఇన్వెస్టర్ ఉండటం వారి జోరుకు నిదర్శనం. జనవరి నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 18.8 కోట్లకు చేరుకుంది. ఇందులో దాదాపు 23.9 శాతం మహిళలవే కావడం గమనార్హం. కాగా, మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోల (ఖాతాల) సంఖ్య 22.92 కోట్లకు చేరింది. 2021 మే నెలలో తొలిసారి 10 కోట్ల మైలురాయిని చేరగా.. నాలుగేళ్లలోనే దాదాపు 13 కోట్ల ఫోలియోలు కొత్తగా జతవ్వడం ఫండ్స్‌లోకి పెట్టుబడులు ఏ రేంజ్‌లో వచ్చి పడుతున్నాయనేందుకు నిదర్శనం.



బీవోబీ గ్లోబల్ ఉమెన్ ఎన్‌ఆర్‌ఈ, ఎన్‌ఆర్‌వో ఖాతా

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభం

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) మహిళల కోసం ప్రత్యేకంగా.. ‘బీవోబీ గ్లోబల్ ఉమెన్ ఎన్‌ఆర్‌ఈ అండ్ ఎన్‌ఆర్‌వో సేవింగ్స్ ఖాతాను’ ప్రారంభించింది. ఆటో స్వీప్ సదుపాయంతో ఇది ఉంటుంది. తద్వారా ఖాతాలో పరిమితికి మించి ఉన్న బ్యాలెన్స్ డిపాజిట్‌గా మారిపోయి, అధిక వడ్డీ రాబడి లభిస్తుంది. అలాగే, ఈ ఖాతాదారులకు గృహ రుణాలు, ఆటో రుణాలపై రాయితీ రేట్లు, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు ఉంటాయని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. 17 దేశాల్లో 60,000 టచ్ పాయింట్ల ద్వారా 16.5 కోట్ల అంతర్జాతీయ కస్టమర్లకు బీవోబీ సేవలు అందిస్తోంది. బీవోబీ ప్రీమియం ఎన్‌ఆర్‌ఈ, ఎన్‌ఆర్‌వో సేవింగ్స్ ఖాతా విషయంలోనూ మార్పులు చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయంగా ఉన్న భారతీయ మహిళలకు ప్రీమియం బ్యాంకింగ్ సేవలను అందించే లక్ష్యంతో బీవోబీ ఉమెన్ ఎన్‌ఆర్‌ఈ అండ్ ఎన్‌ఆర్‌వో ఖాతాను రూపొందించినట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా ఈడీ మీనా వహీద్ ప్రకటించారు.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..
టెక్ అంకురాల్లోనూ మహిళల హవా..!
సమిష్టి కృషితోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కి చెక్



100 రైల్వే స్టేషన్లలో స్విగ్గీ డెలివరీ సేవలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లోని 100 రైల్వే స్టేషన్లకు ఫుడ్ డెలివరీ సేవలను విస్తరించినట్లు స్విగ్గీ వెల్లడించింది. రాబోయే రోజుల్లో మరిన్ని స్టేషన్లలో ఈ సర్వీసులను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం, వివిధ రకాల ఆహార పదార్థాలను అందించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ వివరించారు. రైలు ప్రయాణికులకు ఆహారాన్ని డెలివరీ చేసేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్‌తో (ఐఆర్‌సీటీసీ) 2024లో స్విగ్గీ చేతులు కలిపింది.

అమెరికాలో టెక్ మహీంద్రా విస్తరణ

టెక్సాస్‌లో కార్యాలయం ఏర్పాటు



న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తాజాగా టెక్సాస్‌లోని ప్లానోలో ఆఫీసు ఏర్పాటు చేసింది. ఇది 130 సీట్ల సామర్థ్యంతో 27,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటైంది. అమెరికాలో ఇది తమకు పంతొమ్మిదో కార్యాలయమని సంస్థ తెలిపింది. కన్సల్టింగ్, డెలివరీ, కస్టమర్ సపోర్ట్ సర్వీసులు మొదలైన సర్వీసులు దీని ద్వారా అందించనున్నట్లు వివరించింది. ఇదే ప్రాంగణంలో ఇన్నోవేషన్ ల్యాబ్‌ను కూడా ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతం 90 పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న టెక్ మహీంద్రాలో 1,50,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు.

ఆరంభ లాభాలు ఆవిరి

ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ సూచీలు


ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు శుక్రవారం ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ ఎనిమిది పాయింట్లు నష్టపోయి 74,333 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఎనిమిది పాయింట్ల స్వల్ప లాభంతో 22,553 వద్ద నిలిచింది. ట్రంప్ తాజా టారిఫ్‌ల విధింపు నిర్ణయాలు ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు.., తేరుకొని లాభాలు ఆర్జించాయి. ఒక దశలో సెన్సెక్స్ 246 పాయింట్లు పెరిగి 74,586 వద్ద, నిఫ్టీ 89 పాయింట్లు బలపడి 22,634 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. మిడ్ సెషన్ నుంచి అమ్మకాలు పెరగడంతో లాభాలన్నీ మాయమయ్యాయి. చిన్న కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, మిడ్ క్యాప్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- పలు అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలు రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు టార్గెట్ ధరను పెంచడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రాణించింది. బీఎస్ఈలో 3% పెరిగి రూ.1249 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 4% లాభపడి రూ.1255 వద్ద గరిష్టాన్ని తాకింది.



రూపాయి 17 పైసలు అప్

86.95 వద్ద ముగింపు



వారాంతాన దేశీ కరెన్సీ బలపడింది. డాలరుతో మారకంలో 17 పైసలు బలపడి 86.95 వద్ద ముగిసింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ తాజాగా 5 నెలల కనిష్టానికి చేరడం రూపాయికి జోష్‌నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. చమురు ధరలు నీరసించడం దీనికి జత కలసినట్లు తెలియజేశాయి. డాలరు ఇండెక్స్ 0.45 శాతం క్షీణించి 2024 నవంబర్ 5 స్థాయిలో 103.58 వద్ద కదులుతోంది.



బ్రేక్ లేకుండా 147 పాయింట్లు... స్నూకర్ ప్లేయర్ ఇష్‌ప్రీత్ సింగ్ చద్దా ఘనత

పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) ప్లేయర్ ఇష్‌ప్రీత్ సింగ్ చద్దా స్నూకర్ క్రీడలో బ్రేక్ లేకుండా గరిష్టంగా సాధించే 147 పాయింట్లను స్కోరు చేశాడు. ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ) స్నూకర్ క్లాసిక్ టోర్నమెంట్‌లో 28 ఏళ్ల ఇష్‌ప్రీత్ సింగ్ ఈ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఇష్‌ప్రీత్ 5–0 ఫ్రేమ్‌ల తేడాతో రైల్వేస్ ప్రత్యర్థి దిలీప్ కుమార్‌పై గెలుపొందాడు. స్నూకర్‌లో గరిష్టంగా 147 పాయింట్లు సాధించడం చాలా అరుదు. గతంలో కేవలం ఇద్దరు మాత్రమే ఈ ఘనత సాధించారు. భారత క్యూ స్పోర్ట్స్ దిగ్గజం గీత్ సేథీ 1988లో గుంటూరులో జరిగిన జాతీయ స్నూకర్ పోటీల్లో 147 పాయింట్లతో రికార్డుల్లోకి ఎక్కగా, 2013లో ఆదిత్య బెంగళూరులో జరిగిన పోటీల్లో గరిష్ట పాయింట్లు సాధించాడు. మళ్లీ 12 ఏళ్ల తర్వాత ముంబైకి చెందిన ఇష్‌ప్రీత్ ఈ అద్భుతం చేశాడు.

ప్రపంచ అండర్-20 చెస్ చాంపియన్ ప్రణవ్



పెట్రోవా (మోంటెనిగ్రో): అంతర్జాతీయ చెస్‌లో భారత్ నుంచి మరో ప్రపంచ చాంపియన్ అవతరించాడు. శుక్రవారం ముగిసిన ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ అండర్–20 ఓపెన్ విభాగంలో తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్ వెంకటేశ్ విజేతగా నిలిచాడు. 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 18 ఏళ్ల ప్రణవ్ 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రణవ్ ఏడు గేముల్లో గెలిచి, మిగతా నాలుగు గేమ్‌లను ‘డ్రా’ చేసుకొని టోర్నీని అజేయంగా ముగించాడు. ఈ క్రమంలో ఓపెన్ విభాగంలో ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా ప్రణవ్ గుర్తింపు పొందాడు. గతంలో భారత్ నుంచి విశ్వనాథన్ ఆనంద్ (1987), పెంటేల హరికృష్ణ (2004), అభిజిత్ గుప్తా (2008) ఈ ఘనత సాధించారు.

ప్రాగ్ మాస్టర్స్ చెస్ టోర్నీ విజేత అరవింద్



చెన్నై: ఆద్యంతం నిలకడగా రాణించిన తమిళనాడు యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం తన కెరీర్‌లోనే గొప్ప విజయం అందుకున్నాడు. చెక్ రిపబ్లిక్‌లో శుక్రవారం ముగిసిన ప్రాగ్ చెస్ ఫెస్టివల్‌లో మాస్టర్స్ విభాగంలో 25 ఏళ్ల అరవింద్ చాంపియన్‌గా అవతరించాడు. 10 మంది గ్రాండ్ మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ఒక్క గేమ్‌లోనూ ఓడిపోని అరవింద్ ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. టర్కీ గ్రాండ్‌మాస్టర్ ఇదిజ్ గురేల్‌తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను నల్లపావులతో ఆడిన అరవింద్ 39 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించాడు. 5 పాయింట్లతో అనీశ్ గిరి (నెదర్లాండ్స్), యి వె (చైనా), ప్రజ్ఞానంద (భారత్) ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. అనీశ్ రన్నరప్‌గా నిలువగా... యి వె మూడో స్థానంలో, ప్రజ్ఞానంద నాలుగో స్థానంలో నిలిచారు.

గుజరాత్ జెయింట్స్ జోరు

వరుసగా మూడో విజయం

- 5 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమి
- యూపీ వారియర్స్ అవుట్


హర్లీన్

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ వరుసగా మూడో విజయాన్ని అందుకొని పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో జెయింట్స్ 5 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. గుజరాత్ జెయింట్స్ గెలుపుతో యూపీ వారియర్స్ జట్టు అధికారికంగా ‘ప్లే ఆఫ్’ రేసు నుంచి దూరమైంది. గుజరాత్‌తో పోరులో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (57 బంతుల్లో 92; 15 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగగా... మరో ఓపెనర్ షఫాలీ వర్మ (27 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించింది. వీరిద్దరు తొలి వికెట్‌కు 54 బంతుల్లోనే 83 పరుగులు జోడించారు. జెయింట్స్ బౌలర్లలో మేఘనా సింగ్ 3 వికెట్లు పడగొట్టగా, డియాండ్రా డాటిన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం గుజరాత్ జెయింట్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు సాధించి గెలిచింది. హర్లీన్ డియోల్ (49 బంతుల్లో 70 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, బెత్ మూనీ (35 బంతుల్లో 44; 6 ఫోర్లు) రాణించింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 57 బంతుల్లో 85 పరుగులు జత చేశారు. చివర్లో డాటిన్ (10 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆష్లీ గార్డ్‌నర్ (13 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్ జెయింట్స్ విజయానికి కారణమయ్యాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా ఫైనల్ చేరగలిగే స్థితిలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ నిరాశగా తమ చివరిదైన ఎనిమిదో లీగ్ మ్యాచ్‌ను ముగించింది. నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో యూపీ వారియర్స్ తలపడుతుంది. ‘ప్లే ఆఫ్’ రేసులో నిలవాలంటే బెంగళూరు జట్టు ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (బి) డాటిన్ 92; షఫాలీ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) మేఘన 40; జొనాసెన్ (బి) డాటిన్ 9; జెమీమా (సి) గార్డ్‌నర్ (బి) మేఘన 4; అనాబెల్ (సి) డాటిన్ (బి) మేఘన 14; కాప్ (నాటౌట్) 7; బ్రైస్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–83, 2–108, 3–119, 4–141, 5–171. **బౌలింగ్:** డాటిన్ 4–0–37–2, కాశ్వీ 3–0–32–0, తనూజ 4–0–31–0, మేఘన 4–0–35–3, గార్డ్‌నర్ 2–0–18–0, ప్రియ 2–0–21–0

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) అనాబెల్ (బి) మిన్ను మణి 44; హేమలత (సి) లానింగ్ (బి) శిఖా 1; హర్లీన్ (నాటౌట్) 70; ఆష్లీ గార్డ్‌నర్ (సి) మిన్ను మణి (బి) శిఖా 22; డాటిన్ (సి) జెమీమా (బి) జొనాసెన్ 24; లిచ్‌ఫీల్డ్ (సి) షఫాలీ (బి) జొనాసెన్ 0; కాశ్వీ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.3 ఓవర్లలో 5 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–4, 2–89, 3–128, 4–162, 5–162. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4–1–29–0, శిఖా పాండే 4–0–31–2, అనాబెల్ సదర్లాండ్ 4–0–45–0, టిటాస్ సాధు 2–0–17–0, మిన్ను మణి 2–0–15–1, జొనాసెన్ 3.3–0–38–2.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ క్యాపిటల్స్	8	5	3	10	0.396
గుజరాత్ జెయింట్స్	7	4	3	8	0.334
ముంబై ఇండియన్స్	6	4	2	8	0.267
బెంగళూరు	6	2	4	4	-0.244
యూపీ వారియర్స్	7	2	5	4	-0.785

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సెమీస్‌లో ఆయుశ్ శెట్టి

పారిస్: ఓర్లియాన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ ఆయుశ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 48వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి 21–16, 21–23, 21–17తో ప్రపంచ 31వ ర్యాంకర్ రస్మస్ గెమ్కె (డెన్మార్క్)పై విజయం సాధించాడు. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ కీన్ యె లో (సింగపూర్)పై గెలిచిన ఆయుశ్... ప్రి క్వార్టర్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)ను ఓడించాడు. అదే జోరు కొనసాగిస్తూ క్వార్టర్స్‌లోనూ తనకంటే మెరుగైన ర్యాంకర్ గెమ్కెపై హోరాహోరీ పోరులో నెగ్గాడు. 48 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగానే గెలుచుకున్న ఆయుశ్... రెండో గేమ్‌లో చివరి వరకు పోరాడి ఓడాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వని ఆయుశ్ మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో రెండో సీడ్ చున్ యీ లిన్ (చైనీస్ తైపీ)తో ఆయుశ్ ఆడతాడు.



‘క్రీడాకారులకు ప్రత్యేక ఐడీ’

- ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తాం
- కేంద్ర మంత్రి మాండవియా ప్రకటన



సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా అన్నారు. ఇందు కోసం భిన్నమైన పలు కార్యక్రమాలు చేపట్టిందని ఆయన వెల్లడించారు. మాండవియా అధ్యక్షతన భారత క్రీడా రంగం మెరుగుదల, భవిష్యత్తుకు సంబంధించి శుక్రవారం ప్రత్యేక ‘చింతన్ శిబిర్’ ప్రారంభమైంది. నగర శివార్లలో కన్హా శాంతి వనంలో జరుగుతున్న రెండు రోజుల ఈ శిబిరం శనివారం ముగుస్తుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన క్రీడా శాఖల మంత్రులు, క్రీడా పరిపాలకులు, సీనియర్ ప్రభుత్వాధికారులతో పాటు కేంద్ర క్రీడాశాఖ సహాయ మంత్రి రక్ష ఖడ్సే కూడా దీనికి హాజరయ్యారు. ప్రపంచ క్రీడల్లో భారత్ స్థాయిని మరింత పెంచే దిశగా పలు ఆలోచనలను పంచుకున్న వీరంతా అందుకు తగిన విధంగా రూట్ మ్యాప్ కోసం తమ వంతు సూచనలు అందించారు. ముఖ్యంగా 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో భారత్ పెద్ద సంఖ్యలో పతకాలు సాధించే లక్ష్యంతోపాటు 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చే అంశంపై ఈ కార్యక్రమంలో చర్చ జరిగింది. ఒలింపిక్స్‌ను మన దేశం నిర్వహించాలనే కలకు ఈ చింతన్ శిబిర్ నుంచి తొలి అడుగు పడాలని మాండవియా అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో దేశంలో ఉన్న క్రీడా ప్రతిభ వృథా కాకుండా ఉండేందుకు తాము ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. ‘ప్రతిభాన్వేషణలో ఖేలో ఇండియా వంటి పథకాలు కీలక పాత్ర పోషించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 937 ఖేలో ఇండియా కేంద్రాలు సమర్థంగా పని చేస్తున్నాయి. 9–14 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఆటగాళ్లను గుర్తించి తీర్చిదిద్దితే ఒలింపిక్స్‌లో మంచి ఫలితాలు వస్తాయి. ఇప్పుడు సాంకేతికతను వాడుకోవడం కూడా కీలకాంశం. దీని కోసం ప్రభుత్వం ఒక కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. ఆటగాళ్ల వివరాలను ఒకే చోట నమోదు చేసి ప్రత్యేక ఐడీలు ఇవ్వబోతున్నాం. అలా చేస్తే వారిని తగిన రీతిలో ప్రోత్సహిస్తూ పురోగతిని పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది’ అని మాండవియా వెల్లడించారు. ఒలింపిక్ మిషన్ కోసం జాతీయ క్రీడా సమాఖ్యలు మరింత సమర్థంగా పని చేయాల్సి ఉంటుందన్న కేంద్ర మంత్రి... ఆటగాళ్ల సెలక్షన్స్‌లో పారదర్శకత పాటిస్తే తల్లిదండ్రులు మరింత పెద్ద సంఖ్యలో తమ పిల్లలను క్రీడల వైపు తీసుకొస్తారని విశ్లేషించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారంతా క్రీడాభివృద్ధి కోసం తమ సలహాలు అందించారు. దేశవ్యాప్తంగా జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న స్టేడియంలు తదితర మౌలిక సౌకర్యాలను సమర్థంగా వాడుకునేలా చూడాలని వారు సూచించారు.

శౌర్య-హృతిక్ జోడీకి ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జే30 టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన శౌర్య సామల-హృతిక్ కటకం జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మదురైలో ముగిసిన ఈ టోర్నీలో డబుల్స్ ఫైనల్లో శౌర్య-హృతిక్ ద్వయం 6-3, 7-6 (8/6)తో రెండో సీడ్ ఆరవ్ చావ్లా-ప్రకాశ్ శరణ్ (భారత్) జంటపై నెగ్గింది. తొలి రౌండ్‌లో శౌర్య-హృతిక్ 7-5, 6-4తో నియంత్ బద్రీనారాయణన్ (అమెరికా)-అనురవ్ ప్రకాశ్ (భారత్)లపై గెలిచారు. క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ జోడీకి దేవ్ విపుల్-జహాన్ సిద్ధిఖీ (భారత్) జంట నుంచి వాకోవర్ లభించింది. సెమీఫైనల్లో శౌర్య-హృతిక్ ద్వయం 6-7 (7/9), 7-6 (7/5), 10-7తో ‘సూపర్ టైబ్రేక్’లో షౌనక్-ఓం వర్మ (భారత్) జోడీపై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

హోం శాఖలోనే ఖాళీలు ఎక్కువ



కేంద్ర ప్రభుత్వంలోని మొత్తం ఉద్యోగుల్లో రైల్వేలు, రక్షణ శాఖ, హోం శాఖల్లోనే మూడొంతులకుపైగా ఉన్నారు. ఈ మూడు శాఖల్లోనే గత మూడేళ్లుగా ఖాళీలు పెరుగుతున్నాయి. ఈ మూడు శాఖల్లోకీ అత్యధిక ఖాళీలు ఉన్నది రక్షణ శాఖలో సైనికేతర విభాగంలోనే. కేంద్ర వ్యయ విభాగం గణాంకాల ప్రకారం.. 2016 మార్చి నాటికి రైల్వే శాఖలో కేటాయించిన అన్ని పోస్టులనూ భర్తీ చేశారు. కానీ 2018లో మాత్రం 17 శాతానికి, 2023 మార్చి నాటికి ఏకంగా 21 శాతానికి ఖాళీలు పెరిగాయి.

శాఖ	అయా సంవత్సరాల్లో ఖాళీల శాతం	
	మార్చి 2019	మార్చి 2023
హోం శాఖ	10	12
రైల్వేలు	19	21
రక్షణ శాఖ	41	42

క్లుప్తంగా...

పదో తరగతి పరీక్షలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం



సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ నిర్ణయించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులలో ఉచిత ప్రయాణం అందించనుంది. ఆర్టీసీ బస్‌పాస్ లేని విద్యార్థులు కూడా తమ హాల్‌టికెట్ చూపిస్తే టికెట్ లేకుండానే ప్రయాణానికి అనుమతించాలని అధికారులను శుక్రవారం ఆదేశించింది. ఈ నెల 17 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు నిర్వహించే రోజుల్లో మాత్రమే ఈ వెసులుబాటు కల్పించనుంది.

బీఎడ్ పేపర్ లీకేజీపై విచారణ

సాక్షి, అమరావతి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఎడ్ పరీక్షా పత్రం లీకేజీ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రం నిర్ణీత సమయానికి ముందే లీక్ కావడంపై విచారణ నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే పరీక్షను రద్దు చెయ్యాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్' సెలక్షన్స్‌లో నారాయణ హవా

సాక్షి, హైదరాబాద్: హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, భారతప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్, ఇంటర్నేషనల్ మ్యాథమేటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. అత్యధికంగా 65 మంది తమ విద్యార్థులు ఎంపికయ్యారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ ట్రైనింగ్ క్యాంప్‌కి ఎంపికైన ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒకరు నారాయణ విద్యార్థి కావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

17న హెల్త్ వర్సిటీ జూనియర్ అసిస్టెంట్ పరీక్ష

సాక్షి, అమరావతి: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలోని జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 17న పరీక్ష నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పేపర్-2 ఉంటుందని పేర్కొంది. ఈనెల 10 నుంచి అభ్యర్థులు వెబ్‌సైట్ https://psc.ap.gov.in నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం
మే-2025 సెషన్ డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కు సర్వీస్ కమిషన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 1 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. పూర్తి వివరాలు ఈనెల 10న ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

హమాలీలకు చార్జీల పెంపు

సాక్షి, అమరావతి: పౌరసరఫరాల సంస్థలో పనిచేసే హమాలీలకు లోడింగ్, అన్ లోడింగ్ చార్జీలను పెంచుతూ ఎండీ మనజీర్ జిలానీ ఉత్తర్వులిచ్చారు. హమాలీ చార్జీలను రూ.25 నుంచి రూ.28కి పెంచారు. దసరా సమయంలో ఇచ్చే బోనస్‌ను రూ.6 వేల నుంచి రూ.6,500, మిఠాయిల కోసం ఇచ్చే నగదును రూ.1300 నుంచి రూ.1500కి, గన్నీ(బేలు) రూ.50 నుంచి రూ.55కు పెంచారు. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్లో మంచి నీటికి నెలకు రూ.600 నుంచి రూ.1000కి, ప్రతి హమాలీకి మూడు జతల యూనిఫాం, స్వీపరుకు ప్రస్తుతం అమలవుతున్న వేతనంపై రూ.వెయ్యి అదనంగా ఇవ్వనున్నారు.

రూ.9 వేల కోట్ల అప్పునకు గ్రీన్ సిగ్నల్



- బాండ్ల విడుదల ద్వారా ఏపీఎండీసీ సమీకరణ
- పలు కీలక నిర్ణయాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- విజయనగరం జిల్లా గాజులరేగలో టీడీపీ కార్యాలయానికి రెండెకరాలు
- ఇకపై పదోన్నతుల ద్వారానే ఎంపీడీవో పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) పలు రకాల బాండ్ల విడుదల ద్వారా రూ.9 వేల కోట్ల అప్పు సమీకరించుకునేందుకు రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విజయనగరం జిల్లాలోని గాజులరేగ గ్రామంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణానికి రెండెకరాల స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం నిర్ణయం తీసుకుంది. టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం ఎకరానికి సంవత్సరానికి రూ.వెయ్యి అద్దె ప్రాతిపదికన 33 ఏళ్లపాటు రెండు ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పర్యాటకానికి భూముల కేటాయింపు పాలసీ-2024-29కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం కోసం 27 ఎకరాల భూమి ఏపీఐఐసీకి బదలాయించేందుకు ఆమోదం తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద వ్యవసాయ, సహకార శాఖకు 10.72 ఎకరాలు కేటాయించేందుకు, రాజమండ్రిలోని గోదావరి నదిపైన ఉన్న హేవ్ లాక్ వంతెనను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి వీలుగా 116.974 ఎకరాల భూమిని, కాకినాడ జిల్లా తమ్మవరం గ్రామంలో 66.12 ఎకరాల భూమిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థకు కేటాయించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఏలూరు జిల్లా వేలయిర్‌పాడులోని ఆర్ఎస్‌నెంబర్ 74లో 5.75 ఎకరాలను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించేందుకు నిర్ణయించారు. చిత్తూరు జిల్లా జంగాలపల్లి గ్రామంలోని సెయింట్ గ్యాబ్రియేల్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యా సంస్థకు కేటాయించిన 4.64 ఎకరాల్లో నిర్మాణానికి మరో 18 నెలలు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్నంలో సెంచూరియన్ స్కూల్ ఆఫ్ రూరల్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్మెంట్ ట్రస్ట్-భువనేశ్వర్‌ను సెంచూరియన్ ఎడ్యుకేషన్ మేనేజ్మెంట్ ట్రస్టు-విశాఖపట్నంగా మార్చుతూ తదనుగుణంగా ఏపీ ప్రైవేటు యూనివర్సిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2016 (యాక్ట్ 18 ఆఫ్ 2018) సవరణ బిల్లు 2025ని శాసనసభ ఆమోదం కోసం పెట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సెంట్రల్ పూల్‌కు కొత్తగా 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, ఇన్ సర్వీసులో ఉన్న పీజీ డాక్టర్లు దానికనుగుణంగా వేతనాలు పొందడానికి వీలుగా పీజీ లీన్ ఉత్తర్వులు ఇవ్వడానికి ఆమోదించింది. కుప్పం నియోజకవర్గంలో రూ.5 కోట్లతో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గీత కులాలకు కేటాయించిన 335 మద్యం దుకాణాల్లో నాలుగు దుకాణాలను సొండి కులాల వారికి కేటాయిస్తూ చేసిన సవరణను ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఏపీఈడీబీ)లో 22 కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి అనుమతిచ్చింది.

ఎంపీడీవోల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ రద్దు

ఏపీపీఎస్సీ ద్వారా ఎంపీడీవోల నియామక ప్రక్రియకు ప్రభుత్వం స్వస్తి పలకనుంది. ఎంపీడీవో ఖాళీలను ఇకపై పదోన్నతుల ద్వారానే భర్తీ చేస్తారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగుల సర్వీసు రూల్స్‌లో సవరణ తీసుకొచ్చే పలు ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎంపీడీవో, డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) ఇక ఒకే క్యాడర్‌గా కొనసాగుతారు. జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) స్థాయిని డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. డీపీవో, డిప్యూటీ జడ్పీ సీఈవో పోస్టులతో పాటు డీడీవో పోస్టుల్లో మూడో వంతు నేరుగా నియామకం చేపట్టే విధానం తీసుకురానున్నారు. మండల స్థాయిలో పనిచేసే ఈవోపీఆర్‌డీలకు ఇక డిప్యూటీ ఎంపీడీవో హోదా కల్పిస్తారు. జడ్పీ సీఈవో పోస్టుల్లో సగం ఐఏఎస్ అధికారులను నియమించే నిబంధనను మంత్రివర్గం ఆమోదించింది. ఐఏఎస్ అధికారులను నియమించని పక్షంలో జడ్పీ సీఈవో ఫీడర్ క్యాటరీ సిబ్బంది లేదా ఇతర శాఖ నుంచి డిప్యూటేషన్ విధానంలో నియమిస్తారు. వేరే శాఖ సిబ్బందికి పంచాయతీరాజ్ శాఖ నియామకాల్లో బాధ్యతలు అప్పగించే పక్షంలో అలాంటి వారికి ఇక ముందస్తు శిక్షణను తప్పనిసరి చేశారు.

సీబీఐ పరిధిలో ఉన్నా జోక్యం చేసుకోవాలి

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు సీబీఐ పరిధిలో ఉన్నప్పటికీ జోక్యం చేసుకోవాలని సీఎం చంద్రబాబు పోలీస్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం మంత్రివర్గం సమావేశం ముగిసిన అనంతరం రాజకీయ అంశాలపై ఆయన మంత్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివేకా హత్య కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను ఆదేశించారు. ఈ కేసులో సాక్షులు అనుమానాస్పదంగా మృతి చెందుతున్నారని, ఇప్పుడు వాచ్‌మెన్ రంగన్న అలానే మృతి చెందడం సందేహాస్పదంగా ఉందని చెప్పారు. రంగన్న మృతికి సంబంధించిన వివరాలను సీఎం, మంత్రులకు డీజీపీ వివరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. వైఎస్ వివేకా హత్యను తొలుత గుండెపోటుగా చెప్పారని, ఇప్పుడు వాచ్‌మెన్ రంగన్నను పోలీసులే చంపారని వైఎస్సార్‌సీపీ అనుకూల మీడియాలో వార్తలు వచ్చాయని చెప్పినట్లు తెలిసింది. అందుకే ఆ పార్టీ కుట్రల గురించి అప్రమత్తంగా ఉండాలని తాను ముందు నుంచీ చెబుతున్నానని చంద్రబాబు అన్నట్లు సమాచారం. పరిటాల రవి హత్య కేసులో సాక్షులు కూడా ఇలానే చనిపోతూ వచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేసులో ఆరుగురు సాక్షులు చనిపోయారన్నారు. రంగన్నను హత్య చేసి, దానిని ప్రభుత్వానికి ఆపాదించాలనే కుట్ర ఇందులో దాగి ఉందని పలువురు మంత్రులు అన్నట్లు తెలిసింది.

బట్రెస్ డ్యామ్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

- పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీ నియంత్రణకు దిగువన నిర్మాణం
- 2,454 మీటర్ల పొడవున 8 మీటర్ల ఎత్తుతో సిమెంట్ కాంక్రీట్‌తో బట్రెస్ డ్యామ్ పనులు
- అంతర్జాతీయ నిపుణులు ఖరారు చేసిన డిజైన్‌ను ఆమోదించిన కేంద్ర జలసంఘం




సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీ నియంత్రణకు దాని దిగువన బట్రెస్ డ్యామ్ నిర్మించేందుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఎగువ కాఫర్ డ్యామ్‌కు దిగువన టోయ్(అడుగు భాగం)లో దీనిని నిర్మించేలా అంతర్జాతీయ నిపుణుల కమిటీ (పీవోఈ) ఖరారు చేసిన డిజైన్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించింది. ఎగువ కాఫర్ డ్యామ్ దిగువన దానికి సమాంతరంగా 2,454 మీటర్ల పొడవున 8 మీటర్ల ఎత్తుతో రీయిన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్‌తో బట్రెస్ డ్యామ్ నిర్మాణ పనులు చేపట్టాలని పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించింది. జూలైలోగా బట్రెస్ డ్యామ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని నిర్దేశించింది. 2016-18 మధ్య ఎగువ కాఫర్ డ్యామ్ పునాది (జెట్ గ్రౌటింగ్ వాల్) నిర్మాణంలో నాటి టీడీపీ సర్కార్ తప్పిదం వల్ల సీపేజీ అధికంగా ఉందని పీవోఈ తేల్చింది. గోదావరి వరదల్లోనూ ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రం వాల్ పనులు కొనసాగించాలంటే ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీని నియంత్రించాలని.. అందుకు ఎగువ కాఫర్ డ్యామ్ దిగువన బట్రెస్ డ్యామ్‌ను నిర్మించాలని సూచించింది. దాంతో బట్రెస్ డ్యామ్ డిజైన్‌ను రూపొందించాలని కాంట్రాక్టు సంస్థను సీడబ్ల్యూసీ ఆదేశించింది. కాంట్రాక్టు సంస్థ రూపొందించిన డిజైన్‌పై ఈనెల 4న పీవోఈతో సీడబ్ల్యూసీ సీఈ విజయ్ శరణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సమావేశంలో పీవోఈ చేసిన సూచనల మేరకు డిజైన్‌లో మార్పులు చేర్పులు చేసి పంపాలని కాంట్రాక్టు సంస్థను సీడబ్ల్యూసీ ఆదేశించింది. ఆ మేరకు రూపొందించిన బట్రెస్ డ్యామ్ డిజైన్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించింది.

బంకమట్టి ప్రాంతంలోనూ డీ-వాల్‌కు లైన్ క్లియర్

ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో బంకమట్టి నేల ఉన్న ప్రాంతంలోనూ డయాఫ్రం వాల్ (డీ-వాల్) నిర్మాణానికి సీడబ్ల్యూసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బంకమట్టి నేల ఉన్న ప్రాంతంలో నిర్మిస్తున్న డీ వాల్‌కు ఇరువైపులా 25 మీటర్ల పొడవున వైబ్రో కాంపాక్షన్ చేసి.. ఇసుక సాంద్రతను పెంచి.. నేలను పటిష్టం చేయాలని పీవోఈ సూచించింది. ఆ తర్వాత డీ-వాల్ పనులు చేపట్టాలని సీడబ్ల్యూసీ ఆదేశించింది. దాంతో బంకమట్టి నేల ఉన్న ప్రాంతంలో నిర్మించనున్న డీ-వాల్‌కు ఇరువైపులా 25 మీటర్ల పొడవున వైబ్రో కాంపాక్షన్ పనులను కాంట్రాక్టు సంస్థ శుక్రవారం ప్రారంభించింది.

ఏమిటీ బట్రెస్ డ్యామ్
కాంక్రీట్ ఆనకట్ట, కాఫర్ డ్యామ్ సీపేజీ (లీకేజీ) నీటిని నియంత్రించడానికి దాని దిగువన రీయిన్‌ఫోర్స్‌మెంట్ కాంక్రీట్‌తో నిర్మించేదే బట్రెస్ డ్యామ్. ఎగువ కాఫర్ డ్యామ్ పునాదిలో లోపాల వల్ల సీపేజీ అధికంగా ఉంది. దాన్ని నియంత్రించాలంటే దానికి పొడవునా దిగువ భాగంలో మరో చిన్న సైజు (బట్రెస్) డ్యామ్ నిర్మించాలని పీవోఈ సూచించింది. పునాది స్థాయి నుంచి ఇనుప కడ్డీలు, సిమెంట్ కాంక్రీట్‌తో భూఉపరితలానికి 8 మీటర్ల ఎత్తు వరకూ బట్రెస్ డ్యామ్‌ను నిర్మిస్తారు.

మధుమేహం.. 'భారీ' ముప్పు!



రానున్న కొద్ది సంవత్సరాల్లో మరింతమంది మధుమేహ బాధితులు

- ఏపీలో 45 ఏళ్లు దాటిన వారిలో 51 శాతం మందిపై ప్రభావితం
- కేరళలో దేశంలోనే అత్యధికంగా 64.4 శాతం మంది..
- అధిక బరువు ఉన్న వారిలో ఎక్కువ ఎఫెక్టు
- ఒంటరిగా ఉండటం, కుటుంబాల్లో మద్దతు లేని వ్యక్తులకూ ప్రమాదం
- మధుమేహంపై తాజాగా ఎల్ఎస్ఏఐ అధ్యయనంలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రానికి మధుమేహ ప్రమాదం మరింత పొంచి ఉంది. రానున్న కొద్ది సంవత్సరాల్లోనే ఈ వ్యాధి బాధితులు భారీగా పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో 45 సంవత్సరాలు.. అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో 51 శాతం మంది టైప్-2 డయాబెటిస్ బారిన పడే ప్రమాదం ఉన్నట్టు ఎల్ఎస్ఏఐ (లాంగ్విట్యూడినల్ ఏజింగ్ స్టడీ) నివేదిక తేల్చింది. దీన్నిబట్టి చూస్తే 45 ఏళ్లు దాటిన జనాభాలో సగం మందికి పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉండే అవకాశం ఉంది. బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) ఎక్కువగా ఉన్న వారిలో ఈ ప్రమాదం అధికంగా ఉన్నట్టు ఎల్ఎస్ఏఐ నివేదిక వెల్లడించింది.

ప్రమాదం ఎలా ఉందంటే..

- తాజా అధ్యయనంలో డయాబెటిక్ రిస్క్ స్కోరు (ఐడీఆర్ఎస్) విధానం ద్వారా ప్రమాదాన్ని అంచనా వేశారు. వయసు, కుటుంబ చరిత్ర, అధిక బరువు, నడుము చుట్టుకొలత, శారీరక శ్రమ వంటి ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.
- తొలి దశలో సుమారు 60 వేల నమూనాలను పరిగణనలోకి తీసుకున్నారు.
- డయాబెటిక్ రిస్క్ సామాజిక, ఆర్థిక కారణాలతోనూ ముడిపడి ఉందని గుర్తించారు.
- ఐడీఆర్ఎస్ విధానం ద్వారా చూస్తే ఊబకాయం ఉన్న వ్యక్తులకు ఎక్కువ ప్రమాదం ఉంది.
- పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది గుండె సంబంధిత ప్రమాదాన్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నట్టు తేలింది.
- బరువు తక్కువ గానీ, ఎత్తుకు తగిన బరువు ఉన్నవారు కాస్త అదృష్టవంతులుగా ఈ అధ్యయనంలో తేల్చారు.
- సన్నగా ఉన్నవారితో పోలిస్తే ఊబకాయులు 4.17 రెట్లు ఎక్కువగా మధుమేహం ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రధానంగా గుర్తించారు.
- గుండెజబ్బులు, స్ట్రోక్ చరిత్ర కలిగి ఉన్నవారు 1.85 రెట్లు ఎక్కువగా మధుమేహానికి గురయ్యే అవకాశం ఉంది.
- పొగాకు వాడకం, మద్యపానం, అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటివి కూడా మధుమేహాన్ని ఆహ్వానించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు తేలింది.

ఆహారమే మహాభాగ్యం

- సాధారణంగా ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటాం. ఈ అధ్యయనంలో ఆహారమే మహాభాగ్యం అని తేల్చారు.
- ఆరోగ్యకరమైన తిండి, సరైన ప్రవర్తన, శారీరక శ్రమ వంటివి మధుమేహ ప్రమాదాన్ని తగ్గిస్తున్నాయని ప్రకటించారు.
- ప్రస్తుతం భారతదేశంలోని పట్టణ ప్రాంతాల్లో వాతావరణం మధుమేహ ప్రమాదాన్ని పెంచే విధంగానే ఉన్నట్టు వెల్లడైంది.
- పట్టణాల్లో శారీరక శ్రమను పెంచే కార్యక్రమాలు చేపడితే మధుమేహం రాకుండా చూడటం, లేదా వచ్చిన వారిలో నియంత్రణలో ఉంచడం సాధ్యమేనని కేరళ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగం పరిశోధకులు డాక్టర్ ప్రకాష్‌బాబు తన అధ్యయనంలో పేర్కొన్నారు.
- ఒంటరిగా ఉన్నవారు లేదా కుటుంబాల మద్దతు లభించని వ్యక్తులు డయాబెటిక్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు తేల్చారు.

వివిధ రాష్ట్రాల్లో 45 ఏళ్ల వయసు పైబడిన వారిలో మధుమేహ ప్రభావం ఇలా

రాష్ట్రం	ప్రభావితులు (శాతం)
కేరళ	64.4
జమ్మూ-కాశ్మీర్(యూటీ)	64.9
ఢిల్లీ	68.5
హరియాణ	60.2
తెలంగాణ	56.7
ఆంధ్రప్రదేశ్	51.0

నేడు సాక్షి అవార్డ్స్ స్పెషల్ ఎపిసోడ్

గత పది సంవత్సరాలుగా సాక్షి మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ టెన్త్ ఎడిషన్' వేడుక స్పెషల్ ఎపిసోడ్ సాక్షి టీవీలో శనివారం ప్రసారం కానుంది. ఫిబ్రవరి 28 శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ వేడుకలో వై.ఎస్.భారతి రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. సామాజిక రంగంలో గొప్ప సేవ చేస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన వారికీ, కళారంగంలో గొప్ప ప్రతిభ చూపిన వారికి 2023-24 సంవత్సరాలకు గాను ఈ ఎక్సెలెన్సీ అవార్డులు బహూకరించారు. జ్యూరీ చైర్‌పర్సన్‌గా శాంతా సిన్హా వ్యవహరించారు. అవార్డులు అందుకున్న వారిలో పర్యావరణ సేవకు గాను దూసర్ల సత్యనారాయణ, సేంద్రియ వ్యవసాయానికి మల్లికార్జున రెడ్డి, అమర సైనికుడు డొక్కరి రాజేష్ (మరణానంతరం అతని తల్లిదండ్రులకు), క్రికెటర్ గొంగడి త్రిష, అథ్లెట్ జీవాంజి దీప్తి తదితరులు ఉన్నారు. సినిమా రంగంలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ సీనియర్ నటి రమాప్రభ అందుకున్నారు. ఎక్సెలెన్సీ అవార్డులు అందుకున్న వారిలో దర్శకుడు సాయి రాజేష్, మీనాక్షి చౌదరి, కిరణ్ అబ్బవరం తదితరులు ఉన్నారు. డైరెక్టర్ సుకుమార్ 'తెలుగు పర్సన్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం, ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు.

టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీతో 'నెడ్‌క్యాప్' ఒప్పందం

రూ.49వేల కోట్ల పెట్టుబడులతో 7 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవకాశం



టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీతో ఒప్పందం చేసుకుంటున్న 'నెడ్‌క్యాప్'

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్), టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ ఈఎల్) మధ్య 7 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయు) శుక్రవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ మేరకు ఇంధన శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..ఈ ఒప్పందంతో రాష్ట్రంలో దాదాపు రూ.49 వేల కోట్ల పెట్టుబడి, 33 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. 318 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చు. ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులను పొందడం దగ్గర్నుంచి అవసరమైన భూమిని గుర్తించడం, పరిశీలించడం, ఎంపిక చేయడం, కేటాయించడం వంటి పనులను నెడ్‌క్యాప్ నిర్వహిస్తుంది. విద్యుత్ సరఫరా కోసం కేంద్ర సరఫరా సంస్థ (సెంట్రల్ ట్రాన్స్మిషన్ యుటిలిటీ), రాష్ట్ర సరఫరా సంస్థ (స్టేట్ ట్రాన్స్మిషన్ యుటిలిటీ) ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలోనూ నెడ్‌క్యాప్ సహాయపడనుంది. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) నేరుగా లేదా అనుబంధ సంస్థల ద్వారా, ప్రాజెక్టులకు ముందస్తు అధ్యయనా, సాధ్యతా నివేదికలను రూపొందిస్తుంది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, లోకేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, నెడ్‌క్యాప్ ఎండీ శ్రీ ఎం.కమలాకర బాబు హాజరయ్యారు. టాటా పవర్ రెన్యువబుల్స్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ శ్రీ దీపేష్ నందా తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌పై కూటమి ప్రభుత్వం కుట్ర

- అరకొర నిధుల కేటాయింపుతో తీవ్ర నిర్లక్ష్యం
- ప్రాజెక్ట్‌కు నిధుల కోరుతూ పాదయాత్ర
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సాక్షి, అమరావతి: వెలిగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే ప్రాజెక్ట్‌కు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. ఏకంగా 53 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ప్రాంతంలో నెలకొన్న నీటి ఎద్దడి, కరవు పరిస్థితులను ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలే గుర్తించాయని, ఈ పరిస్థితులను మార్చేందుకు నిర్దేశించిన వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందన్నారు. పనులు శరవేగంతో చేయడం వల్ల శ్రీశైలం నుంచి నీటిని తీసుకురావడానికి నిర్మించిన రెండు టన్నెల్స్ పనులు పూర్తయినట్టు తెలిపారు. స్టోరేజ్ చేసే కొండల మధ్య ఉన్న గ్యాప్‌లను పూడ్చడంతో పాటు పునరావాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది జనవరి నాటికి ఎవరికైతే 18 ఏళ్లు నిండాయో వారికి పరిహారం ఇచ్చి, ముంపు ప్రాంతాల నుంచి తరలించాల్సి ఉందని, ఇదే జరిగితే ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయిలో నీరందుతుందన్నారు.

ప్రాజెక్టుకు నిధుల సాధనకు పాదయాత్ర

ప్రాజెక్ట్‌కు గత బడ్జెట్‌లో అరకొర నిధులను మాత్రమే కేటాయించడంతో అసలు ప్రాజెక్టును పూర్తి చేసే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదని అర్థమవుతోందని తాటిపర్తి ధ్వజమెత్తారు. ప్రాజెక్ట్‌కు నిధులు సాధించేందుకు తాము చేపట్టనున్న పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములవుతారని చెప్పారు. ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా రాజకీయాలను పక్కన పెట్టి ప్రాజెక్ట్ సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రాముఖ్యత ఈ ప్రాంత ప్రజలకు తెలుసు కాబట్టి, వారు తనను నిలదీస్తారన్న భయంతోనే సీఎం చంద్రబాబు తన పర్యటనను ప్రాజెక్ట్ వద్ద కాకుండా దూరంగా పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'ఆస్తులు అమరావతికి.. వస్తులు ప్రకాశానికి' అన్నట్లుగా చంద్రబాబు, లోకేశ్‌ల వ్యవహారం ఉందని ఎమ్మెల్యే తాటిపర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీరు-చెట్టు బిల్లుల చెల్లింపునకు లైన్ క్లియర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014-19 మధ్య నీరు-చెట్టు కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం 818 పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపును నిలుపుదల చేయాలని ప్రతిపాదించిన రూ.30.16 కోట్లను చెల్లించాలని జలవనరుల శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాల కలెక్టర్‌లు ఏర్పాటుచేసిన తనిఖీ బృందాలు 960 పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపును నిలుపుదల చేయాలని ప్రతిపాదించిన రూ.3.45 కోట్లను చెల్లించాలని నిర్దేశించింది. 131 పనులకు సంబంధించి మినహాయించుకున్న 20 శాతం బిల్లులు రూ.1.93 కోట్లు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేకుండా 123 పనులు చేసిన వారికి ఇవ్వాల్సిన రూ.7.25 కోట్లు, పనులు చేసిన కాంట్రాక్టర్లు చనిపోవడంతో వారి వారసులకు 61 పనులకు సంబంధించి రూ.4.33 కోట్ల బిల్లులను చెల్లించాలంది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

హొసపేటి: కూడ్లిగి తాలూకా కానాహొసల్లిలోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎకోక్లబ్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం.కోడిహళ్లి సురేష్ మాట్లాడుతూ నానాటికీ ఎండలు పెరిగి జీవరాశులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణంపై చెడు ప్రభావం పడుతోందన్నారు. విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు, చెట్లను ఎక్కువగా పెంచాలన్నారు. ప్లాస్టిక్ వాడకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు బీఎం.రాధామణి మాట్లాడుతూ మొక్కలు, చెట్లు ఎక్కువగా లేని కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. వర్షాల ప్రభావం కూడా క్రమంగా తగ్గుతోందన్నారు. ఉపాధ్యాయులు జీవీ శివకుమార్, ఎల్.కృష్ణమూర్తి, ఫిర్దోస్, కేఎస్.స్నేహ పాల్గొన్నారు.

సేవాదళ్ కార్యదర్శిగా నియామకం



ఆదేశపత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

రాయచూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శిగా నగరానికి చెందిన రాధాకృష్ణ రెడ్డి నియమితులయ్యారు. గురువారం పార్టీ కార్యాలయంలో సేవాదళ్ రాష్ట్ర పార్టీ చీఫ్ ఆర్గనైజర్ రామచంద్ర ఆదేశాలు జారీ చేశారు. పార్టీని బలోపేతం చేసి జెడ్పీ, టీపీ, నగరసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రీకారం చుట్టాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

రాయచూరు రూరల్: వేసవి సమీపించడంతో యాదగిరిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను నగరసభ అధ్యక్షురాలు లలిత అనపురే ప్రారంభించారు. శుక్రవారం యాదగిరి నగరంలోని కోర్టు, బసవేశ్వర సర్కిల్, గంజ్ సర్కిల్, గాంధీ చౌక్, నగరసభ కాంప్లెక్స్‌లో చలివేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి తోడు పక్షులకు నీటిని అందించడానికి చెట్లపై నీటి తొట్టెలను ఏర్పాటు చేశారన్నారు. నగరసభ కమిషనర్ ఉమేష్, లక్ష్మీకాంత్, సభ్యులు విలాస్ పాటిల్, హనుమంతు, జేశు అంబకేశ్వర, ఎస్‌బి శివపుత్ర, శరణమ్మ, మంజునాథ్, యేసుమిత్ర, మల్లులున్నారు.

వీధి వ్యాపారాలకు అనుమతించాలి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో ముస్లిం సోదరులకు రంజాన్ మాసంలో రోడ్లు, వీధుల్లో వ్యాపారాలు చేసుకోవడానికి వీలు కల్పించాలని మాజీ నగరసభ సభ్యుడు డిమాండ్ చేశారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ పుట్టమాదయ్యకు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. నగరంలో రాత్రి వేళలో నమాజు చేస్తున్నారన్నారు. విద్యుత్, నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, కుక్కల బెడద నుంచి రక్షించాలన్నారు. ఆందోళనలో జెడీ మాజీ సభ్యుడు బషీరుద్దీన్, నగరసభ ఉపాధ్యక్షుడు సాజిద్ సమీర్‌లున్నారు.

విజ్ఞానం.. క్రమశిక్షణకు సోపానం



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: విద్యార్థుల్లో క్రమశిక్షణకు, వ్యక్తిత్వ వికాసానికి విజ్ఞానం సోపానమని ప్రముఖ విద్యావేత్త నాగరాజ్ వెల్లడించారు. శుక్రవారం కేఎస్‌హెచ్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విజ్ఞాన వస్తు ప్రదర్శనను తిలకించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో విజ్ఞానంపై అవగాహనకు నాయకత్వ లక్షణాలు, చైతన్యం, ఆత్మ విశ్వాసం, ఇంగ్లిష్ అంశాలపై చర్చాగోష్ఠి నిర్వహించారు. మనోహర్, శశిభూషణ్, మల్లప్ప, సాదిక్, విద్యావతి, స్నేహలతలున్నారు.


రాష్ట్ర బడ్జెట్‌లో బళ్లారికి మొండిచేయి



పండు మిరపకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలికార్మికులు



అతీగతీ లేని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



రైతుల జీవనాడి తుంగభద్ర జలాశయం

- ముఖ్యమంత్రి పద్దుపై వివిధ వర్గాల్లో భిన్నస్వరాలు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నిధుల ప్రస్తావన ఏదీ?
- ఊసే లేని అపారెల్ పార్కు, ఎయిర్‌పోర్టు, ఇంజినీరింగ్ కాలేజీ

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన భూమిక పోషించిన బళ్లారి జిల్లాకు బడ్జెట్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య మొండిచేయి చూపారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్ని స్థానాల్లో కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారు. ఇక ఉమ్మడి బళ్లారి జిల్లా ప్రస్తావనకు వస్తే విజయనగర జిల్లాలో కూడా కాంగ్రెస్ పార్టీదే హవా. అంతేకాకుండా ఉమ్మడి బళ్లారి జిల్లా నుంచి రాష్ట్రానికి పెద్ద మొత్తంలో పన్నుల రూపంలో సొమ్ము చెల్లిస్తుంటారు. అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు, స్టీల్ ఇండస్ట్రీలు, పలు ఫ్యాక్టరీలు ఉన్నందున ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కోట్ల రూపాయల ఆదాయం పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేరుతుంది. అయినా పేదరిక నిర్మూలన, మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి, ఇళ్ల నిర్మాణాలకు, అర్ధంతరంగా ఆగిన పనులకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించపోవడంతో సిద్ధూ బడ్జెట్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎండుమిర్చి వ్యాపార కేంద్రం ఊసే లేదు

ఈ ప్రాంతంలో విస్తారంగా మిర్చి పండిస్తున్నారు. తుంగభద్ర ఆయకట్టు కింద లక్షలాది ఎకరాల్లో మిర్చి పంట పండిస్తున్నారు. ఇక్కడ నుంచి సుదూరంలోని బ్యాడిగికి తరలించి రైతులు విక్రయిస్తుంటారు. ధరలు అమాంతంగా పడిపోవడంతో కనీసం రవాణా ఖర్చులు కూడా రైతులకు గిట్టడం లేదు. ఈనేపథ్యంలో జిల్లాలో అత్యాధునిక ఎండుమిర్చి వ్యాపార కేంద్రం ప్రారంభిస్తే రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆశలు పెట్టుకున్న రైతులకు బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక విమానాశ్రయం విషయానికి వస్తే సిరివార సమీపంలో గత బీజేపీ ప్రభుత్వ హయాంలో విమానాశ్రయ నిర్మాణానికి భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పనులు ప్రారంభించి వదిలేశారు. ప్రతి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నారు. మాటల వరకే విమానాశ్రయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

పూర్తి కాని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ముఖ్యంగా బళ్లారి జిల్లాకే తలమానికంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాలు చేపట్టి 17 ఏళ్లు పైబడింది. నత్తనడక పనులు జరుగుతున్నాయి కాని పూర్తిగా నిధులు కేటాయించకపోవడంతో ఆస్పత్రి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నూతనంగా ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణంతో పాటు తుంగభద్ర డ్యాంకు కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చడానికి కూడా నిధులు కేటాయించలేదు. వీటితో పాటు పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి కూడా మొండిచేయి చూపారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు మినహా మిగిలిన అన్ని వర్గాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థల వారు, ప్రజా సంఘాల వారు బడ్జెట్‌పై భిన్నస్వరాలు వినిపిస్తున్నారు.

నెరవేరని అగ్ర నేత రాహుల్ గాంధీ హామీ

అంతేకాకుండా అపారెల్ పార్కుకు కూడా నిధులు కేటాయించలేదు. గత బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన చేసినా పనులు ప్రారంభించలేదు. ఈ బడ్జెట్‌లో కూడా ఆశలు పెట్టుకున్నారు. అపారెల్ పార్కు నిర్మాణం చేపడితే ఈ ప్రాంతంలో జీన్స్ రంగానికి మరింత మేలు చేసినట్లు అవుతుందని, స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఎన్నికల ముందు ప్రచారంలో హామీ కూడా ఇచ్చారు. అలా రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ కూడా సీఎం సిద్ధరామయ్యకు పట్టకపోవడం గమనార్హం. కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి ప్రత్యేక మండలిని ఏర్పాటు చేశారు. అత్యంత వెనుక బడిన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని ఆర్టికల్–371(జే)ని కూడా అమలు చేశారు. నిధుల కేటాయింపులో హై–క పరిధిలో ఏడు జిల్లాలు ఉంటే వాటిలో కలబుర్గి జిల్లాకే అగ్రస్థానం కల్పించడంపై కూడా సీఎంపై విమర్శలు వినవస్తున్నాయి.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు



జిల్లా ఎస్పీని అభినందిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా ఎస్పీ శోభారాణి సూచించారు. ఆమె శుక్రవారం తన కార్యాలయంలో పలు సంఘ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా నగరంలోని తెలుగు సంస్కృతి సమితి కార్యదర్శి ప్రభాకర్, జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కే.రమేష్ బుజ్జి ఆధ్వర్యంలో ఎస్పీని కలిసి అభినందించారు. జిల్లాకు తొలి మహిళా ఎస్పీగా పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో శ్రమిస్తున్నందున తమ వంతు సహకారం అందిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యలపై కూడా ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య తన దృష్టికి వచ్చిందని, కొందరు మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారని, అలాంటి వారిపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ సమస్యలు నియంత్రించడానికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా నిర్భయంగా తమ దృష్టికి తెస్తే చట్టపరంగా వారికి అండగా నిలుస్తామన్నారు. బాలకృష్ణ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవకు అంకితం కండి



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: పట్టాలు పుచ్చుకున్న వైద్యులు ప్రామాణికంగా పేద ప్రజల సేవకు అంకితం కావాలని ముంబై క్యాండీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఆనందరావు అన్నారు. శుక్రవారం నవోదయ వైద్య కళాశాల ఆడిటోరియంలో గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభించి ఎంబీబీఎస్, దంత కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందించి ఆయన మాట్లాడారు. చదివిన చదువును పేదలకు, సమాజానికి ఉపయోగించి కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. స్వయంకృషి, ప్రతిభతో పని చేయాలన్నారు. కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక యుగంలో వైద్యం భవిష్యత్తుకు పునాది కావాలన్నారు. కళ్యాణ కర్ణాటకలో రాయచూరు నవోదయ వైద్య కళాశాలను ప్రారంభించి ఉన్నత విద్యా ప్రమాణాలకు నెలవుగా మార్చారన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు పొందండి

వైద్యులు, నర్సులు సమాజంలో ఉత్తమ సేవలు అందించి గుర్తింపు పొందాలని కర్ణాటక వైద్య మండలి అధ్యక్షుడు డాక్టర్ యోగానందరెడ్డి అన్నారు. గురువారం రాత్రి నగరంలోని నవోదయ వైద్య కళాశాల ఆవరణలో రీగల్–2025 ఉత్సవాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. నేటి విద్యార్థులు పదేళ్లు ముందుకు ఆలోచించి చదివితేనే విజయం సాధిస్తారన్నారు. వైద్యంలో విలువలు పాటిస్తూ రోగుల పట్ల మానవతను చూపాలన్నారు. కార్యక్రమంలో నవోదయ వైద్య కళాశాల ట్రస్టీ ఎస్.రాజేంద్రరెడ్డి, రిజిస్ట్రార్ శ్రీనివాస్, డీ.దేవానంద, గిరీష్, విజయ్‌కుమార్, ఆనంద్‌లున్నారు.

మౌలిక వసతుల కల్పనకు వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

హొసపేటి: కొట్టూరు పట్టణంలోని కొన్ని వార్డుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆల్ ఇండియా దళిత హక్కుల ఉద్యమ సంస్థ(ఏఐడీఆర్‌ఎం) విజయనగర జిల్లా అధ్యక్షుడు కే.కొట్రేష్ పేర్కొన్నారు. పట్టణ పంచాయతీ కార్యాలయంలో చీఫ్ ఎ.నసరుల్లాకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బీ.ఆర్.అంబేడ్కర్ కాలనీలో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, జే.పీ.నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల్లోని వార్డుల్లో మౌలిక వసతులు లేవన్నారు. ఇళ్ల పైకప్పు లేని వారికి పైకప్పులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు నిర్దిష్ట గ్రాంట్‌ను మంజూరు చేయాలన్నారు. గతంలో అందజేసిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మరికొన్ని రోజుల్లో పట్టణ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరవధిక నిరసన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం స్వీకరించిన ప్రధాన కార్యవర్గ మండలి సమావేశంలో తమ డిమాండ్లను అందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాలూకా యూనిట్ అధ్యక్షుడు తెగ్గినకేరి కొట్రేష్, సీపీఎం రాష్ట్ర మహిళా సమాఖ్య కార్యదర్శి కే.రేణుకమ్మ, ఏఐడీఆర్‌ఎం సభ్యులు ఎస్.ప్రకాష్, ఐ.గోపీనాథ్, జీ.కార్తీక్, మణికంఠ, అరుణ్, సాగర్, గోపీనాథ్, కే.నాగరాజ్, అరుణ్, ఝులన్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్ల కేసు రద్దు తగదంటూ రిట్

- ఈనెల 17న హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం

హుబ్లీ: మొత్తం రాష్ట్రమే కాకుండా దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన పాత హుబ్లీ అల్లర్ల కేసును రద్దు చేయాలంటూ సిద్దరామయ్య ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంపై స్థానిక ఇద్దరు న్యాయవాదులు రద్దు చేయడం తగదంటూ రాష్ట్ర హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. ఈమేరకు హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబరులో ఈ తీర్మానం చేయడంతో యువ న్యాయవాదులు ప్రభుత్వ తీరుపై హైకోర్టులో పోరాటానికి నడుం బిగించారు. 2022 ఏప్రిల్ 16న సోషల్ మీడియాలో ఓ నిందితుడు అవమానకరంగా పోస్టు చేసిన తీరుపై అసంతృప్తి చెందిన మైనార్టీ వర్గాలు సుమారు 150 మంది రాళ్లు, కర్రలతో పాత హుబ్లీ పోలీస్ స్టేషన్‌పై ముట్టడికి ప్రయత్నించి తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితి నెలకొనేందుకు కారకులయ్యారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌పై రాళ్లు రువ్వడంతో డ్యూటీలో ఉన్న సిబ్బంది గాయపడ్డారు. అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో పాత హుబ్లీ పోలీసులు నిందితులపై 12 కేసులు దాఖలు చేశారు. గిరీష్ భరద్వాజ్, శ్రీధర్ అనే స్థానిక న్యాయవాదులు ఈ రిట్‌ను వేశారు. ఈ విషయమై వెంకటేష్ దళవాయి ప్రభుత్వం తరపున హైకోర్టులో వాదనలు వినిపిస్తారు. రిట్ విచారణ బెంగళూరులోని హైకోర్టులో మార్చి 17న జరగనుంది. హుబ్లీ యువ న్యాయవాదులకు సంజీవ్ బడస్కర్, అశోక్ అన్వేకర్ బృందంతో కూడిన బెంగళూరు న్యాయవాదులు ఈ అల్లర్ల కేసు రద్దు కాకూడదని అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేసిన దృశ్యం

బళ్లారి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రత్యేక గుణాలు సంతరించుకొంటారని జోళదరాశి జేటీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకులు తిమ్మప్ప జోళదరాశి తెలిపారు. కోట ఆజాద్ ప్రభుత్వ హైస్కూల్, శ్రీరాంపుర హైస్కూల్, మున్సిపల్ ప్రభుత్వ హైస్కూల్, తాలూకాలోని హలకుంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా పరీక్ష ప్యాడ్లతో పాటు పెన్నులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తగినంత ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ప్రశంసించారు. విద్యార్థులకు శాయశక్తుల తన సహాయ సహకారాలను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సీనియర్ విలేకరి మంజునాథ్, టీపీ ఈఓ మడిగిన బసప్ప, విశ్రాంత హెచ్‌ఎం గురురుద్రప్ప, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆనంద్ నాయక్, కెంచప్ప, ఉపాధ్యాయిని డాక్టర్ సిద్దేశ్వరి, ప్రముఖులు రూపనగుడి గోవింద, జనార్ధన్ నాయక, దుర్గప్ప, సత్యనారాయణ, కొక్కరచేడు తిమ్మప్ప, కాయిపల్లె బసవరాజు, రూపనగుడి వెంకటేష్, నాగరాజ్, ప్రెస్ ఫోటోగ్రాఫర్ రుద్రమునిస్వామి, జోళదరాశి తిక్కన్న, చంద్రశేఖర్, మనోజ్, వినోద్, శెక్షావలి, కౌశిక్, శైలేంద్ర, సాయిబన్ని, సుధాకర్ హెగ్డె తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం.. అదే భారతీయం



మాట్లాడుతున్న బసవరాజు

హొసపేటి: అనేక రాష్ట్రాలతో కూడిన బహుత్వ భారతదేశంలో సంస్కృతి, భాష, ఆచార వ్యవహారాలు విభిన్నంగా ఉంటాయని, అదే భారతీయమని కన్నడ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు టీ.హెచ్.బసవరాజు అన్నారు. శుక్రవారం కన్నడ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అనువాద శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. భారతదేశ వైవిధ్యాన్ని తెలుసుకోవాలంటే అనువాదం అవసరమని తెలిపారు. పోటీ ప్రపంచంలో ఆంగ్లం అనివార్యంగా నిలుస్తుందన్నారు. అనువాద కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్ కుంటార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచండి



మాట్లాడుతున్న మారెప్ప

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో అధికంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు భూమి, ఇళ్లు పంపిణీ చేయాలని రైతు, కార్మిక పోరాట సమితి అధ్యక్షుడు మారెప్ప పేర్కొన్నారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు గూడు, కూడు, గుడ్డ అనే నినాదానికి నీళ్లు వదులుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు భూమి, ఇళ్ల పట్టాలను అందించాలన్నారు. విద్యుత్, ఏపీఎంసీ, కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు.

ఘరానా దొంగ అరెస్టు

- రూ.11.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



జప్తు చేసిన ఆభరణాలు, సెల్‌ఫోన్లతో పోలీసులు

హొసపేటి: చోరీ కేసులో నిందితుని బంధించి అతని వద్ద ఉన్న రూ.11.25 లక్షల విలువైన ఆభరణాలను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతనెల 25న నగరంలోని జాలేరా వీధిలోని ఓ ఇంటిలో సుమారు రూ.11.25 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాల చోరీ జరిగినట్లు తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని చోరీకి పాల్పడ్డ నిందితున్ని పట్టుకొనేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టారన్నారు. దొంగతనానికి పాల్పడ్డ నిందితుడు నగర శివార్లలో జంబునాథ రహదారి ఏరియాలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పకడ్బందీగా నిందితుడిని పట్టుకొన్నట్లు తెలిపారు. హుబ్లీకి చెందిన మహమ్మద్ అలీ నాలబంది ఈ చోరీకి పాల్పడినట్లు ఆయన తెలిపారు. అదనపు జిల్లా ఎస్పీ సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

కోల్పోయిన మొబైళ్ల అప్పగింత

రూ.20.74 లక్షల విలువైన సుమారు 123 మొబైళ్లను గుర్తించి జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వారసులకు అప్పగించారు. హొసపేటి సబ్ డివిజన్ పరిధిలో మొబైల్ ఫోన్ల చోరీకి గురైన వారు పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై మొబైల్ ఫోన్లను గుర్తించేందుకు ఎస్పీ శ్రీహరిబాబు మార్గదర్శకత్వంలో అడిషనల్ ఎస్పీ సలీంపాషా సలహా సూచనల మేరకు డీఎస్పీ డాక్టర్ టి.మంజునాథ్ ఆధ్వర్యంలో వివిధ పోలీస్ స్టేషన్లలో మొబైళ్ల చోరీలపై కేసు నమోదు చేశారు.

ఉత్తర కర్ణాటకకు నిరాశాదాయక బడ్జెట్

- ఒక్క భారీ పరిశ్రమనూ ప్రకటించలేదు
- కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు



బడ్జెట్‌పై మాట్లాడుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

హుబ్లీ: పేదల పెన్నిధి, సమాజ్‌వాది నేతగా ఈసారి రికార్డు స్థాయిలో 16వ సారి రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను ప్రతిపాదించిన సీఎం సిద్ధరామయ్య బడ్జెట్‌పై ఉత్తర కర్ణాటక ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకోగా, ఈసారి నిరాశాదాయక బడ్జెట్ సమర్పించారని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎస్‌ఎఫ్ సంశిమఠ తెలిపారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర కర్ణాటకకు ఒక్క ఫ్యాక్టరీ, భారీ పరిశ్రమను కూడా ప్రకటించలేదన్నారు. ఈ బడ్జెట్ కేవలం బెంగళూరు, మైసూరు, తుమకూరులకు మాత్రమే పరిమితమైందన్నారు. ఉత్తర కర్ణాటకకు ఏమీ ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

బెంగళూరుకు మాత్రమే పరిమితమైంది

కార్యదర్శి రవీంద్ర బళిగార మాట్లాడుతూ రూ.4 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినా కేవలం బెంగళూరుకు మాత్రమే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో రెండో అతి పెద్ద జంట నగరాలైనా హుబ్లీ– ధార్వాడ ప్రజలను అసలు పట్టించుకోలేదని అసంతృప్తిని వెళ్లగక్కారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా పరిశ్రమల పరికరాల ఫ్యాక్టరీ, ఐటీబీటీ క్లస్టర్, పర్యాటక శాఖలకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరామన్నారు. అలాగే హుబ్లీ, ధార్వాడ ప్రత్యేక పాలికెలకు విడివిడిగా నిధులు కేటాయిస్తారని ఆశించామన్నారు. అయితే అలా ఇవ్వలేదన్నారు. కనీసం ప్రభుత్వ ఉద్యోగుల పన్నులు కూడా పెంచలేదన్నారు. మొత్తానికి ఈ బడ్జెట్ ఉత్తర కర్ణాటకకు నిరాశదాయక బడ్జెట్ అన్నారు.

మిగులు బడ్జెట్ ప్రతిపాదన హర్షణీయం

సంయుక్త కార్యదర్శి మహేంద్రసింగి మాట్లాడుతూ సిద్ధూ గ్యారెంటీ పథకాలను కొనసాగిస్తూ మిగులు బడ్జెట్ ప్రతిపాదించడం హర్షణీయమన్నారు. ముస్లింలతో పాటు జైనులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు, మైనార్టీలకు రిజర్వేషన్లకు బదులుగా కేవలం ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్లను కేటాయించారన్నారు. ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ చెన్నవీర ముంగరవాడి మాట్లాడుతూ సిద్దరామయ్య అన్ని వర్గాల మేలు కోసం కృషి చేశారన్నారు. చాలినంత నిధులను ఉచిత పథకాలకు కేటాయించారన్నారు. మిగిలిన వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రయత్నించారన్నారు. సాధారణంగా చూస్తే ఇది మంచి బడ్జెట్. అయితే హుబ్లీ, ధార్వాడ విషయానికి వస్తే, ఉత్తర కర్ణాటకు కూడా ఏ కొత్త కార్యక్రమాన్ని ప్రకటించకపోవడంతో అభివృద్ధి ఆనవాలు లేకుండా చేయడం ఉత్తర కర్ణాటకకు బడ్జెట్‌లో నిరాశను కలిగించిందన్నారు.

రేపు ధార్వాడలో భారీ ఉద్యోగ మేళా

హుబ్లీ: ప్రభుత్వ సూచనల మేరకు ఆదివారం ధార్వాడ కేసీడీ ఆవరణలో కౌసల్య రోజ్‌గార్ ఉద్యోగ మేళాను ఏర్పాటు చేశారు. ఈవిషయంలో వివిధ సన్నాహాలను జిల్లాధికారిణి దివ్యప్రభు శుక్రవారం స్వయంగా ఆ ఆవరణకు వెళ్లి పరిశీలించారు. కాగా గత నెల 25 నుంచి నిరుద్యోగుల నుంచి నమోదు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైంది. ఈనెల 7 వరకు కొనసాగింది. అంతేగాక ఆదివారం రోజు కూడా నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొనే అవకాశం ఉందన్నారు. 65 పరిశ్రమలు, 25 మానవ వనరుల సంస్థల ప్రతినిధులు ఈ మేళాలో తమకు కావాల్సిన ఉద్యోగార్థులను నియామకం చేసుకొంటారు. ఇందుకు సంబంధించి వచ్చే వారందరికీ అన్ని ఏర్పాట్లను కేసీడీ పర్యాటక విభాగం, డాక్టర్ గోకాక్ గ్రంథాలయ భవనంలో ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు చేశారు. వంద మంది స్వచ్ఛంద కార్యకర్తలను నియమించారు. తాగునీరు, మరుగుదొడ్లు, వెయిటింగ్ రూంలను ఏర్పాటు చేశారు. ప్రక్రియ అంతా క్రమశిక్షణతో జరిగేలా అసిస్టెంట్ కమిషనర్‌ను నోడల్ అధికారిగా నియమించారు. జెడ్పీ సీఈఓ భువనేష్ పాటిల్ మాట్లాడుతూ మేళాలో సంస్థ సమాచారం తెలియజేస్తూ మైకుల ద్వారా ఆ రోజున ప్రచారం చేస్తామన్నారు. పోలీసు కమిషనర్ శశికుమార్ మేళాకు అవసరమైన భద్రత చర్యలు తీసుకొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా హట్టి బంగారు గనుల కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హట్టి బంగారు గనుల కంపెనీ కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం అధ్యక్షుడు ఫకృద్దీన్ మాట్లాడారు. కార్మికులకు వైద్య పరీక్షలు చేపట్టాలని, 2020–21లో పీఎల్‌బీ పరిహారం అందించాలన్నారు. 2023లో కార్మికులకు పదోన్నతి కల్పించాలన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఆందోళనలో వెంకటేష్, షఫీ, అల్లాభక్షి, శ్రీధర్‌లున్నారు.

అశ్లీల ఫోటోల అప్‌లోడ్‌పై ఫిర్యాదు

హుబ్లీ: సోషల్ మీడియాలో అశ్లీల ఫోటోలను అప్‌లోడ్ చేసిన ఆరోపణలపై ఓ వ్యక్తికి వ్యతిరేకంగా కేసు దాఖలైంది. పాత హుబ్లీకి చెందిన మహమ్మద్ సాదిక్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు ఈ కేసు నమోదు చేసుకొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ



జాగృతి జాతాలో పాల్గొన్న ఉద్యోగులు

రాయచూరు రూరల్: ద్విచక్ర వాహనంలో సంచరించే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సిటీ కార్పొరేషన్ కమిషనర్ గురుసిద్దయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పాత జిల్లాధికారి కార్యాలయం వద్ద హెల్మెట్ వాడకంపై జాగృతి జాతాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రమాదాల బారి నుంచి రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది జాగృతి కల్పించారు.

9న భారీ రక్తదాన శిబిరం

హుబ్లీ: హుబ్లీ–ధార్వాడ సమస్త బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో రాష్ట్రోత్థాన బ్లడ్‌బ్యాంక్ సహకారంతో ఆదివారం భవానీనగర్ రాఘవేంద్ర స్వామి మఠంలో భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ పవన్ జోషి తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఉదయ 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. ఈసారి రాఘవేంద్రస్వాముల 430వ వర్ధంతి ఉత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి ఎక్కువ సంఖ్యలో దాతలు రక్తాన్ని దానం చేయవచ్చన్నారు. అనంతరం రక్తపరీక్ష శిబిరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా దత్తమూర్తి కులకర్ణి, కిరణ్ హెగ్డె, లక్ష్మణ్ కులకర్ణి పాల్గొన్నారు.